

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 29-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 343 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య సా.4:29 తదుపరి పాడ్యమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.7:26 తదుపరి రేవతి, వర్జ్యం: ఉ.6:39-8:04, తె.6:00 మొ., అమృతఘడియలు: మ.3:10-4:35, దుర్ముహూర్తం: ఉ.6:15-7:52, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6:15, సూర్యాస్తమయం: 6:2 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



గోల్డ్ మరో ఆల్‌టైం రికార్డు

- రూ.92,000 దాటిన 10 గ్రాముల ధర
- ఒక్కరోజే రూ.1,100 పెరుగుదల

న్యూఢిల్లీ: పసిడి ధరలు సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠానికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర శుక్రవారం రూ.1,100 పెరిగి రూ.92,150కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం కూడా అదే స్థాయిలో పెరిగి రూ.91,700కి చేరుకుంది. గోల్డ్ రేట్లు పెరగడం వరుసగా ఇది మూడో రోజు. కిలో వెండి సైతం రూ.1,300 పెరుగుదలతో రూ.1,03,000 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నేషనల్ స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,086.08 డాలర్లకు చేరగా.. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు రేటు సరికొత్త రికార్డు గరిష్ఠం 3,124.40 డాలర్లకు ఎగబాకింది. స్పాట్ సిల్వర్ 34.42 డాలర్లకు పెరగగా.. కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు రేటు 35.33 డాలర్లకు చేరింది.

2024-25లో గోల్డ్ 35 శాతం అప్: ఈ ఆర్థిక సంవత్సరం తొలి రోజున (2024 ఏప్రిల్ 1) రూ.68,420 పలికిన 10 గ్రాముల బంగారం.. గడిచిన ఏడాది కాలంలో రూ.23,730 (35 శాతం) పెరిగింది. ఫెడ్ రేట్ల తగ్గింపు, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతోపాటు తాజాగా ట్రంప్ సుంకాలు గోల్డ్ ర్యాలీకి కారణమయ్యాయి. ట్రంప్ సుంకాలతో మున్ముందు ఆర్థిక అనిశ్చితులు మరింత తీవ్రతరమయ్యే అవకాశాలున్నాయి. ఇందుకుతోడు, అమెరికా మళ్లీ ఆర్థిక మాంద్యంలోకి జారుకోవచ్చన్న అంచనాలూ ఉన్నాయి. ఇదే గనక జరిగితే, బంగారం, వెండి ధరలు మరింత ఎగబాకడం ఖాయమని బులియన్ విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఔన్స్ గోల్డ్ 3,300 డాలర్లకు చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 3,300 డాలర్లకు చేరితే, దేశీయంగా తులం మేలిమి బంగారం రూ.లక్ష దాటే అవకాశాలున్నాయి.

రూ.26 లక్షల కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెరిగిన మార్కెట్ సంపద ఇది.. ● సెన్సెక్స్ 5 శాతం వృద్ధితో సరి

ముంబై: ఈ మార్చి 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈక్విటీ మదుపరుల సంపద రూ.25.90 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 3,763.57 పాయింట్లు (5.10 శాతం), నిఫ్టీ 1,192.45 పాయింట్లు (5.34 శాతం) వృద్ధిని నమోదు చేశాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో భారీ రిటర్నులు పంచిన స్టాక్ మార్కెట్.. 2024-25లో మాత్రం తీవ్ర ఒడుదుడుకులను చవిచూసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో సెన్సెక్స్ 14,659.83 పాయింట్లు (24.85 శాతం) పుంజుకోగా.. ఈక్విటీ మదుపరుల సంపద రికార్డు స్థాయిలో రూ.128.77 లక్షల కోట్ల మేర పెరిగింది.



2024-25కు నష్టాలతో వీడ్కోలు

ఈ ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ సూచీలు నష్టాలతో వీడ్కోలు పలికాయి. వాహన రంగంపై ట్రంప్ సుంకాల ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్ బలహీనపడింది. దాంతో మన దలాల్ స్ట్రీట్ ఇన్వెస్టర్లూ అమ్మకాలకే మొగ్గుచూపారు. శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 191.51 పాయింట్ల నష్టంతో 77,414.92 వద్ద ముగియగా.. నిఫ్టీ 72.60 పాయింట్లు కోల్పోయి 23,519.35 వద్ద స్థిరపడింది. మార్కెట్ సంపద రూ.412.87 లక్షల కోట్ల (4.82 లక్షల కోట్ల డాలర్లు) వద్ద ముగిసింది.

ప్రథమార్థంలో జోరు.. ద్వితీయార్థంలో బేజారు

ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం (ఏప్రిల్-సెప్టెంబరు)లోనూ మార్కెట్ల జోరు కొనసాగింది. తొలి ఆరు నెలల్లో సూచీలు 17 శాతం పెరిగాయి. గత ఏడాది సెప్టెంబరు 27న సెన్సెక్స్ 85,978.25 పాయింట్ల వద్ద ఆల్‌టైం రికార్డు గరిష్ఠాన్ని తాకింది. కానీ, దీర్ఘకాలిక బుల్‌రన్ కారణంగా చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతుండటం, అంతర్జాతీయ అనిశ్చితులు, కార్పొరేట్ కంపెనీల నిరాశాజనక త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు అక్టోబరు నుంచి మన మార్కెట్లోని పెట్టుబడులను ఉపసంహరించుకోవడం మొదలుపెట్టారు. దాంతో ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో మార్కెట్ తీవ్ర ఒత్తిడికి లోనైంది. గత 29 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా వరుసగా ఐదు నెలలు (అక్టోబరు-ఫిబ్రవరి) ప్రామాణిక సూచీలు భారీగా దిద్దుబాటుకు లోనయ్యాయి. కేవలం అక్టోబరులోనే సెన్సెక్స్ 4,910.72 పాయింట్లు (5.82 శాతం) క్షీణించింది. ఈ ఏడాదిలో ట్రంప్ సుంకాల మోత మార్కెట్‌ను మరింత కుంగదీసింది. అయినప్పటికీ, రిటైల్ మదుపరులు, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల దన్నుతో సూచీలు ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక అంకె వృద్ధిని మాత్రమే నమోదు చేయగలిగాయి.

2025-26లోనూ కొనసాగనున్న అంతర్జాతీయ అనిశ్చితులు

దేశీయంగా పటిష్ఠ ఆర్థిక మూలాలు, ఆర్‌బీఐ వడ్డీ రేట్లను మరింత తగ్గించే అవకాశాలతో పాటు కార్పొరేట్ కంపెనీల పనితీరు మళ్లీ పుంజుకోనుందన్న అంచనాలు ఈ ఏప్రిల్ 1తో ప్రారంభం కానున్న కొత్త ఆర్థిక సంవత్సరం (2025-26)లో మార్కెట్లకు సానుకూలంగా పరిణమించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధాలు తీవ్రతరమయ్యే ప్రమాదంతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పశ్చిమాసియా నుంచి యూరప్‌నకు మళ్లే అవకాశాలు మార్కెట్లకు ప్రతికూలంగా పరిణమించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

2024-25లో 2 శాతం క్షీణించిన రూపాయి

ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ శుక్రవారం 24 పైసలు పెరిగి రూ.85.50 వద్ద ముగిసింది. మన ఈక్విటీ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మళ్లీ పెట్టుబడులు పెంచడం ఇందుకు దోహదపడింది. ఈ నెలలో రూపాయి మారకం విలువ 2.17 శాతం పెరిగింది. గడిచిన ఆరేళ్లకు పైగా కాలంలో మన కరెన్సీకిదే అత్యుత్తమ వృద్ధి. 2018 నవంబరులో రూపాయి 5 శాతానికి పైగా బలపడింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూపీ మారకం విలువ 2 శాతానికి పైగా క్షీణించింది. ఆర్థిక సంవత్సరం తొలి ట్రేడింగ్ సెషన్ అయిన ఏప్రిల్ 2న డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.83.42గా నమోదైంది.

అరబిందో ఇన్‌ఫ్రాకు అవార్డు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మౌలిక వసతుల రంగంలోని అరబిందో ఇన్‌ఫ్రా.. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నుంచి "ఎర్లీ ఆపరేషనలైజేషన్" విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన అవార్డు అందుకుంది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అరబిందో ఇన్‌ఫ్రా మైనింగ్ విభాగం హెడ్ సంజయ్ వినోద్ మిశ్రా ఈ అవార్డును కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అరబిందో ఇన్‌ఫ్రాకు ప్రస్తుతం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణల్లో నాలుగు బొగ్గు బ్లాక్‌లతో పాటు మధ్యప్రదేశ్‌లో మూడు రాక్ ఫాస్ఫేట్ బ్లాక్‌లున్నాయి. ఇందులో మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో ఉన్న టక్లి జెనా బొలేరా-ఉత్తర, దక్షిణ బొగ్గు బ్లాక్ పూర్తి స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా మిగతా బ్లాక్‌ల అనుమతులు వివిధ దశల్లో ఉన్నాయి. టక్లి జెనా బొలేరా బ్లాక్‌ను కేవలం రెండు సంవత్సరాల రికార్డు వ్యవధిలోనే పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించినందుకు గాను ఈ అవార్డు లభించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	460
వరంగల్	442	గోదావరి	445
చిత్తూరు	510	విశాఖపట్నం	445
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	116	విజయవాడ	122
వరంగల్	116	గుంటూరు	122
కరీంనగర్	116	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	116	చిత్తూరు	98
కర్నూలు	116	నెల్లూరు	103
విశాఖపట్నం	104	అనంతపురం	103
గోదావరి	122		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,980 ▲	83,400 ▲	1,14,000 ▲
విజయవాడ	92,200 ▲	86,500 ▲	1,04,000 ▲
విశాఖపట్నం	89,300 ▲	81,860 ▲	1,01,920 ▲
రాజమండ్రి	90,980 ▲	83,400 ▲	1,03,800 ▲
ప్రొద్దుటూరు	91,000 ▲	84,270 ▲	1,02,000 ▲
ముంబై	89,164 ▲	81,674 ▲	1,00,892 ▲

చిన్న మొత్తాల పొదుపు వడ్డీ రేట్లు యథాతథం

న్యూఢిల్లీ: పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు (ఎన్ఎస్‌సీ) సహా చిన్న తరహా పొదుపు పథకాలన్నింటిపై వడ్డీ రేట్లను ప్రభుత్వం యథాతథంగా కొనసాగించింది. దీంతో చిన్న పొదుపు పథకాల్లో ఇన్వెస్ట్ చేసిన వారికి ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కూడా ప్రస్తుత రేటులోనే వడ్డీ లభిస్తుంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పథకాల వడ్డీ రేట్లలో యథాతథ స్థితిని కొనసాగించడం వరుసగా ఇది ఐదోసారి.

ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీకి ఊతం

రూ.22,919 కోట్లతో పీఎల్ఐ పథకం

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకానికి కేంద్ర ప్రభుత్వం మరింత పదును పెడుతోంది. ఇందులో భాగంగా ఈ పథకం కింద ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ దేశీయంగా తయారు చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీలను ప్రోత్సహించేందుకు రూ.22,919 కోట్లు కేటాయించింది. దేశీయంగా సెమికండక్టర్ యేతర ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎల్ఐ పథకాన్ని ప్రకటించడం ఇదే మొదటిసారి.

ఏటీఎం లావాదేవీలు మరింత భారం

మే 1 నుంచి చార్జీలు పెంపు

ముంబై: ఏటీఎం నుంచి ఎలాంటి చార్జీలు లేకుండా ఉచితంగా నగదు విత్‌డ్రా చేసుకునేందుకు ఇచ్చిన గరిష్ఠ పరిమితి దాటిన అనంతరం చేసే ప్రతి లావాదేవీ పైన యూసేజ్ చార్జీ రూ.2 వంతున పెంచేందుకు బ్యాంకులకు ఆర్‌బీఐ అనుమతించింది. దీంతో ఇక నుంచి అలాంటి ప్రతి లావాదేవీ పైన రూ.23 యూసేజ్ చార్జి పడుతుంది. మే 1 నుంచి యూసేజ్ చార్జి రూ.2 వంతున పెంచేందుకు అనుమతించినట్టు ఆర్‌బీఐ తెలిపింది. ప్రస్తుతం బ్యాంకులు ఉచిత పరిమితి దాటి చేసే ఒక్కో లావాదేవీపై రూ.21 చార్జి చేస్తున్నాయి. బ్యాంక్ కస్టమర్లు ప్రతి నెలా తమ సొంత బ్యాంక్ ఏటీఎంల నుంచి ఐదు ఉచిత లావాదేవీలు (ఆర్థిక, ఆర్థికేతర) నిర్వహించుకునేందుకు అనుమతిస్తున్నారు. ఇతర బ్యాంకుల ఏటీఎం నుంచైతే ఉచిత లావాదేవీల సంఖ్య (ఆర్థిక, ఆర్థికేతర) మెట్రో నగరాల్లో 3కే పరిమితం చేశారు. మిగతా ప్రాంతాల్లో ఐదు లావాదేవీలను అనుమతిస్తారు. నగదు రీసైక్లర్ మెషీన్‌లో చేసే లావాదేవీలకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని తెలిపింది.

- సువెన్ ఫార్మాలో కోహన్స్ లైఫ్‌సైన్సెస్ కంపెనీ విలీనానికి మార్గం సుగమమైంది. ఎన్‌సీఎల్‌టీ ఇందుకు ఆమోదం తెలిపినట్టు సువెన్ ఫార్మా తెలిపింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్‌తో సహా ఇతర రెగ్యులేటరీ సంస్థల అనుమతులు లభించిన రోజు నుంచే ఈ విలీనం అమల్లోకి వస్తుందని పేర్కొంది.
- హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్ (హాప్).. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా భీమవరంలో కొత్త ఎక్స్‌క్లూజివ్ ఔట్‌లెట్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో సంస్థకిది 4,000 ఔట్‌లెట్.
- కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా శుక్రవారం విశాఖపట్నంలో కొత్త శాఖను ప్రారంభించింది. విశాఖతో పాటు చెన్నైలో కూడా కొత్త శాఖను ఏర్పాటు చేసింది. దీంతో బ్యాంక్ మొత్తం శాఖల సంఖ్య 888కి చేరింది.
- దేశవ్యాప్తంగా 170కి పైగా నగరాలు, పట్టణాలకు అమెజాన్ ఫ్రెష్ పూర్తి స్థాయిలో గ్రోసరీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని అమెజాన్ ఇండియా ప్రకటించింది. 11 వేల మంది రైతుల నుంచి పళ్లు, కూరగాయలు సేకరించి విక్రయిస్తోంది.

పబ్లిక్ ఇష్యూకి ఆర్డీ ఇంజనీరింగ్

రూ.580 కోట్ల సమీకరణ లక్ష్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఆర్డీ ఇంజనీరింగ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వస్తోంది. ఐపీఓ ద్వారా రూ.580 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ రూ.500 కోట్ల తాజా ఈక్విటీ జారీ చేయనుండటంతో పాటు ప్రమోటర్ చంద్రశేఖర్ మోటూరుకు చెందిన రూ.80 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించాలని భావిస్తోంది. అంతేకాదు, ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.100 కోట్ల వరకు సమీకరించే ఆలోచన కూడా ఉంది. ఒకవేళ ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా నిధులు సమీకరిస్తే, ఐపీఓలో తాజా ఈక్విటీ జారీ సైజును తగ్గించుకోనుంది. తాజా ఈక్విటీ జారీ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.279.6 కోట్లను తెలంగాణలోని సీతారాంపూర్‌లో 2 కొత్త తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు వినియోగించుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. మరో రూ.44.8 కోట్లతో ఏపీలోని పరవాడలో కొత్త ఇంటిగ్రేటెడ్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌నూ ఏర్పాటు చేయాలనుకుంటోంది. మరో రూ.65 కోట్లను రుణాలను తిరిగి చెల్లించేందుకు, మిగతా సొమ్మును వ్యాపార అవసరాల కోసం వినియోగించుకోవాలనుకుంటోంది.

మనీషా పసిడి పట్టు

పంగల్‌కు కాంస్యం ● ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్



మనీషా



అంతిమ్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్లు రెండోరోజూ అమోఘ ప్రదర్శన కనబరచి రెండు పతకాలు కైవసం చేసుకున్నారు. మనీషా భన్వాలా (62కి.) పసిడి పతకం కొల్లగొట్టగా, అంతిమ్ పంగల్ (53కి.) కాంస్య పతకం సాధించింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన 62 కి. విభాగం ఫైనల్లో మనీషా 8-7తో కిమ్ ఓక్ జే (కొరియా)ని ఓడించి స్వర్ణ పతకం పట్టేసింది. ఈ చాంపియన్‌షిప్‌లో భారత్‌కిదే తొలి పసిడి పతకం కావడం విశేషం. తొలి బౌట్‌లో 11-0తో దుబెక్ (కజకిస్థాన్)పై గెలుపొందిన మనీషా..క్వార్టర్‌ఫైనల్లో 3-0తో లీ (కొరియా)పై, సెమీఫైనల్లో 5-1తో కల్మిరా (కిర్గిస్థాన్)పై విజయం సాధించింది. 53 కి.విభాగం కాంస్య పతక పోరులో 20 ఏళ్ల పంఘల్ 10-0తో మెంగ్ హువాన్‌ను చిత్తు చేసి విజేతగా నిలిచింది. క్వార్టర్‌ఫైనల్లో చైనాకు చెందిన జిన్ జాంగ్‌ను 10-6తో ఓడించిన అంతిమ్ సెమీఫైనల్లో మో కియోకా (జపాన్) చేతిలో 0-10తో ఓడిపోయింది. నేహ శర్మ (57కి.), మోనిక (65కి.), జ్యోతి బెరివాల్ (72కి.) పతక రౌండ్‌కు క్వాలిఫై కాలేక పోయారు. గురువారంనాడు మహిళలు మూడు పతకాలు కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక..ఈ చాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు భారత్ మొత్తం ఏడు పతకాలు ఖాతాలో వేసుకుంది. మహిళలు ఐదు పతకాలు నెగ్గగా, పురుషులు గ్రీకో రోమన్‌లో రెండు పతకాలు అందుకున్నారు.

నిత్య 'డబుల్'

జ్యోతికి హర్డిల్స్ టైటిల్ — ఇండియన్ గ్రాండ్‌ప్రీ-1



నిత్య
జ్యోతి

బెంగళూరు: తెలంగాణకు చెందిన నిత్య గంథె ఇండియన్ గ్రాండ్‌ప్రీ-1 పోటీల్లో డబుల్ సాధించింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల 100, 200 మీటర్ల ఈవెంట్లలో నిత్య అగ్రస్థానంలో నిలిచింది. కాగా 100మీ. హర్డిల్స్‌లో ఆంధ్రకు చెందిన జ్యోతి యర్రాజి సత్తాచాటింది. 100 మీటర్ల పరుగులో నిత్య 11.41 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుంది. ఇక 200 మీటర్ల పరుగును నిత్య 23.36 సెకన్లలో పూర్తిచేసి టాప్‌లో నిలవగా, జ్యోతి (23.55 సె) రెండో స్థానంతో సరిపెట్టుకుంది. 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి టైటిల్‌ను దక్కించుకుంది. జ్యోతి 13.07 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని ప్రథమస్థానంలో నిలిచింది. కాగా ఇక్కడి ప్రదర్శనతో నిత్య, జ్యోతి ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించారు.

గురిందర్‌వీర్ రికార్డు పరుగు: స్ప్రింటర్ గురిందర్‌వీర్ సింగ్ అత్యంత వేగంగా 100మీ. రేసును పూర్తి చేసిన భారత అథ్లెట్‌గా నిలిచాడు. రిలయన్స్ తరపున బరిలోకి దిగిన ఈ పంజాబీ 10.20 సెకన్లలోనే రేసును పూర్తి చేశాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం మణికంఠ హోబ్లీధర్ నెలకొల్పిన రికార్డు (10.23సె)ను అధిగమించాడు. మణికంఠ (10.22) ద్వితీయ స్థానంలో, అమలన్ బోర్గోహైన్ (10.43) తృతీయ స్థానాల్లో నిలిచారు.

తమీమ్ డిశ్చార్జి



ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడు. గత సోమవారం దేశవాళీ క్రికెట్ మ్యాచ్ ఆడుతుండగా తీవ్ర గుండెనొప్పి రావడంతో ఢాకాలోని ఓ ఆస్పత్రికి తరలించి స్టెంట్ వేశారు. అనంతరం మరో హాస్పిటల్‌లో చేర్చి చికిత్స కొనసాగించారు.

ఎన్నేళ్లో వేచిన విజయం..

- 17 ఏళ్ల తర్వాత చెపాక్‌లో మురిసిన బెంగళూరు
- 50 రన్స్ తేడాతో చెన్నై చిత్తు
- రజత్ పటీదార్ హాఫ్ సెంచరీ

1 — సీఎస్‌కే తరఫున ఎక్కువ పరుగులు (4699) సాధించిన బ్యాటర్‌గా ఎంఎస్ ధోనీ. రైనా (4687)ను అధిగమించాడు. | ఐపీఎల్‌లో 3వేల పరుగులు+100 వికెట్లు తీసిన ఏకైక ప్లేయర్‌గా జడేజా



పటీదార్ (51)

చెన్నై: ఒకటా.. రెండా ఏకంగా 17 ఏళ్ల తర్వాత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇక్కడి చెపాక్ మైదానంలో విజయం రుచి చూసింది. బ్యాటింగ్‌లో మెరుపులతో పాటు బౌలింగ్‌లోనూ అదరగొట్టిన ఆర్‌సీబీ శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 50 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఐపీఎల్ ఆరంభ సీజన్ 2008లో బెంగళూరు ఇక్కడ తొలిసారి గెలిచింది. అప్పటికి విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయకపోవడం గమనార్హం. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 196 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 51), సాల్ట్ (16 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 32), విరాట్ (30 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 31) రాణించారు. నూర్ అహ్మద్‌కు మూడు, పథిరనకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులు చేసి ఓడింది. రచిన్ (41), ధోనీ (30 నాటౌట్), జడేజా (25) ఫర్వాలేదనిపించారు. హాజెల్‌వుడ్‌కు మూడు.. యష్, లివింగ్‌స్టోన్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రజత్ పటీదార్ నిలిచాడు.

ఆది నుంచే తడబ్యాటు..: ఆర్‌సీబీ ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగిన చోట సీఎస్‌కే బ్యాటర్లు తెగ కష్టపడ్డారు. అటు పేసర్లు, స్పిన్నర్లు సమష్టిగా రాణించి ఈ విజయంలో కీలకమయ్యారు. టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ ఎలాంటి ప్రభావమూ చూపలేకపోయింది. ఓపెనర్ రచిన్ మాత్రం కాస్త నిలదొక్కుకోగా.. చివర్లో ధోనీ మెరుపులతో ఊరటనిచ్చాడు. పేసర్ హాజెల్‌వుడ్ రెండో ఓవర్‌లోనే ఓపెనర్ త్రిపాఠి (5), కెప్టెన్ రుతురాజ్ (0)లను వెనక్కి పంపి షాకిచ్చాడు. దీపక్ హుడా (4)ను భువనేశ్వర్ అవుట్ చేయడంతో జట్టు పవర్‌ప్లేలో 30/3 స్కోరుతో దయనీయంగా కనిపించింది. హిట్టింగ్ కోసం వచ్చిన సామ్ కర్రాన్ (8) చేసేదేమీ లేకపోయింది. ఈ దశలో రచిన్-దూబే జోడీ అడపాదడపా బౌండరీలతో ఆశలు రేపింది. అయితే 13వ ఓవర్‌లో పేసర్ యష్ ఈ ఇద్దరినీ బౌల్డ్ చేసి సీఎస్‌కేకు ఓటమిని కళ్ల ముందుంచాడు. అప్పటికి స్కోరు 80/6. అశ్విన్ (11)ను స్పిన్నర్ లివింగ్‌స్టోన్ అవుట్ చేశాక 16వ ఓవర్‌లో ధోనీ క్రీజులోకి వచ్చాడు. అప్పటికి సమీకరణం 29 బంతుల్లో 98 రన్స్‌గా ఉండడంతో చెపాక్‌లో ఆర్‌సీబీ విజయం ఖాయమైంది. జడేజా -ధోనీ మధ్య 8వ వికెట్‌కు అత్యధికంగా 31 పరుగులు జత చేరినా ఫలితం లేకపోయింది. చివరి ఓవర్‌లో 67 రన్స్ అవసరపడగా.. ధోనీ 6,6,4తో ఫ్యాన్స్‌లో కాస్త జోష్ నింపాడు.

రజత్, సాల్ట్ జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి ఓపెనర్ సాల్ట్ మెరుపు ఆరంభాన్ని అందించాడు. అలాగే బరిలోకి దిగిన ప్రతీ బ్యాటరూ బాదడమే లక్ష్యంగా ఆడే ప్రయత్నం చేశారు. కానీ ఓపెనర్ విరాట్ మాత్రం షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడ్డాడు. అటు కెప్టెన్ రజత్ పటీదార్ మూడు క్యాచ్‌లను చెన్నై ఫీల్డర్లు వదిలేయడం ఆర్‌సీబీ భారీ స్కోరుకు కారణమైంది. స్పిన్నర్ నూర్ అహ్మద్ మరోసారి ప్రభావం చూపాడు. తొలి ఓవర్‌లోనే సాల్ట్ రెండు ఫోర్లు, తర్వాతి ఓవర్‌లో 6,4,4తో ఎదురుదాడికి దిగాడు. ఐదో ఓవర్‌లో అతడిని స్పిన్నర్ నూర్ అహ్మద్ అవుట్ చేయగా తొలి వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత దేవ్‌దత్ సిక్సర్‌తో పవర్‌ప్లేలో జట్టు 56/1తో నిలిచింది. ఏడో ఓవర్‌లో పడిక్కళ్ 4,4,6తో 15 పరుగులు రాబట్టాడు. అశ్విన్ ఓవర్‌లో తను నిష్క్రమించాక బరిలోకి దిగిన పటీదార్ మరింత చెలరేగాడు. అయితే అతను 17 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన సులువైన క్యాచ్‌ను లాంగాఫ్‌లో దీపక్ హుడా వదిలేయడం ఆర్‌సీబీకి కలిసివచ్చింది. అటు నెమ్మదిగా ఆడి ఒత్తిడికి లోనైన విరాట్‌ను నూర్ అహ్మద్ అవుట్ చేశాడు. 14వ ఓవర్‌లో రజత్ 6,4,4తో 15 రన్స్‌తో స్కోరు మళ్లీ వేగం పుంజుకుంది. లివింగ్‌స్టోన్ (10), జితేశ్ (12) స్వల్ప స్కోర్లకు వెనుదిరగ్గా, 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన పటీదార్ 19వ ఓవర్‌లో భారీ షాట్‌కు వెళ్లి పథిరనకు చిక్కాడు. ఈ ఓవర్‌లో వైడ్ రూపంలో ఒకే పరుగు రాగా క్రునాల్ కూడా డకౌటయ్యాడు. అయితే ఆఖరి ఓవర్‌లో టిమ్ డేవిడ్ (22 నాటౌట్) హ్యాట్రిక్ సిక్సర్లతో 19 రన్స్ అందించడంతో ఆర్‌సీబీ 190 రన్స్ దాటగలిగింది.

ధోనీ.. మరోసారి: ధోనీ మెరుపు స్టంపింగ్ మరోసారి ఫ్యాన్స్‌ను అబ్బురపరిచింది. ముంబైతో మ్యాచ్‌లో సూర్యకుమార్‌ను అవుట్ చేసిన మాదిరే.. ఈసారి ఆర్‌సీబీపై ఓపెనర్ సాల్ట్ పనిబట్టాడు. వేగంగా ఆడుతున్న అతడిని స్పిన్నర్ నూర్ అహ్మద్ ఓవర్‌లో 0.16 సెకన్లలోనే స్టంప్ చేశాడు. వాస్తవానికి సాల్ట్ క్రీజులో నుంచి కాళ్లు తీసినట్టుగా కూడా కనిపించలేదు. కానీ రీప్లేలో మాత్రమే అతడి కాలు గాల్లోకి లేచినట్టు కనిపించడం గమనార్హం.

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (స్టంప్డ్) ధోనీ (బి) నూర్ అహ్మద్ 32; విరాట్ (సి) రచిన్ (బి) నూర్ అహ్మద్ 31; పడిక్కళ్ (సి) రుతురాజ్ (బి) అశ్విన్ 27; పటీదార్ (సి) కర్రాన్ (బి) పథిరన 51; లివింగ్‌స్టోన్ (బి) నూర్ అహ్మద్ 10; జితేశ్ (సి) జడేజా (బి) ఖలీల్ 12; డేవిడ్ (నాటౌట్) 22; క్రునాల్ (సి) హుడా (బి) పథిరన 0; భువనేశ్వర్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 196/7. వికెట్ల పతనం:** 1-45, 2-76, 3-117, 4-145, 5-172, 6-176, 7-177. **బౌలింగ్:** ఖలీల్ 4-0-28-1; అశ్విన్ 2-0-22-1; కర్రాన్ 3-0-34-1; నూర్ అహ్మద్ 4-0-36-3; జడేజా 3-0-37-0; పథిరన 4-0-36-2.

చెన్నై: రచిన్ (బి) యశ్ దయాల్ 41, రాహుల్ త్రిపాఠి (సి) సాల్ట్ (బి) హాజెల్‌వుడ్ 5, రుతురాజ్ (సి) సబ్ బండగే (బి) హాజెల్‌వుడ్ 0, దీపక్ హుడా (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 4, కర్రాన్ (సి) క్రునాల్ (బి) లివింగ్‌స్టోన్ 8, శివమ్ దూబే (బి) యశ్ దయాల్ 19, జడేజా (సి) సాల్ట్ (బి) హాజెల్‌వుడ్ 25, అశ్విన్ (సి) సాల్ట్ (బి) లివింగ్‌స్టోన్ 11, ధోనీ (నాటౌట్) 30, నూర్ అహ్మద్ (నాటౌట్) 0 ; **ఎక్స్‌ట్రాలు : 3 ; మొత్తం 20 ఓవర్లలో 146/8 ; వికెట్లపతనం :** 1-8, 2-8, 3-26, 4-52, 5-75, 6-80, 7-99, 8-130 ; **బౌలింగ్ :** భువనేశ్వర్ 3-0-20-1, హాజెల్‌వుడ్ 4-0-21-3, యశ్ దయాల్ 3-0-18-2, లివింగ్‌స్టోన్ 4-0-28-2, సుయాష్ శర్మ 4-0-32-0, క్రునాల్ 2-0-26-0.

ఐపీఎల్‌లో నేడు — వేదిక: అహ్మదాబాద్
గుజరాత్ x ముంబై — రా.7.30

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	2	2	0	0	4	2.266
లఖ్‌నవూ	2	1	1	0	2	0.963
పంజాబ్	1	1	0	0	2	0.550
ఢిల్లీ	1	1	0	0	2	0.371
హైదరాబాద్	2	1	1	0	2	-0.128
కోల్‌కతా	2	1	1	0	2	-0.308
చెన్నై	2	1	1	0	2	-1.013
ముంబై	1	0	1	0	0	-0.493
గుజరాత్	1	0	1	0	0	-0.550
రాజస్థాన్	2	0	2	0	0	-1.882

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్పిన్ బౌలింగ్ కోచ్ కావలెను!

బెంగళూరు: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ)లో పని చేసే స్పిన్ బౌలింగ్ కోచ్ కోసం బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇప్పటివరకు ఆ బాధ్యతల్ని నిర్వర్తించిన సాయిరాజ్ బహుతులే రాజీనామా చేసి రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరాడు. మరోవైపు అన్ని వయస్సు విభాగాల స్పిన్ బౌలర్లను మరింత మెరుగ్గా తీర్చిదిద్దే బాధ్యత కొత్త కోచ్‌పై ఉంటుందని బోర్డు పేర్కొంది. కనీసం 75 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు, మూడేళ్ల కోచింగ్ అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులకు వచ్చే నెల 10 వరకు గడువుంది.

ఫెడరర్ రికార్డును.. దాటేసిన జొకోవిచ్



మియామీ గార్డెన్స్ (ఫ్లోరిడా): నొవాక్ జొకోవిచ్ ఏడోసారి మియామీ ఓపెన్ టైటిల్ అందుకొనే దిశగా సాగుతున్నాడు. ఈక్రమంలో సెమీఫైనల్‌కు చేరుకున్న జొకో..స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ రికార్డును అధిగమించాడు. క్వార్టర్‌ఫైనల్లో సెబాస్టియన్ కోర్డాను 6-3, 7-6 (4) నొవాక్ ఓడించాడు. దాంతో 37 ఏళ్ల 10 నెలల జొకో..ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీలో అత్యధిక వయస్సులో సెమీస్‌కు చేరిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఫలితంగా..2019లో 37 ఏళ్ల ఏడు నెలల వయస్సులో ఫెడరర్ నెలకొల్పిన గత రికార్డు తుడిచి పెట్టుకుపోయింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 29-3-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

సుర్రుమన్న సూరీడు

181 ప్రాంతాల్లో 40 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు

నేడు కోస్తాంధ్రలో వడగాడ్పుల ప్రభావం 12



ఐఐటీయన్లకూ ఉద్యోగాలు దొరకట్లే!

22 ఐఐటీల ప్లేస్‌మెంట్లలో క్షీణత నమోదు

ఐఐటీ ధార్వాడ్‌లో 25%, ఖరగ్‌పూర్‌లో 2.8%

15 ఐఐటీల్లో 10 శాతానికి పైగా..

ఉన్నత విద్య, స్టార్టప్‌ల వైపు విద్యార్థుల ఆసక్తి

పార్లమెంటరీ కమిటీకి కేంద్ర విద్యాశాఖ నివేదిక

న్యూఢిల్లీ, మార్చి 28: దేశవ్యాప్తంగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు భారీగా తగ్గుముఖం పట్టాయి. 2021-22తో పోలిస్తే 2023-24లో ఐఐటీ(బీహెచ్‌యూ) మినహా 23 ఐఐటీల్లో 22 చోట్ల బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ గ్రాడ్యుయేట్ల ప్లేస్‌మెంట్లతో

మిగతా 7వ పేజీలో...



అత్యాధునిక ఎఫ్‌పీవీ డ్రోన్ పరీక్ష

విజయవంతం 7

పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో పరీక్షించిన ఆర్మీ

లక్ష్యాన్ని సమర్థవంతంగా ఛేదించిన డ్రోన్





7

జస్టిస్ వర్మ బదిలీకి

కేంద్రం ఓకే

వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలుకు వేసిన పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

ఇది సమయం కాదన్న బెంచ్

కేంద్ర ఉద్యోగులకు శుభవార్త..

డీఏ 2% పెంపు

పెన్షనర్లకు డీఆర్ కూడా..

కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

ఖరీఫ్‌లో ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులపై రూ.37,216 కోట్ల సబ్సిడీ 9

నాన్-సెమీకండక్టర్ పరికరాల కోసం 22,919 కోట్లతో పీఎల్ఐ స్కీం

భూ విలయం!

మయన్మార్, థాయ్‌లో భారీ భూకంపం

191 మంది మృతి

800 మందికి గాయాలు



మయన్మార్‌లోని నేపిడోలో భూకంపం ధాటికి ధ్వంసమైన ఓ భవనం

శుక్రవారం మధ్యాహ్నం 12.50కి ఘటన

రిక్టర్ స్కేలుపై 7.7 తీవ్రత నమోదు

12 నిమిషాల్లో 6.4 తీవ్రతతో మరోటి

తర్వాత మరో 4 సార్లు ప్రకంపనలు

వందల మంది ఆచూకీ గల్లంతు

థాయ్, నైరుతి చైనాల్లో భారీగా ఆస్తి నష్టం

భారత్, బంగ్లాదేశ్‌ల్లోనూ ప్రకంపనలు

థాయ్‌లాండ్, మయన్మార్‌లలో ఎమర్జెన్సీ

అన్నివిధాలా ఆదుకుంటాం: ప్రధాని మోదీ

బ్యాంకాక్, మార్చి 28: అతి భారీ భూకంపం మయన్మార్‌ను కుదిపేసింది. రాజధాని నేపిటా, రెండో అతిపెద్ద నగరం మాండలేలలో భారీ ప్రాణనష్టం, తీవ్ర ఆస్తినష్టం సంభవించింది. ప్రఖ్యాత కట్టడాలు, పురాతన ఆలయాలు, ఆస్పత్రి భవనాలు కూలిపోయాయి. 181 మంది మరణించి ఉంటారని అంచనా. మరో 730 మంది గాయపడ్డారని చెబుతున్నారు. వందల మంది జాడ తెలియడం లేదు. దాంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం 12.50 గంటలకు(భారత కాలమానం ప్రకారం 11.50) రిక్టర్ స్కేల్‌పై 7.7 తీవ్రతతో తొలుత ఒక భూకంపం వచ్చింది. తిరిగి పన్నెండు నిమిషాల వ్యవధిలో 6.4 తీవ్రతతో మరో భూకంపం వచ్చింది. తర్వాత మరోనాలుగుసార్లు ప్రకంపనలు వచ్చాయి. రెండోసారి వచ్చిన భూకంపం మయన్మార్‌నే కాకుండా పొరుగున ఉన్న

మిగతా 9వ పేజీలో...



బ్యాంకాక్‌లో భూకంపం కారణంగా ఓ భవనం కూలుతుండటంతో పరుగులు తీస్తున్న ప్రజలు

తప్పించుకున్న టీ-ఎమ్మెల్యే కుటుంబం

ఇద్దరు కుమారులు, కోడలితో బ్యాంకాక్ పర్యటనకు వెళ్లిన రాజ్‌ఠాకూర్ సతీమణి

వారు బస చేసిన హోటల్‌పై భూకంప ప్రభావం

అప్రమత్తమై హుటాహుటిన ఎయిర్‌పోర్టుకు

> "అభివృద్ధి సాధించాలంటే సుస్థిర పాలన అవసరం. మా ప్రభుత్వం తీసుకొచ్చిన ఐటీ విధానం దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. ఏఐ వినియోగాన్ని మేం మరింతగా ప్రోత్సాహిస్తాం. ఏపీని ఇన్నోవేషన్‌కు కేంద్రంగా మారుస్తాం. భావనలకు కచ్చితమైన వాస్తవరూపం ఇవ్వగలవారికి (ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్- పీవోసీ) అవకాశాలను కల్పిస్తున్నాం. సరైన నాయకత్వంతోనే సాంకేతికత అభివృద్ధి చెందుతుంది"
>
> - సీఎం చంద్రబాబు

● ఏఐ, డీప్ టెక్నాలజీ హబ్‌గా ఏపీ

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

10 లక్షల కోట్ల పెట్టుబడులు..

7.5 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

ఐఐటీ మద్రాస్‌తో కలిసి ఏర్పాటు చేస్తాం

ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్ ఎనర్జీ విప్లవం

కొత్త ఆవిష్కరణలతో భారత్ పరివర్తన

ఏఐ, డిజిటల్ పురోగతిలో ముందున్నాం

ఐఐటీ మద్రాస్‌లో చంద్రబాబు ప్రసంగం

విద్యార్థులతో ఉత్సాహంగా గడిపిన సీఎం

కరతాళ ధ్వనులు, హర్షాతిరేకాల మధ్య

ఇంగ్లిష్, తెలుగులో ప్రసంగించిన బాబు

చెన్నై, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఐఐటీ మద్రాస్ సహకారంతో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. చెన్నైలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-మద్రాస్' (ఐఐటీఎం)లో శుక్రవారం జరిగిన 'ఆలిండియా రిసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్-2025'లో ఆయన మాట్లాడారు. ఐఐటీఎంలో ఆద్యంతం చంద్రబాబు ఎంతో ఉత్సాహంగా, నవ్వుతూ కనిపించారు. విద్యార్థులు సైతం 'జై బాబు.. జైజై బాబు' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, ఆయన ప్రసంగం సమయంలో హర్షధ్వానాలతో హోరెత్తించారు. ఏపీని ఏఐ, డీప్ టెక్నాలజీ హబ్‌గా మార్చుతానని విద్యార్థుల కరతాళధ్వనుల మధ్య చంద్రబాబు ప్రకటించారు. "దేశంలో 65 శాతం మంది ఏఐ వినియోగిస్తున్నారు. ఇది ప్రపంచ నగటు

మిగతా 10వ పేజీలో...



ఐఐటీఎంలో విద్యార్థులు రూపొందించిన పరికరాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

చంద్రబాబు.. శక్తిమంతమైన నేత!

అఖిల భారత నాయకుల జాబితాలో 14వ స్థానం

జైల్లో పెట్టినా... దీక్షతో అధికారంలోకి.. 'స్వర్ణాంధ్ర 2047' విజన్ దిశగా అడుగులు.. కొనియాడిన 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' 11

73వ స్థానంలో డిప్యూటీ సీఎం పవన్.. ఇద్దరి ఎంపిక తొలిసారే

నంబర్ 1 స్థానంలో మోదీ.. టీ-సీఎం రేవంత్‌కు 28వ స్థానం

ఆటుపోట్లతో రాటుదేలి.. టీడీపీ 43 ఏళ్ల ప్రస్థానం



పదే పదే ఏమిటిది? 11

ఎమ్మెల్యే కొలికపూడిపై మళ్లీ టీడీపీ అధిష్ఠానం సీరియస్

రఘురాం, ఎంపీ కేశినేని, సత్యనారాయణరాజుతో కమిటీ

10 నెలల ఘటనలపై నివేదిక సమర్పణ

తుది నిర్ణయం చంద్రబాబుదే

ఏడుకొండల స్వామికి

కునుకు కరువు!

రోజుకు 23గంటలకు పైగా కొనసాగుతున్న దర్శనాలు

అర్ధరాత్రి ఏకాంత సేవ తర్వాత నిమిషాల వ్యవధిలోనే తెరుచుకుంటున్న శ్రీవారి ఆనంద నిలయం తలుపులు

స్వామికి విశ్రాంతి సమయం పెంచాలి

టీటీడీకి అర్చక, పండిత బృందం సూచన



శ్రీవారి దర్శనం కోసం అర్ధరాత్రి వేళ మహాద్వారం వద్ద వేచి ఉన్న భక్తులు

తిరుమల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి రోజురోజుకూ కునుకు కరువవుతోంది. పెరుగుతున్న భక్తుల రద్దీతో స్వామి సేదతీరే సమయం తగ్గిపోతోంది. దీంతో స్వామివారి ఏకాంత సమయాన్ని పెంచాలని అర్చక, పండిత బృందం టీటీడీ అధికార యంత్రాంగానికి సూచనలు చేస్తోంది. రోజూ వేకువజామున సుప్రభాత సేవతో స్వామి నివేదనలు మొదలవుతాయి. ప్రస్తుతం వేకువజాము 2.30 గంటలకు

మిగతా 8వ పేజీలో...



నరకం చూపిస్తా.. నాయాలా!

టెక్కలిలో ఎలా ఉద్యోగం చేస్తావో చూస్తా

ఎమ్మెల్సీ ఇంటికొచ్చి కనెక్షన్ కట్ చేశావంటే ఎంత ధైర్యం

నిన్ను కోర్టుకు లాగుతా.. ఎవడితో చెప్పుకొంటావో చెప్పుకో

ట్రాన్స్‌కో జేఈకి వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ బెదిరింపులు

బిల్లు చెల్లించనందుకు విద్యుత్తు కనెక్షన్ తొలగించారని నోటి దురుసు 12



12

2న విచారణకు రావాల్సిందే

లేదంటే అరెస్టు తప్పదు

ఐఅండ్‌పీఆర్ మాజీ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డికి ఏసీబీ నోటీసు

తప్పక వస్తానన్న విజయ్‌కుమార్‌రెడ్డి

అదే విషయం హైకోర్టుకూ వెల్లడి

ముందస్తు బెయిల్‌పై విచారణ ఏప్రిల్ మూడో వారానికి వాయిదా

47 మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన 11

'డిజిటల్' అక్రమాలపై

సీఐడీ



విజిలెన్స్ సిఫారసు మేరకు విచారణ

జగన్ హయాంలో భారీ అవకతవకలు

ఏపీ డిజిటల్ కార్పొరేషన్ నుంచి 'యాత్ర' నటుడు మమ్ముట్టికి రూ.50లక్షలు.. ఐపాక్, ఐడ్రీమ్స్ ఉద్యోగులకూ జీతాల చెల్లింపు

జగన్ రోత పత్రికకూ దోచిపెట్టారు.. 37 కోట్లు రికవరీ చేయాలి

అన్నిటికీ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి బాధ్యుడు.. ప్రభుత్వానికి నివేదిక 12

వంశీకి నో బెయిల్

సత్యవర్ధన్ కేసులో పిటిషన్ తిరస్కృతి

వచ్చే నెల 9 వరకు రిమాండ్ పొడిగింపు

భూముల కేసులో పోలీసు కస్టడీకి అనుమతి



పవన్ కుమార్

వైసీపీకి బెట్టింగ్

బేడీలు

అవనిగడ్డ ఎంపీపీ కుమారుడి అరెస్టు

బ్యాంక్ ఖాతాలో భారీగా నగదు 8

జనసేన మద్దతుదారూ అదుపులోకి!

2 లక్షల మంది మహిళా కెప్టెన్లతో

పింక్ ర్యాపిడో

వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా సేవల విస్తరణకు సిద్ధం

ప్రస్తుతం చెన్నై, హైదరాబాద్, ఢిల్లీలో 700 మందికి ఉపాధి.. స్త్రీలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యం 9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చైనా–బంగ్లా చెలిమి

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ శుక్రవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. భేటీ దిగ్విజయంగా జరిగిందని, స్నేహం, సహకారం, ఇచ్చిపుచ్చుకోవడాల గురించి దేశాధినేతలు ఇద్దరూ మాట్లాడుకున్నారని, రెండుదేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక సహకార ఒప్పందాలు, పలురంగాల్లో అరడజనుకు పైగా అవగాహనలు కుదిరాయని మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో బంగ్లాదేశ్ పేర్కొంది. పెట్టుబడులు, చైనా ఇండస్ట్రియల్ ఎకనామిక్ జోన్, మోంగ్లాపోర్టు అభివృద్ధి, తీస్తా నదీజలాల ప్రాజెక్టు నిర్వహణ తదితర అంశాలమీద నిర్ణయాలు జరిగాయని, ఏకచైనా సూత్రాన్ని, దాని సార్వభౌమత్వ, ప్రాదేశిక సమగ్రత పరిరక్షణ హక్కులను బంగ్లాదేశ్ సమర్థించిందని ఆ ప్రకటన పేర్కొంది. మీ దేశంలో మా వాళ్ళతో పెట్టుబడులు పెట్టించే బాధ్యతనాది అని చైనా అధ్యక్షుడు హామీ ఇచ్చారని, యూనస్ ప్రభుత్వానికి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారని బంగ్లాదేశ్ ఆ ప్రకటనలో చెప్పుకుంది. నాలుగు రోజుల చైనా పర్యటనకు యూనస్ మార్చి 26న బయలుదేరిననాడే బంగ్లాదేశ్ 53వ స్వాతంత్ర్య దినోత్సవం. భారత్ నైతిక, సైనిక సహకారంతో బంగ్లాదేశ్ విముక్తి జరిగిన రోజునే యూనస్ తన చైనా పర్యటనకు ఎంచుకోవడం, చైనా పంపిన ప్రత్యేక విమానంలో అన్ని రంగాలకు చెందిన సలహాదారులను, అధికారులను వెంటబెట్టుకొని పోవడం వెనుక భారతదేశానికి స్పష్టమైన సందేశం ఉన్నదని విశ్లేషకుల అనుమానం.

తొలిగా భారతదేశంలోనే పర్యటిద్దామని యూనస్ అనుకున్నారని, కానీ, సానుకూలమైన ఆహ్వానం లభించలేదని ఆయన ప్రెస్ సెక్రటరీ ఈ మధ్య ఓ వ్యాఖ్య చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది ఆగస్టులో జరిగిన తిరుగుబాటులో షేక్ హసీనా తన ప్రధాని పదవికోల్పోయి, భారతదేశంలో ఆశ్రయం పొందుతున్నప్పటినుంచీ భారత్–బంగ్లా సంబంధాలు అగాధాన్ని అంటాయి. హిందూ మైనారిటీలమీద దాడులు, ఊచకోతలు యధేచ్ఛగా సాగిపోతున్నాయంటూ మన ప్రభుత్వం విమర్శలు చేయడం, మరోపక్క యూనస్ ప్రభుత్వాన్ని హసీనా ఇక్కడ నుంచి తీవ్రంగా విమర్శిస్తూండటం అగాధాన్ని మరింత పెంచింది. మతఛాందసులను నియంత్రించలేకపోగా, ఆ దాడులు మతపరమైనవి కావనీ, అంతాసవ్యంగా ఉన్నదనీ యూనస్ చేసిన సమర్థింపులు డొల్లవని అనతికాలంలోనే తేలిపోయింది. మొన్న డిసెంబరులో మన విదేశాంగశాఖ కార్యదర్శి మిస్రీ ఆ దేశాన్ని సందర్శించినప్పుడు కూడా ఈ నేరాల విషయంలో మన ఆందోళనను కుండబద్దలుకొట్టి వచ్చారు. ఈ నేపథ్యంలో, మార్చి 26 విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత రాష్ట్రపతి, ప్రధాని బంగ్లాదేశ్ నేతకు ప్రత్యేక సందేశాలు పంపడం, బంగ్లాదేశ్ ఆవిర్భావంలో భారత్ పాత్రను గుర్తుచేస్తూ యూనస్‌కు మోదీ లేఖ రాయడం బాగుంది. బంగ్లాదేశ్‌లో షేక్ ముజబూర్ రహ్మాన్ జ్ఞాపకాలను, వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు, ఆ విముక్తిపోరాటాన్ని సైతం ప్రజల మస్తిష్కాలనుంచి తుడిచివేసేందుకు విశేష ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో వాటి ప్రస్తావనలు అక్కడి వారికి నచ్చకపోవచ్చునేమో. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చింది 1971లోనా, 2024 ప్రజాపోరాటంతోనా అంటూ బిఎన్‌పి, జమాత్ వంటివి నిర్దిష్టమైన ఎజెండాతో, చరిత్రను చెరిపివేసే లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయి. విముక్తి పోరాటం గురించి మాట్లాడుతున్న వారిని దేశద్రోహులుగా అభివర్ణిస్తున్నాయి. మరోపక్క, తమది లౌకికవాద, తటస్థదేశంగా ఉండాలన్న సదాశయంతో విద్యార్థి నేతలు గత నెలలో ఆరంభించిన పార్టీ మతఛాందసులను తట్టుకొని నిలిచి, ప్రజలను ఏ మేరకు ప్రభావితం చేయగలదో చూడాలి.

శాంతి, స్థిరత్వం, ప్రజాశ్రేయస్సు, ఉమ్మడి ప్రయోజనాలకోసం కలసి నడుద్దామని యూనస్‌కు రాసిన లేఖలో మోదీ ప్రతిపాదించడం ప్రశంసనీయమైనది. సంక్షోభంలో ఉన్న బంగ్లాదేశ్‌ను ఆదుకొనే పేరిట చైనా మరింత ఉధృతంగా, మరిన్ని రంగాల్లోకి ప్రవేశించే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. రుణాలకు వడ్డీలు తగ్గించడం, కొత్త ప్రాజెక్టులకు మద్దతు, మరిన్ని అప్పులు సహా పలు ప్రతిపాదనలను చైనా పర్యటనలో యూనస్ చేశారట. స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం, బిఆర్‌ఐ దిశగా రెండుదేశాలూ అడుగులు వేస్తూ, బంగ్లాదేశ్–పాకిస్థాన్–చైనా వేగంగా ఒక్కటవుతున్న వాతావరణం మనకు ఇబ్బంది కలిగించేదే.

సుంకాల పోరులో ఇదీ మన కర్తవ్యం

ప్రపంచ దేశాలు ఆధునిక పైడ్ పైపర్ (సుప్రసిద్ధ జర్మన్ జానపద గాథలో వేణువు ఊది పిల్లలను వెంటబెట్టుకుని వెళ్లిన వ్యక్తి)ను అనుసరిస్తాయా లేదా అనేది ఏప్రిల్ 2, 2025న, ఆ తరువాత రోజుల్లో మనకు తెలుస్తుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించనున్న సుంకాల సమరం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. లక్ష్యంగా పెట్టుకున్న ఇతర దేశాల నుంచి దిగుమతి అయిన సరుకులపై అమెరికా, శిక్షాత్మక సుంకాలు విధిస్తే, ఆ చర్య ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో) నిబంధనలను, బహు పక్షీయ వ్యాపార ఒడంబడికలను, అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలను ఉల్లంఘించడమే అవుతుంది. అయితే అమెరికా 47వ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చట్టాలను –అమెరికావి అయినా, ఇతర దేశాలవి అయినా– కించిత్ కూడా లెక్క చేసే వ్యక్తి కాదు. అసలు ఆయనకు ఆయనే ఒక చట్టం కదా. తన మాటను అందరూ ఒక శిలా శాసనంగా పాటించాలని ఆయన ఆశిస్తారు.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

శిక్షాత్మక సుంకాల విధింపునకు ట్రంప్ కొన్ని 'టార్గెట్' దేశాలను గుర్తించారు. ఆ దేశాల నుంచి ఎంపిక చేసుకున్న దిగుమతి సరుకులపై పెద్ద ఎత్తున సుంకాలు విధిచేందుకు ఆయన సంకల్పించారు. ఇందుకు ట్రంప్ గుర్తించిన దేశాల జాబితాలో భారత్ కూడా ఉన్నది. దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశించి, దేశి సరుకులతో పోటీ విదేశీ వస్తువులకు అవరోధాలు కల్పించేందుకు ఉద్దేశించినవే సుంకాలు. ఈ లక్ష్య పరిపూర్తికి సుంకాల (అంటే కస్టమ్స్ సుంకాలు)తో పాటు మరికొన్ని ఇతర పన్నులు (యాన్టి–డంపింగ్ డ్యూటీ అందుకొక ఉదాహరణ) కూడా విధించడం పరిపాటి. ప్రత్యేక పరిస్థితులలో వీటిని విధించడం ప్రతి దేశంలోను జరుగుతుంది. అయితే ఈ సుంకాలు లేదా పన్నులను సవాల్ చేయడమనేది సంబంధిత దేశీయ న్యాయ స్థానాలలో మాత్రమే జరగాలి. కాగా అన్ని దేశాలలోను న్యాయస్థానాలు విదేశీ ఎగుమతిదారుల కంటే దేశీయ పరిశ్రమల ప్రయోజనాలను కాపాడేందుకు అధిక ప్రాధాన్యమిస్తాయని మరి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీటితో పాటు సరుకుల నాణ్యతా ప్రమాణాల పరిరక్షణ, ప్యాకేజింగ్ ప్రమాణాలు, పర్యావరణ సంబంధిత మార్గదర్శకాలు పేరిట సుంకాలేతర అవరోధాలూ అమల్లో ఉంటాయి. ఈ స్వీయ లేదా స్వార్థ ప్రయోజనాన్నే సంరక్షణవాదంగా పరిగణిస్తారు.

'స్వయం సమృద్ధి' లేదా 'స్వావలంబన'కు దోహదం చేసే మార్గాలలో ఒకటి సంరక్షణవాదం. ఈ సంరక్షణ వాదాన్ని దేశ భక్తిగా తికమక పడకూడదు. 'స్వయం సమృద్ధి' వాదాన్ని ఆధునిక అర్థశాస్త్రం. అనుభావిక రుజువులు తిరస్కరించాయి. స్వయం సమృద్ధి అనేది ఒక మిథ్య. ఏ దేశమూ తన ప్రజలు ఆకాంక్షిస్తున్న, వినియోగిస్తున్న సరుకులు, సేవలు అన్నిటినీ ఉత్పత్తి చేయలేదు దేశీయ పరిశ్రమల సంరక్షణకు ప్రాధాన్యమిచ్చే దేశం అల్ప ఆర్థికాభివృద్ధిని మాత్రమే సాధిస్తుంది. పెట్టుబడులను స్వల్పస్థాయిలో మాత్రమే సమకూర్చుకో గలుగుతుంది. నాసిరకం సరుకులను మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతుంది. తమ అభిరుచులకు అనుగుణంగా సరుకులను ఎంపిక చేసుకునేందుకు ప్రజలకు అవకాశముండదు. ఉత్పత్తిదారుల నుంచి వినియోగదారులకు అందే సేవలు నాణ్యమైనవిగా ఉండవు. సంరక్షణవాద విధానాలు కాక, స్వేచ్ఛా విపణి విధానాలే ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదనశక్తులని గత యాభై సంవత్సరాల చరిత్ర నిర్ణయాత్మకంగా నిరూపించింది. ప్రపంచ సంపన్న దేశాలన్నీ పోటీదాయక ఆర్థిక విధానాలను, స్వేచ్ఛా వాణిజ్య పద్ధతులనూ అనుసరించినవే.

భారత్ నాలుగు దశాబ్దాల పాటు సంరక్షణ విధానాలను అనుసరించింది. దిగుమతులపై ఆంక్షలు విధించింది. ఫలితంగా మన ఎగుమతులు పరిమితమయ్యాయి. అంతకంతకూ కుదించుకుపోయాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖలో ఒక ప్రత్యేక విభాగం ఉన్నది. చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్' అన్న ఉన్నతాధికారి ఆధ్వర్యంలో పలువురు అధికారులు, ఉద్యోగులు ఆ విభాగంలో ఉన్నారు. అయితే ఒక ప్రశ్నను ఎవరూ లేవనెత్తలేదు: 'దిగుమతులపై నియంత్రణకు ఒక ప్రధానాధికారి ఉండడం అర్థం చేసుకోదగిన విషయమే. అయితే ఎగుమతుల నియంత్రణకు ప్రధానాధికారి ఎందుకు?'. విదేశీమారక ద్రవ్యం ఎంతగానో అవసరమున్న దేశంలో ఎగుమతులపై నియంత్రణకు ప్రత్యేకంగా ఒక ఉన్నతాధికారి ఎందుకు? ఈ ప్రశ్నను ఎవరూ అర్థం చేసుకోలేదు.

1991లో ఆర్థికమంత్రిగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ నియమితులయ్యారు. ఆయన ఆర్థిక విధానాలు సంరక్షణవాదాన్ని త్యజించేందుకు దారితీశాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమయింది. 1991–92లో ప్రకటించిన కొత్త విదేశీ వాణిజ్య విధానం కాలం చెల్లిన వాణిజ్య నిబంధనలకు స్వస్తి చెప్పింది. భారత్ స్వేచ్ఛా వాణిజ్య విధానాలను పూర్తిగా అనుసరించడం ప్రారంభించింది. సంరక్షణ విధానాలు గతించిన చరిత్రగా మారిపోయాయి. ఆంక్షలను తొలగించారు. నియమ నిబంధనలను సరళీకరించారు. దిగుమతులపై సుంకాలను క్రమేణా తగ్గించారు. భారతీయ పారిశ్రామికవేత్తలకు విదేశీ పారిశ్రామికవేత్తల నుంచి పోటీ ఎదురయింది. ఈ పోటీలో దేశీయ పారిశ్రామికవేత్తలు అద్భుత విజయాలు సాధించారు. ప్రపంచీకరణ విధానాలతో దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రయోజనాలు అపరిమితంగా సమకూరాయి.

2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు భారత్ మళ్లీ సంరక్షణవాదాన్ని అనుసరించడం ప్రారంభమయింది. స్వయం సమృద్ధి ఒక విచిత్ర పేరు–ఆత్మ నిర్భరత– ను సంతరించుకున్నది! ప్రపంచం ఎంతో మారిపోయిందన్న సత్యాన్ని గుర్తించడంలో మోదీ ప్రభుత్వం విఫలమయింది. అనేక దేశాలు తమ 'తులనాత్మక అనుకూలత'లను కనుగొన్నాయి. ఆ సానుకూలతలను తమకు ప్రయోజనకరంగా వినియోగించుకున్నాయి. 'సప్లై చైన్స్' (ఉత్పత్తి, సరఫరా ప్రక్రియల పరంపర) అనే కొత్త పద్ధతి అమలులోకి వచ్చింది. మొబైల్ ఫోన్ లాంటి ఒక పరికరం ఉత్పత్తి పూర్తిగా ఒక దేశంలో కాక, అనేక దేశాలలో జరగడం పరిపాటి అయింది. ఈ కొత్తఉత్పత్తి ప్రక్రియ సర్వసాధారణమైపోయింది. 'మేడ్ ఇన్ జర్మనీ', 'మేడ్ ఇన్ జపాన్' అనే ప్రతిష్ఠాత్మకత గతించిన విషయమైపోయింది. అనేక వస్తువులు 'మేడ్ ఇన్ ది వరల్డ్'గా ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. మోదీ ప్రభుత్వ ఆత్మనిర్భర్ సాధించిందేమిటి? త్యజించిన నియమ నిబంధనలు, లైసెన్స్‌ల విధానం, ఆంక్షలు, మరీ ముఖ్యంగా సుంకాలను పునః ప్రారంభించడమే కాదూ?



సుంకాల సమరంలో భారత్ అనుసరించాల్సిన వివేకవంతమైన మార్గం ఏమిటి? ఒక కలెక్టివ్‌గా ఏర్పడేందుకు కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా దేశాలకు భారత్ నచ్చజెప్పాలి. ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకునేందుకు సంఘటితమైన ఈ మిత్ర దేశాలతో సమష్టిగా చర్చలు జరిపేలా అమెరికాను ఒత్తిడి చేయాలి. ట్రంప్ ప్రభుత్వంతో చర్చల ద్వారా ప్రపంచ దేశాల సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే ఒక సమగ్ర ఒప్పందానికి రావాలి.

సరే, ట్రంప్ మహాశయుడు రెండోసారి అధికారానికి వచ్చిన కొద్ది రోజులకే సుంకాల సమరానికి నాందిగా మొదటి అస్త్రాన్ని ప్రయోగించాడు. అల్యూమినియం, ఉక్కు దిగుమతులపై సుంకాలు పెంచాడు. అయితే వెనుకడుగు వేసి ఆ సుంకాల వసూలును వాయిదా వేసి, అందుకు కొత్త తేదీ నిర్దేశించాడు. మార్చి 26న ఆటోమోబైల్స్, వాటి విడిభాగాల దిగుమతులపై భారీ సుంకాలు విధించాడు. ట్రంప్ నిర్ణయాలు, చర్యలకు భారత్ ప్రతిస్పందన ఇంతవరకు గోప్యంగా, ప్రతి చర్యలు చేపట్టే రీతిలో ఉన్నది. 2025–26 కేంద్ర బడ్జెట్‌లో సుంకాల తగ్గింపును ప్రభుత్వం ప్రకటించింది. ఈ చర్య, ట్రంప్‌ను ఏమీ ప్రభావితం చేయలేదు. ఇండియాకు అనుకూలంగా ఆయన వైఖరిని మారగలదనే సూచనలు కనిపించడం లేదు. వైట్ హౌజ్ సమావేశంలో నరేంద్ర మోదీ మెరమెచ్చు మాటలు మాట్లాడారు. అయితే అవేమీ ట్రంప్‌ను సంతృప్తిపరచలేదు. ద్రవ్య బిల్లును ఆమోదించిన సమయంలో డిజిటల్ సర్వీస్ ట్యాక్స్ ('గూగుల్ ట్యాక్స్)ను ఉపసంహరించుకున్నారు. అమెరికాకు మరిన్ని రాయితీలు ఇచ్చే విషయమై మోదీ ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. దేశ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదిపివేయనున్న ట్రంప్ సుంకాల సమరాన్ని ఎదుర్కొనేందుకు ఇది సరైన దృక్పథమేనా? సరైనదనే భావన కలిగించే రీతిలో ప్రభుత్వ తీరు లేదు. భారత్–అమెరికా పరస్పర ప్రయోజనాలకు మేలు కలిగే విధంగా సమస్త సుంకాల విషయమై సమగ్రంగా చర్చించాలి. తన స్నేహితుడు ట్రంప్ తత్వం మోదీకి బాగా తెలుసు కనుక సుంకాల విషయంలో తగ్గారు. ట్రంప్ నిర్దేశాలను పాటించేందుకు సుముఖమయ్యారు. అయితే భారత్ ప్రయోజనాలను సంరక్షించడంలో మోదీ సఫలమవుతారా లేదా అన్నది ఇప్పుడే స్పష్టంగా చెప్పలేము.

ట్రంప్ ప్రారంభించనున్న సుంకాల యుద్ధంలో తన ప్రయోజనాలను రక్షించుకునేందుకు భారత్‌కు ఇతర దేశాల మద్దతు, సహాయ సహకారాలు ఎంతైనా అవసరం. అలాగే ఆ దేశాలకూ అమెరికాపై వాణిజ్య పోరులో విజయం సాధించాలంటే భారత్ మద్దతు తప్పనిసరి. కెనడా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా ఈ సుంకాల పోరులో భారత్‌తో కలిసి వచ్చే దేశాలు. భారత్ అనుసరించాల్సిన వివేకవంతమైన మార్గమేమిటి? ఒక కలెక్టివ్‌గా ఏర్పడేందుకు ఆ దేశాలకు నచ్చజెప్పి అంగీకరించేలా చేసేందుకు భారత్ పూనుకోవాలి. ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకునేందుకు సంఘటితమైన ఈ మిత్ర దేశాలతో సమష్టిగా చర్చలు జరిపేలా అమెరికాను ఒత్తిడి చేయాలి. ట్రంప్ ప్రభుత్వంతో చర్చల ద్వారా ప్రపంచ దేశాల సుస్థిర ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే ఒక సమగ్ర ఒప్పందానికి రావాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

స్వాభిమాన భారత స్వాప్నికుడు

స్వాభిమాన భారతాన్ని సాధించాలనే సంకల్పంతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు పురుడు పోశారు డాక్టర్ కేశవరావు బలిరాం పంత్ హెడ్గేవర్. బ్రిటిష్ వారి విభజించు, పాలించు అనే దుష్ట నీతిని గ్రహించిన హెడ్గేవర్.. దేశ ఐక్యతకు ప్రతిన బూనారు. 1889 ఏప్రిల్ 1న (ఉగాది పండుగ రోజున) బలిరాం పంత్ హెడ్గేవర్, రేవతి బాయ్ దంపతులకు కేశవరావు జన్మించారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో జన్మించినా, వారి పూర్వీకులది తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా కందకుర్తి గ్రామం. బాల్యం నుంచే భరతమాత వైభవం కోసం తపించిన హెడ్గేవర్.. స్వాతంత్ర్య సమరంలో పాలు పంచుకున్నారు.

అడుగడుగునా భారతీయ జవసత్వాలు నింపుకున్న హెడ్గేవర్.. విక్టోరియా మహారాణి జయంతి సందర్భంగా పంచిన మిఠాయిలను విసిరేసి స్వాభిమానం చాటుకున్నారు. తోటి విద్యార్థులను కూడగట్టి విదేశీ జెండాలను పెకిలించి వేశారు. పాఠశాల సందర్శనకు వచ్చిన ఆంగ్లేయ అధికారులకు వందేమాతరం.. భారత్ మాతాకీ జై.. నినాదాలతో స్వాగతం పలికారు. పేదరికంలో పుట్టినప్పటికీ, చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయినప్పటికీ పట్టు సడలని.. మొక్కవోని దీక్షతో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. సుఖమయ జీవితాన్ని త్యాగం చేసి.. తల్లి భారతి ఔన్నత్యం కోసం తనను తాను సమర్పించుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ సభ్యుడుగా అనేక బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలలో పాల్గొని జైలు జీవితం అనుభవించారు. 1921లో ఖిలాఫత్ ఆందోళనకు మహాత్మాగాంధీ మద్దతు ఇవ్వడం నచ్చక, సొంతబాట పట్టారు. దేశంలో జరుగుతున్న పరిస్థితులు గమనిస్తుంటే చెల్లాచెదురైన హిందూ సమాజాన్ని ఏకం చేయాల్సిన అవసరం ఉందని గ్రహించారు. కులాలు, జాతులు, వర్ణాలు, వర్గాల పేరుతో ఎవరికి వారేగా ఉంటున్న హిందూ సమాజాన్ని ఏకం చేయాలని సంకల్పించారు. దేశానికి స్వాతంత్ర్యం రావడం ఖాయమని, అయితే దాన్ని స్వాభిమాన స్వాతంత్ర్యంగా నిలుపుకొని భారతీయ మూలాలను పరిరక్షించాలని నిర్ణయించారు.



కులాలు, వర్ణాలు, వర్గాల పేరుతో ఎవరికి వారేగా ఉంటున్న హిందూ సమాజాన్ని ఏకం చేయాలని హెడ్గేవర్ సంకల్పించారు. దేశానికి స్వాతంత్ర్యం రావడం ఖాయమని, అయితే దాన్ని స్వాభిమాన స్వాతంత్ర్యంగా నిలుపుకొని భారతీయ మూలాలను పరిరక్షించాలని నిర్ణయించారు. ఈ లక్ష్యంతో 1925 విజయదశమి రోజున కేవలం ఐదుగురు సభ్యులతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను ఆయన ప్రారంభించారు.

1925 విజయదశమి రోజున కేవలం ఐదుగురు సభ్యులతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు పురుడు పోశారు డాక్టర్ హెడ్గేవర్. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్‌ను హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు విస్తరించాలని ప్రతిన బూనారు. "అఖండ భారత్ హమారా హై" అంటూ నినదించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విస్తరణలో పట్టుదల, క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన సుశిక్షితులైన స్వయం సేవకుల తయారీ కోసం సంఘ శాఖలను ప్రారంభించారు. నిస్వార్థంగా దేశం కోసం పనిచేసే సైనికులను తీర్చిదిద్దారు. విశ్వంలోని హిందువులందరినీ ఒక్కటి చేయాలనే ఏకైక లక్ష్యం ఏర్పాటు చేసుకుని, దార్శనికత ప్రదర్శించారు. ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉంటూ త్రికరణశుద్ధితో భరతమాత సేవలో తనువు సమర్పించుకున్న భరతమాత ముద్దుబిడ్డ డాక్టర్ హెడ్గేవర్. హిందువులంతా సంఘటితమైతేనే జాతీయత సాధ్యమని, అందుకు సంఘ శాఖలే ప్రధాన భూమిక పోషించాలని స్వయం సేవకులకు ఉద్బోధించారు. భారతీయులందరూ ఒకే కుటుంబానికి చెందినవారుగా ఆత్మీయతను నూరిపోశారు. 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై'.. అనే నినాదాలు మంత్రాలుగా మలిచి ప్రతి వ్యక్తిలో జాతీయభావాలు నూరిపోశారు. సంఘ్ శాఖల ద్వారా దేశభక్తుల తయారీని ప్రారంభించారు.

సంఘ్ శాఖలో సామాజిక సమరసతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు డాక్టర్ హెడ్గేవర్. కుల జాడ్యానికి తావులేకుండా స్వయం సేవకులను తయారు చేశారు. "అందరం హిందువులం.. అందరం భారతీయులం" అనే ఆత్మీయ భావనను తీసుకువచ్చారు. ఒక సందర్భంలో సంఘ్ శిబిరాన్ని మహాత్మాగాంధీ సందర్శించి, అందులోని స్వయంసేవకులను మీరు ఏ కులానికి చెందినవారు అని ప్రశ్నించారు. దీంతో మేమంతా హిందువులం అని స్వయం సేవకులు సమాధానం చెప్పారు. మరొక సందర్భంలో డాక్టర్ అంబేద్కర్ సంఘ శిబిరాన్ని సందర్శించారు. ఇక్కడ కులాల కుంపటి లేకుండా సామాజిక సమరసత వెల్లివిరియడం చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

1925లో ప్రారంభమైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ విస్తరణ కోసం ప్రచారక్ వ్యవస్థను ఏర్పాటు చేశారు హెడ్గేవర్. "ఆ జీవన పర్యంతం సమాజసేవకే అంకితం" అని ప్రతి వ్యక్తి మదిలో నింపి.. సజ్జన సమాజ నిర్మాణానికి తోడ్పడ్డారు. ఆ విధంగా తయారైన స్వయం సేవకులు దేశ నలుమూలలా విస్తరించి, హైందవ సమాజ జాగృతి కోసం కంకణం కట్టుకొని పనిచేశారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం రానే వచ్చింది. వచ్చిన స్వాతంత్ర్యాన్ని నిలుపుకునేలా, స్వాభిమాన భారతాన్ని తయారు చేసేలా సంఘాన్ని కూడా విస్తరించారు. హిందూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక రుగ్మతలను ఒక్కొక్కటిగా పారదోలుతూనే హిందూ ఐక్యతకు ప్రాధాన్యమిచ్చారు స్వయం సేవకులు. దేశంలోని అన్ని రంగాలలో రాజకీయ, విద్యార్థి, కార్మిక, కర్షక, రైతు, మేధావి... ఇలా అన్ని క్షేత్రాలలో స్వయంసేవకుల ప్రాధాన్యం పెంచారు. ఫలితంగా స్వాతంత్ర్యానంతరం కాశ్మీర్ కోసం.. అయోధ్య రామ మందిరం కోసం అనేక ఉద్యమాలు చేసి ప్రాణత్యాగం చేసిన స్వయం సేవకులను, కర సేవకులను తయారు చేశారు. వారు సంఘ్ సిద్ధాంతాన్ని వ్యాపింప చేశారు. సమర్థ నాయకులు అటల్ బిహారీ వాజ్‌పాయి, నరేంద్ర మోదీ వంటి ప్రధానమంత్రులను సంఘ్ తయారు చేసింది.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కేవలం భారతదేశానికే పరిమితం కాకుండా హెచ్‌ఎస్‌ఎస్ (హిందూ స్వయంసేవక్ సంఘ్) పేరుతో ప్రపంచంలోనే 60కి పైగా దేశాలలో విస్తృతంగా పనిచేస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా ధార్మిక కార్యక్రమాల కోసం విశ్వహిందూ పరిషత్‌ను స్థాపించి హిందూ ఐక్యత కోసం కృషి చేస్తున్నది. ఒక మాటలో చెప్పాలంటే నాడు హెడ్గేవర్ నాటిన మొక్క నేడు మానుగా మారి, మహావృక్షమైంది. ఇంతటి గొప్ప సంస్థ ప్రారంభమై 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న శుభ సందర్భంలో డాక్టర్ హెడ్గేవర్ జయంతిని స్మరించుకోవడం అత్యంత ఆవశ్యకం.

• పగుడాకుల బాలస్వామి
విశ్వహిందూ పరిషత్, తెలంగాణ

తెలుగుదేశం: దశాబ్దాలుగా ప్రజాపక్షం

కాలంతో పరిగెత్తుతూ, కాలం విసిరే సవాళ్లను ఎదుర్కొంటూ 43 సంవత్సరాలు పూర్తిచేసుకుంది తెలుగుదేశం పార్టీ. 23 ఏళ్ల పాటు అధికారంలో ఉంది, 20 ఏళ్లు ప్రతిపక్షంలో ఉంది. ఈ సుదీర్ఘ ప్రస్థానంలో ప్రతిపక్షంలో ఉన్నా, అధికారపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసింది. నూతన రాజకీయ సంస్కృతికి, కొత్త రాజకీయ వ్యవస్థకు ఎన్టీఆర్ శ్రీకారం చుడుతూ 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించారు. తెలుగుదేశం ఆవిర్భానికి ముందు, తర్వాత అనేవిధంగా తెలుగునాట ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో అనేకమైన మార్పులు తీసుకువచ్చారు. సమాజంలో ఉన్న రాజకీయ అసమానతలను తుడిచిపెడుతూ బడుగు, బలహీనవర్గాల వారికి రాజ్యాధికారం దక్కేలా చేశారు.

తెలుగుజాతి ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం అనే ఆశయాలపై తెలుగుదేశం పార్టీ పురుడు పోసుకుంది. 1982లో జరిగిన ఎన్నికల్లో విద్యావంతులు, యువత, మహిళలు, వెనుకబడిన వర్గాల వారికి 80 శాతానికి పైగా స్థానాలు కేటాయించారు. 294 స్థానాలకు గాను 202 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ ఘనవిజయం సాధించింది. చైతన్యరథమే వేదికగా 9 నెలల పాటు అవిశ్రాంతంగా పర్యటించి ఎన్టీఆర్ ప్రజలను చైతన్య పరిచారు. ఇది గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో సైతం నమోదైంది.

1984లో ఎన్టీఆర్ రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జాతీయ స్థాయిలో కాంగ్రెసేతర పార్టీలను కూడగట్టారు. నేషనల్ ఫ్రంట్ ఏర్పాటుచేసి చైర్మన్‌గా ఎంపికయ్యారు. ప్రధానమంత్రులను, రాష్ట్రపతులను చేయడంలో కీలకపాత్ర పోషించారు. జాతీయ పార్టీలలో లేని సైద్ధాంతిక నిబద్ధత, బలమైన వర్తమానం, ఆశావహమైన దృక్పథం, రాజకీయ పరిణితి తెలుగుదేశంలో ఉన్నాయి. అందుకే దేశంలోని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలు తెలుగుదేశం విధానాలను అనుకరిస్తున్నాయి. జాతీయ రాజకీయాల్లో కూడా తెలుగుదేశం తనదైన ముద్ర వేసింది. పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్షంగా ఒక ప్రాంతీయ పార్టీ వ్యవహరించడం అరుదైన చారిత్రక సంఘటన.

తెలుగుదేశం పార్టీ నాయకులను తయారుచేసే కార్ఖానా. కొంగొత్త రాజకీయ ఆవిష్కరణలకు, నూతన సంస్కరణలకు తెలుగుదేశం ప్రయోగశాలగా మారింది. ప్రజల పక్షాన అనేక ఉద్యమాలను నిర్మిస్తూ పడిలేచిన కెరటంలా ఉవ్వెత్తిన ఎగిసిపడుతూ తన ఉనికిని కాపాడుకుంటూనే ఉంది. సంక్షోభాలనే అవకాశాలుగా మలుచుకుంటూ, ఓటమితో నిరాశ చెందక నిరంతరం తన ప్రయాణాన్ని సాగిస్తోంది. కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికి గత వైసీపీ ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. అయినా ఎక్కడా వెన్నుచూపకుండా తమ పోరాట స్ఫూర్తిని వారు కొనసాగించారు. అలాంటి కార్యకర్తలు కోటికి పైగా తెలుగుదేశం పార్టీకి సొంతం. భారతదేశంలో ఏ రాజకీయ పార్టీలో కూడా ఇంతమంది సభ్యులుగా చేరలేదు. వీరందరికీ ప్రమాద బీమాను పార్టీ కల్పించింది.



తెలుగునాట జరుగుతున్న సకల సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాలతో తెలుగుదేశం మమేకమైంది. పేదరికం లేని సమాజాన్ని సృష్టించాలన్నదే తెలుగుదేశం ఆశయం. తెలుగుదేశం ప్రతిసారి అధికారంలోకి రాలేకపోయినా ఆ పార్టీ ముద్ర రెండు తెలుగురాష్ట్రాల్లో వికసిస్తూనే ఉంది. నేడు ఎవరు ఔనన్నా, కాదన్నా ఆంధ్రా అభ్యుదయానికి తెలుగుదేశమే దిక్సూచి. రాష్ట్ర విభజనతో రోడ్డున పడ్డ తెలుగుజాతికి పూర్వ వైభవం తెచ్చి, ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచపటంలో గుర్తింపు తీసుకువచ్చింది. ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో, గతంలో ఉమ్మడి ఏపీలోనూ బలమైన శక్తిగా ఎదిగింది. తెలుగుదేశం పార్టీ 44 ఏళ్ల ఉత్సవంలో మరో శతాబ్దం రాష్ట్రానికి, దేశానికి మార్గదర్శకంగా నిలవాలి.

తొలి నుంచీ ఎన్టీఆర్, చంద్రబాబుల నాయకత్వంలో తెలుగు జాతి ప్రగతిస్వామ్యంలో భాగమైంది. అన్న ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా నేడు పార్టీని చంద్రబాబు, లోకేష్ నడిపిస్తున్నారు.

○ మన్నవ సుబ్బారావు

ఎన్టీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం!

నలభై మూడేళ్ల క్రితం తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి తెలుగు ప్రజల చరిత్రను సుసంపన్నం చేసిన మహనీయుడు ఎన్టీఆర్. 'సమాజమే దేవాలయం–పేద ప్రజలే దేవుళ్ళు' అనే వినూత్న రాజకీయ సిద్ధాంతాన్ని ఆవిష్కరించి పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎన్నో అమూల్యమైన సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించి, పేదల దశను మార్చిన అరుదైన పాలకుడు. ఆనాటి ఎన్టీఆర్ పథకాలు నేడు యావద్భారతావనికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. నేడు అన్ని రాజకీయ పక్షాలు ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు, సంస్కరణలు అమలు చేయాల్సిన అనివార్యతను కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్.

దేశంలో మొదటిసారి పేద వారి సంక్షేమం గురించి ఆలోచించిన మానవతావాది ఎన్టీఆర్. మధ్యాహ్న భోజన పథకం, రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాలను అమలు చేశారు. సింగిల్ విండో సిస్టమ్, ఆస్తిలో స్త్రీలకు హక్కు, పేదలకు పక్కా ఇళ్లు, వృద్ధాప్య పింఛన్లు, జనతా వస్త్రాల పంపిణీ, పటేల్–పట్వారీ వ్యవస్థ రద్దు, పద్మావతి విశ్వ విద్యాలయం ఏర్పాటు, మహిళల కోసం విద్యా సంస్థలు, విద్య–ఉద్యోగాలలో మహిళలకు రిజర్వేషన్లు వంటివి అమలు చేశారు. జనాభాలో 50శాతం ఉన్న వెనుకబడిన వర్గాలకు రాజకీయాల్లో పురోగతి, ఎస్సీ–ఎస్టీల కోటా పెంపు, మైనారిటీలకు ప్రత్యేక సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు, నీటిపారుదల ప్రాజెక్టులు, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, ఉపాధి కల్పించడం, రైతులకు రాయితీలు, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర, డ్వాక్రా గ్రూపులు, తెలుగువారి జీవన ప్రమాణాలు పెరుగుదలకు ఎంతో కృషి చేశారు.

నాటి రూ.2 కిలో బియ్యం పథకం నేడు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆహార భద్రత పథకం అయింది. వృద్ధుల, వితంతువుల పెన్షన్లకు శ్రీకారం చుట్టి ఆనాడు రూ.30 పింఛను అందిస్తే, నేడు దేశమంతా అన్ని ప్రభుత్వాలు పెన్షన్లు అమలు చేస్తున్నాయి. ఎన్టీఆర్ పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించారు. ఆ పథకం నేడు దేశంలోనే ఆదర్శంగా నిలిచి దేశంలో పేదలకు శాశ్వత పక్కా గృహనిర్మాణ పథకంగా అమలు జరుగుతున్నది.

మహిళా సాధికారతకు ఎన్టీఆర్ పెద్దపీట వేశారు. తండ్రి ఆస్తిలో సమాన హక్కు కల్పించడం ద్వారా నారీలోకం మనసుల్లో అన్నగా కొలువు దీరారు. 1984లో ఆ చట్టం చేస్తే నేడు కేంద్ర ప్రభుత్వం అలాంటి చట్టం తేవడానికి మరో 40 ఏళ్లు పట్టిందంటే ఆయన దూరదృష్టి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు, వారు చేయదగిన ప్రభుత్వ ఉద్యోగాల్లో 30శాతం వారికే సంక్రమించేటట్లు కేటాయించారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థినులకు 33శాతం రిజర్వేషన్ కల్పించారు. నేడు పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది.

పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎన్నో అమూల్యమైన సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించి, పేదల దశను మార్చిన అరుదైన పాలకుడు ఎన్టీఆర్. నేడు అన్ని రాజకీయ పక్షాలు ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు, సంస్కరణలు అమలు చేస్తున్నాయి.


ఇంజనీరింగ్, వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు ఎంసెట్ విధానాన్ని తీసుకువచ్చారు. వృత్తి విద్యా కళాశాలల్లో క్యాపిటేషన్ ఫీజు రద్దు చేశారు. వాటిలో ప్రవేశాలకు ప్రతిభే కొలబద్ద కావాలన్నారు. దానినే నేడు దేశం అంతా అమలు చేస్తున్నారు. గ్రామీణ ప్రజల వైద్య సౌకర్యాల కల్పన కోసం మండల స్థాయిలో పీహెచ్‌సీలతో పాటు, 30–50–100 పడకల ఆసుపత్రులు నిర్మించడంతో పాటు నిమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చి దేశంలోనే మొట్టమొదటి సూపర్ స్పెషాలిటీ అత్యున్నత వైద్య సేవలను ప్రజలకు అందించారు. వెనుకబడిన వర్గాల విద్యార్థులకు సాంఘిక సంక్షేమ వసతిగృహాలను ఏర్పాటు చేశారు. దేశంలోనే తొలి సారిగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ప్రజల వద్దకు పరిపాలన అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఏసీ గదులకే పరిమితమైన పాలనను ప్రజల వద్దకు చేర్చారు. వివిధ పనుల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగి ప్రజలు తమ సమయం వృథా చేసుకోకుండా ప్రభుత్వ కార్యాలయాలన్నిటినీ ఒకే చోటుకి చేర్చారు. సహకార వ్యవస్థకు సంపూర్ణమైన ప్రతిపత్తి, రైతులకు ప్రయోజనం చేకూర్చే ఏక గవాక్ష విధానాన్ని ఏర్పాటు చేశారు.

1985 మే 25న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాండలిక వ్యవస్థ మొగ్గ తొడిగింది. 305 తాలూకాలు, 1,084 రెవెన్యూ ఫిర్కాలను రద్దు చేస్తూ 1,104 రెవెన్యూ మండలాలు ఏర్పాటు చేశారు. మండలం యూనిట్‌గా గ్రామాల అభివృద్ధికి బాటలు వేశారు. ప్రతి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువైద్యశాల, వాణిజ్య బ్యాంక్, ప్రాథమిక సహకార పరపతి సంఘం, పోలీస్ స్టేషన్, జూనియర్ కళాశాల, సబ్ ట్రెజరీ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఉండేలా రూపకల్పన చేశారు. చిన్న, సన్నకారు రైతులకు భూమి శిస్తు రద్దు చేశారు.

అట్టడుగు వర్గాల వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచడంతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ రిజర్వేషన్ అమలు చేశారు. గ్రామ స్థాయిలోనూ బీసీలు స్వతంత్రంగా ఎదిగేలా ప్రోత్సాహమిచ్చారు. బడికి వెళ్లే విద్యార్థులు ఆకలితో ఉండకూడదని మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారు. గిరిజనుల సంక్షేమానికి ఎన్టీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని చిన్న ఉద్యోగాలు వారికే చెందేలా నిర్ణయాలు తీసుకున్నారు. ఐటీడీఏలను బలోపేతం చేశారు. గిరిజన ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు, గిరిజనులే ఉపాధ్యాయులుగా వేయి పాఠశాలలు నిర్మించారు. వారికి ఇళ్ల నిర్మాణం, వైద్య సౌకర్యం కల్పించారు. స్వచ్ఛ భారత్ అంటూ మరుగుదొడ్ల నిర్మాణానికి ఇవాళ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. కానీ నాలుగు దశాబ్దాల క్రితమే గ్రామీణ ప్రాంతాల్లో ఆడపడుచులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేందుకు గ్రామీణ బహిర్ ప్రదేశ పథకాన్ని ప్రవేశపెట్టారు ఎన్టీఆర్. దేశవ్యాప్తంగా రైతులకు పదివేలలోపు రుణాలను రద్దు చేసేందుకు ఉపప్రధాని దేవీలాల్‌ను ఒప్పించారు. రైతు రుణమాఫీ నేడు అనేక రాష్ట్రాల్లో అమలు జరుగుతున్నది. తెలుగు నేలను ఎంతో మంది ముఖ్యమంత్రులు పాలించారు. కానీ రాజకీయాల్లో తనదైన శకాన్ని ఎన్టీఆర్ సృష్టించుకున్నారు.

▪ తొండపు దశరథ జనార్దన్
టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు

(నేడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావదినం)



కమిషనర్ బంగ్లా.. డీఆర్ఆర్ స్టేడియం..

దండోరా

నడిరోడ్డుపై మంటగలిసిన కార్పొరేషన్ పరువు

కమిషనర్ బంగ్లా, డీఆర్ఆర్ స్టేడియాల అటాచ్

ఆ నిధులు ఇతర అవసరాలకు..

కార్పొరేషన్‌కు అనేకమంది కమిషనర్లు మారారు. ప్రద్యుమ్న తర్వాత వచ్చిన కమిషనర్లు ఎవరూ కూడా కాంట్రాక్టు సంస్థకు చెల్లించాల్సిన బిల్లుపై దృష్టి సారించలేదు. పైగా ఆ డబ్బును వేరే అవసరాలకు వినియోగించారు. దీంతో 2012 నుంచి ఇప్పటి వరకు దాదాపు 13 ఏళ్ల పాటు కాంట్రాక్టు సంస్థకు డబ్బు చెల్లించలేదు. కాంట్రాక్టు సంస్థకు వడ్డీతో కలిపి రూ.35 కోట్ల మేర కార్పొరేషన్ చెల్లించాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టు సంస్థ తనకు జరిగిన అన్యాయంపై విజయవాడలోని కమర్షియల్ కోర్టులో కేసు వేసింది. వాయిదాలు నడుస్తూ ఉన్నాయి. కార్పొరేషన్ దగ్గర డబ్బు లేకపోతే కమిషనర్ బంగ్లా, డీఆర్ఆర్ స్టేడియం అమ్మి అయినా తమకు డబ్బు చెల్లించాల్సిందిగా కాంట్రాక్టు సంస్థ కమర్షియల్ కోర్టుకు నివేదించింది. దీంతో నెల కిందట కమర్షియల్ కోర్టు కార్పొరేషన్‌ను గట్టిగా హెచ్చరించింది. కాంట్రాక్టు సంస్థ సూచించిన విధంగా ఆస్తులమ్మి డబ్బు చెల్లించాలని ఆదేశించింది. దాదాపు నెల రోజులు గడిచినా కార్పొరేషన్ అధికారులు ఆ పని చేయలేదు. దీంతో శుక్రవారం కమర్షియల్ కోర్టు సిబ్బంది వచ్చి కమిషనర్ బంగ్లా, డీఆర్ఆర్ స్టేడియాలను తమ ఆధీనంలోకి తీసుకున్నట్టుగా నోటీసులు అంటించటంతో పాటు ప్రజలకు తెలిసేలా దండోరా వేయించారు. ఈ పరిణామాలతో కంగుతిన్న కార్పొరేషన్ అధికారులు హైకోర్టును ఆశ్రయించటం గమనార్హం.

నడిరోడ్డుపై విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరువు మంటగలిసింది. ఓ కాంట్రాక్టు సంస్థకు డబ్బును ఎగ్గొట్టినందుకు బందరు రోడ్డు వెంబడి మునిసిపల్ కమిషనర్ బంగ్లా, డీఆర్ఆర్ ఇండోర్ స్టేడియాన్ని విజయవాడ కమర్షియల్ కోర్టు శుక్రవారం తమ ఆధీనంలోకి తీసుకుంది. అంతేకాదు.. గేట్లకు నోటీసులు అంటించడంతో పాటు దండోరా కూడా వేయించింది.

- నోటీసులు అంటించిన కమర్షియల్ కోర్టు సిబ్బంది
- ప్రజలందరికీ తెలిసేలా దండోరా వేయించిన అధికారులు
- నాటి బీఆర్‌టీఎస్ రోడ్డు పనుల్లో కాంగ్రెస్ నిర్వాకం
- 13 ఏళ్లుగా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించని వైనం
- కమర్షియల్ కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్టు సంస్థ
- బిల్లులు చెల్లించాలని నెల కిందట కార్పొరేషన్‌కు ఆదేశాలు
- అధికారులు పట్టించుకోకపోవడంతో చర్యలు.. అటాచ్



డీఆర్ఆర్ స్టేడియం గేటుకు నోటీసు అంటించి, దండోరా వేయిస్తున్న కమర్షియల్ కోర్టు సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉండగా, 2012లో నాటి యూపీఏ ప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జేఎన్ఎన్యూఆర్ఎం) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా అప్పట్లో రూ.2 వేల కోట్ల వరకు వివిధ పథకాలకు నిధులు కేటాయించింది. ఇందులో బస్ ర్యాపిడ్ ట్రాన్సిస్ట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్) ఒకటి. రూ.154 కోట్ల ఈ ప్రాజెక్టుకు అప్పట్లో యూపీఏ ప్రభుత్వం నిధులు కేటాయించింది. రైల్వేశాఖతో మాట్లాడి సత్యనారాయణపురంలోని పాత రైల్వేలైన్ స్థలాన్ని కార్పొరేషన్ అధికారులు తీసుకున్నారు. ప్రతిగా వేరేచోట కార్పొరేషన్ తన భూమిని రైల్వేకు కేటాయించింది. సత్యనారాయణపురం పాత రైల్వేలైన్ స్థానంలో బీఆర్‌టీఎస్ రోడ్డును అభివృద్ధి పరచాలని నిర్ణయించింది. అప్పటి కౌన్సిల్ పాలకపక్షంగా ఉన్న కాంగ్రెస్.. బీఆర్‌టీఎస్ పథకాన్ని సత్వర రవాణా వ్యవస్థ కోసం కాకుండా రోడ్లను మిగతా 4లో..

డీపీఆర్ మారడంతో..

కేంద్ర ప్రాయోజిత పథకం కాబట్టి డీపీఆర్‌కు భిన్నంగా పనులు చేపట్టకూడదు. అప్పటి పాలకపక్షం, కార్పొరేషన్ ఉన్నతాధికారులు కేంద్రానికి ఇచ్చిన డీపీఆర్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా కాంట్రాక్టు సంస్థతో పనులు చేయించారు. వంతెనలు, కల్వర్టులు వంటివి అదనంగా ప్రతిపాదించారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తీసుకోకుండా వీటిని చేపట్టకూడదు. కేంద్రంలో తమ ప్రభుత్వమే ఉందని.. అప్పటి కాంగ్రెస్ పాలకపక్షం కాంట్రాక్టు సంస్థ మెడపై కత్తి పెట్టి పనులు చేయించింది. దీంతో కాంట్రాక్టు సంస్థ తప్పక.. కార్పొరేషన్ అధికారులు చెప్పిన ప్రకారం పనులు చేసింది. ఆ తర్వాత డీపీఆర్ ప్రకారం పనులు జరగలేదని కేంద్ర ప్రభుత్వం కొంతమేర నిధులను నిలిపివేసింది. దీంతో కాంట్రాక్టు సంస్థ ఇబ్బందుల్లో చిక్కుకుంది. అప్పటి మున్సిపల్ కమిషనర్ పీఎస్ ప్రద్యుమ్న ఈ సమస్యను పరిష్కరించటానికి ఎంతో కృషి చేశారు. కాంట్రాక్టు సంస్థకు జాతీయ స్థాయిలో ఉన్న పరిచయాల దృష్ట్యా ఈ తప్పును సరిచేసుకునేందుకు వీలుగా కార్పొరేషన్ అధికారులతోనే డీపీఆర్‌ను సవరించి, దానిని అప్పటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జరిగిన పరిస్థితిని వివరించింది. సవరింపులకు ఆమోదం పడేలా తన వంతు కృషి చేసింది. ఆ రివైజ్డ్ డీపీఆర్ ప్రకారం ఆ తర్వాత కార్పొరేషన్‌కు డబ్బులొచ్చాయి.



పంజాలో రంజాన్

దేదీప్యమానంగా వెలిగిపోతున్న పంజా సెంటర్

- ఉపవాసాల అనంతరం క్యూ కడుతున్న ముస్లింలు
- కాంతులీనుతున్న దుకాణాలు, హలీం స్టాళ్లు
- సేమ్యా, ఖర్జూర పండ్ల కొనుగోళ్లతో కిటకిట
- వస్త్ర దుకాణాల్లో షాపింగ్‌ల జోరు

మరో రెండు రోజుల్లో రంజాన్ వేడుకలకు ముస్లింలు సిద్ధమవుతుండగా, వన్‌టౌన్‌లోని పంజా సెంటర్ సందడిగా మారిపోయింది. ఉపవాస దీక్షల అనంతరం ఇక్కడికి వస్తున్న ముస్లింలతో నిత్యం కిటకిటలాడుతోంది. హలీంతో పాటు పలు మాంసాహార దుకాణాలు, వస్త్ర షాపులు కళకళలాడుతున్నాయి. 6లో

జనావాసాలపై.. బూడిద వాన!

వెలుగుల మాటున విషవాయువులు వెదజల్లుతున్న ఎన్టీటీపీఎస్!



విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ప్రమాదకరంగా వదిలేసిన బూడిద కుప్పలు 4లో

రేపు స్వర్ణభారత్ ట్రస్టులో ఉగాది సంబరాలు

- పాల్గొననున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య, సీఎం చంద్రబాబు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఉన్నతాధికారులు

4లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 06-19 (శనివారం సాయంత్రం)
సహర్ : 04-51 (ఆదివారం ఉదయం)

కోల్డ్ స్టోరేజీ ఖాతాలు ఫ్రీజ్

బ్యాంకు లావాదేవీలపై ఉన్నతాధికారుల విచారణ

- ఇన్సూరెన్స్ లేకుండా రుణ మంజూరుపై మేనేజర్‌కు షోకాజ్
- రుణపరిమితి పెంచిన కొద్దిరోజులకే ప్రమాదం
- విచారణలో వెనుకబడిన పోలీసులు
- సర్వం కోల్పోయి రోడ్డునపడిన బాధిత రైతులు



(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట) : జగ్గయ్యపేట సమీపంలోని తొర్రగుంటపాలెం కోల్డ్ స్టోరేజీకి సంబంధించి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్న అన్ని రుణ ఖాతాలను అధికారులు ఫ్రీజ్ చేశారు. 2024, ఫిబ్రవరి నుంచి బ్యాంకులో కోల్డ్ స్టోరేజీ ఖాతాలను నిర్వహిస్తోంది. సాయి తిరుమలగిరి అగ్రి ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలకు చెందిన రావూరి శ్రీనివాసరావు, మారెళ్ల నారాయణరెడ్డి, హరినరసింహారావులు భాగస్వాములుగా కోల్డ్ స్టోరేజీ నిర్వహిస్తున్నారు. ఈ స్టోరేజీ భవనం, రైతులు నిల్వ ఉంచే పంటల ఆధారంగా, వాటినే ష్యూరిటీలుగా తొలుత రూ.5 కోట్ల గరిష్ఠ పరిమితితో రుణాన్ని బ్యాంకు మంజూరు మిగతా 4లో..

యాక్షన్.. రియాక్షన్

కొలికపూడి వ్యవహారంపై అధిష్ఠానం సీరియస్

నివేదిక సమర్పించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం

- తిరువూరు పరిణామాలపై అక్కడి నేతలతో సమాలోచన
- కొలికపూడి వ్యాఖ్యలపై స్థానిక నాయకులతో చర్చ
- ఏఎంసీ మాజీ చైర్మన్‌పై ఆరోపణలపైనా ఆరా
- రమేశ్‌రెడ్డితోనూ మాట్లాడి వివరణ తీసుకున్న నెట్టెం
- మంగళగిరి కార్యాలయం నుంచి స్థానిక నేతలకు ఫోన్లు
- కొలికపూడి వ్యాఖ్యలపై అభిప్రాయ సేకరణ



టీడీపీ అధిష్ఠానానికి 48 గంటల డెడ్‌లైన్ విధిస్తూ అల్టిమేటం జారీ చేసిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యాఖ్యల దుమారం కాక రేపింది. కొలికపూడి 'యాక్షన్'పై అధిష్ఠానం వెంటనే 'రియాక్ట్' అయ్యింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌ను రంగంలోకి దింపిన రాష్ట్ర నాయకత్వం వెంటనే నివేదిక కోరింది. ఏఎంసీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డిపై ఆరోపణలు, ఎమ్మెల్యే కొలికపూడి వ్యాఖ్యలపై ఆయన వివరాలు సేకరించి అధిష్ఠానానికి నివేదిక పంపారు. అంతేకాదు.. రాష్ట్ర కార్యాలయం నుంచి తిరువూరు నాయకులకు ఫోన్లు వస్తుండటంతో ఇక్కడి రాజకీయంపై సర్వత్రా ఉత్కంఠ రేగుతోంది.

వైసీపీతో సంబంధాలపైనా ఆరా

కొలికపూడికి వైసీపీ నాయకులతో సంబంధాలున్నాయని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో వాటిపైనా జిల్లా పార్టీ దృష్టిసారించి విచారణ జరిపినట్టుగా సమాచారం. ఇసుక రవాణాకు సంబంధించి స్థానిక వైసీపీ నాయకులతో ఆయనకు సంబంధాలున్నాయని పార్టీ కార్యకర్తలే ఆరోపణలు చేస్తుండటంతో మూలాలేంటో తెలుసుకున్నారు. అధిష్ఠానానికి ఇచ్చిన నివేదికలో ఈ విషయాలు కూడా పొందుపరిచినట్టు తెలిసింది.

తిరువూరు నేతలకు ఫోన్లు

అధిష్ఠానం ఆదేశాల మేరకు మంగళగిరిలోని టీడీపీ కార్యాలయ సిబ్బంది తిరువూరు నియోజకవర్గ నేతలకు శుక్రవారం ఫోన్లు చేశారు. అన్ని మండలాలు, వార్డు అధ్యక్షులకు ఈ ఫోన్లు వెళ్లాయి. వీరిలో చాలా మంది కొలికపూడి వ్యాఖ్యలను ఖండించినట్టుగా తెలుస్తోంది. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశాలున్నా కొలికపూడి దుందుడుకుతనంతో వ్యవహరించారని వారు అభిప్రాయపడ్డారు. పార్టీకి అల్టిమేటం జారీ చేయటం తగదని, సమస్యను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తే సరిపోయేదని చెప్పినట్టు సమాచారం. ఇలాంటి దుందుడుకు చర్యల వల్ల నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని, అధిష్ఠానం తక్షణం చెక్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిసింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధిష్ఠానానికి ఎందుకు అల్టిమేటం జారీ చేశారు? రాజీనామా ఎందుకు చేస్తానన్నారు? ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలవాల రమేశ్‌రెడ్డి వివాదం ఏమిటి? అనే వివరాలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం శుక్రవారం సేకరించారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులతో నెట్టెం మాట్లాడారు. గిరిజన మహిళపై ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న రమేశ్‌రెడ్డిని కూడా వివరణ కోరారు. ఫోన్ కాల్ గురించి కూడా అడిగినట్టు తెలిసింది. వివరాలన్నీ సేకరించిన నెట్టెం రఘురామ్.. అధిష్ఠానానికి నివేదిక ఇచ్చారు. ఈ నివేదికను అధిష్ఠానం పరిశీలించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోనుంది.

కొలికపూడి తీరుపై జిల్లా నేతల అసంతృప్తి

కొలికపూడి తీరుపై టీడీపీ జిల్లా నాయకత్వం తీవ్ర అసంతృప్తితో ఉంది. రమేశ్‌రెడ్డి ఉదంతంపై తమకు ఫిర్యాదు అందగా, విచారణ జరుపుతున్న దశలోనే అల్టిమేటం జారీ చేయటంతో షాకైంది. ఎమ్మెల్యేగా గెలిచిన ఎనిమిది నెలల్లోనే కొలికపూడి మిగతా 4లో..

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ జోరులో వైసీపీ బుకీ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అవనిగడ్డ నుంచి వచ్చి పటమట కేంద్రంగా రూ.లక్షల్లో పందేలు కడుతున్న అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి కుమారుడు పవన్‌కుమార్‌ను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అతని ఫోన్, బ్యాంక్ ఖాతాను పరిశీలించిన పోలీసులు తెరవెనుక ఉన్న వారిని బయటకు లాగే పనిలో పడ్డారు.

వైసీపీ బుకీ.. ఆటకట్టు



ఐపీఎల్ బెట్టింగ్‌లో అవనిగడ్డ ఎంపీపీ కుమారుడి అరెస్టు

ముందస్తు సమాచారంతో చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

అవనిగడ్డ నుంచి వచ్చి పటమట కేంద్రంగా బెట్టింగ్‌లు

- బ్యాంక్ ఖాతాలో భారీ నగదు నిల్వలు
- జనసేన మద్దతుదారుడూ పోలీసుల అదుపులో..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ బెట్టింగులకు నగరంలోని అయ్యప్పనగర్ నెహ్రూ రోడ్డులో ఉంటున్న ఇళ్ల లోకేశ్ (30) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనను పోలీసు అధికారులు తీవ్రంగా పరిగణించారు. విజయవాడ మిగతా 4లో..



పవన్‌కుమార్

ఆ డబ్బంతా పందేలదేనా..?

పవన్‌కుమార్ ఖాతాలో ఉన్న భారీ నగదు నిల్వ ఎవరిదన్న దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. బెట్టింగ్‌లో గెలిచిన వారికి చెల్లించాల్సిన మొత్తంగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మొత్తం తన కష్టార్జితంగా పవన్‌కుమార్ చెబుతున్నట్టు తెలిసింది. గోపయ్య బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై పోలీసు అధికారులు త్వరలో అధికారికంగా వివరాలు వెల్లడిస్తారని సమాచారం.

జనావాసాలపై.. బూడిద వాన!



(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

తినే ఆహారం.. తాగే నీరు.. పీల్చే గాలి.. అంతా కలుషితం. ఫలితంగా శ్వాసకోశ వ్యాధులు.. అనేక రుగ్మతలు వ్యాప్తి చెందుతున్నాయి. కొండపల్లి పరిసరాల్లో ఎక్కడ చూసినా బూడిద దర్శనమిస్తోంది. ఈ పరిణామం ఆందోళనకు గురిచేస్తోంది. ఒక వైపు ప్రజలు, మరో వైపు పర్యావరణం, ఇంకోవైపు పశువులు.. ఇలా సకల జీవరాశులు.. చెట్లు, చేమలు, వాగులు, వంకలు, నదులు అన్నీ ఎన్టీటీపీఎస్ బూడిద బాధితులుగా మారిపోయాయి. ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో బూడిద కాలుష్య నివారణకు ప్లాంట్ యాజమాన్యం, ఉన్నతాధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలకు శాపంగా మారింది.

● ఎన్టీటీపీఎస్‌లో మొత్తం ఎనిమిది యూనిట్లు ఉన్నాయి. మొత్తం 210 మెగావాట్ల సామర్థ్యం గలవి ఆరు యూనిట్లు, 500 మెటావాట్ల సామర్థ్యం గల ఒక యూనిట్, 800 మెగావాట్ల సామర్థ్యం గల ఒక యూనిట్ నుంచి మొత్తం 2,560మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇందుకుగాను రోజుకు సుమారు 40 వేల టన్నుల బొగ్గును వాడుతుంటారు. 40 వేల టన్నుల బొగ్గు నుంచి సుమారు 20 వేల టన్నుల తడి, పొడి బూడిద విడుదలవుతుంది. పైపులైన్ ద్వారా తడి బూడిదను యాష్‌పాండ్‌కు తరలిస్తుంటారు. అది కాక బొగ్గు వినియోగం ద్వారా వచ్చే బూడిదను ప్లాంట్‌కు ఉన్న సైలోస్ ద్వారా వాహనాల్లో నింపి సిమెంట్ ఫ్యాక్టరీలకు యాష్ ట్యాంకర్ల ద్వారా బయటకు తరలిస్తుంటారు. అయితే 800 మెగావాట్ల ప్లాంట్‌లో సైలోస్ లేకపోవడంతో బూడిదను నేరుగా కిందకు వదిలేస్తున్నారు. మిగిలిన ఏడు యూనిట్లలో కూడా మెయింటినెన్స్ సరిగా లేకపోవడంతో ప్లాంట్‌లో వదిలేస్తున్నారు. ఇలా వదిలిన బూడిద నేరుగా గాలిలో కలుస్తోంది. దీంతో కొండపల్లి, ఇబ్రహీంపట్నం, పశ్చిమ ఇబ్రహీంపట్నం, జూపూడి, కిలేశపురం, మూలపాడు, కేతనకొండ, కొటికలపూడి, తుమ్మలపల్లి, గుంటుపల్లి, ఈలప్రోలు, రాయనపాడు, పైడూరుపాడు వరకు బూడిద నేరుగా గాలిలో కలిసి ఆయా గ్రామాలపై పడిపోతుంది.

- వెలుగుల మాటున విషవాయువులు వెదజల్లుతోన్న ఎన్టీటీపీఎస్!
- నీరు, గాలి, ఆహారం సర్వం బూడిద, కలుషితమయం
- ప్రజల ప్రాణాలతో విద్యుత్ అధికారుల చెలగాటం..
- నివారించకుంటే ఇంటికో రోగి ఖాయం : పర్యావరణ వేత్తల హెచ్చరిక
- కొండపల్లి మున్సిపాలిటీ ఆవాసప్రాంతాలకు పొంచి ఉన్న ముప్పు
- కనీస తనిఖీలు చేపట్టని కాలుష్య నియంత్రణ మండలి
- ఎన్‌హెచ్-30 పక్కనే బొగ్గు స్టాక్ పాయింట్ ఏర్పాటుకు సన్నాహాలు

దేశానికే వెలుగులు ఇచ్చిన విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్) ఖ్యాతి బూడిదలో పోసిన పన్నీరులా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పాపాలు నేడు శాపాలుగా మారాయి. ప్రధానంగా నాసిరకం బొగ్గు కొనుగోలు చేయడంతో ప్లాంట్ మొత్తం బూడిదమయమైంది. నాటి పాపం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. బూడిద కాలుష్యంపై ప్రజలు ప్లాంట్ ఎదుట తిరుగుబాటు చేయడంతో సుమోటాగా కేసులు పెట్టించుకునే దయనీయ స్థితికి ఎన్టీటీపీఎస్ దిగజారింది. దీంతో ఇబ్రహీంపట్నం కాస్తా బూడిదపట్నంగా మారిపోయింది. ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంపై సమగ్ర కథనం..


రహదారి పక్కనే ప్రమాదకరంగా బూడిద కుప్పలు

కొన్నిచోట్ల అయితే నేరుగా ఇళ్లలోకే వెళ్లిపోతుంది. ఆగి ఉన్న వాహనాల నిండా, నీటి తొట్టెల నిండా బూడిదే. ఇక టిఫెన్ సెంటర్ల ప్లేట్లలో సైతం బూడిద దర్శనమివ్వడం శోచనీయం. ప్లాంట్ నుంచి నేరుగా వెళ్లి బూడిద చెరువులో కలిసే నీరు కృష్ణానదిలో కలుస్తుంది. ప్లాంట్ నుంచి మరో డ్రెయినేజీ ద్వారా వచ్చే బూడిద నీరు కూలింగ్ కెనాల్‌లో కలుస్తుంది. దానిలో నుంచి ఇబ్రహీంపట్నం ఫిల్టర్ బెడ్‌లోకి తీసుకునే తాగునీరు సైతం కలుషితం అవుతోంది. 104 గ్రామాలకు వెళ్లే తాగునీటిలో బూడిద అవశేషాలు ఎంత శుద్ధి చేసినా మిగులుతునే ఉంటున్నాయని నీటి కూళాయిల వద్ద గుడ్డలు అడ్డుపెట్టి మరీ వస్తున్న బూడిదను ప్రజలు చూపుతున్నారంటే బూడిద ఏస్థాయిలో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందో అర్థమవుతోంది.

● ఎందుకిలా జరుగుతోంది?

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బూడిదను బంగారం చేశారు అధికార పార్టీ నేతలు. ప్రజల ప్రాణాలను బూడిద కాలుష్యం హరిస్తుంటే ప్రజా ప్రతినిధులకు, ప్లాంట్‌లోని కొందరు ఉద్యోగులకు, అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. దీంతో బూడిద వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగటంతో నివారణ చర్యలపై ఏ ఒక్కరూ శ్రద్ధ చూపలేదనే ఆరోపణలున్నాయి. ఈ కారణంగానే బూడిద కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతోందనేది నిత్య సత్యం.

● కొండపల్లి రిజర్వు ఫారెస్టుకు ముప్పు!

ప్లాంట్ నుంచి వెలువడుతున్న బూడిద వల్ల కొండపల్లి రిజర్వు ఫారెస్టు సర్వనాశనం అవుతోంది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లి వరకు ఉన్న రిజర్వు ఫారెస్టులో పచ్చని చెట్లు మాడిపోయాయి. ఒకప్పుడు పచ్చగా దర్శనమిచ్చిన కొండపల్లి కొండలు బూడిదతో వాటి సహజత్వాన్ని కోల్పోయాయి. కొండల్లో చెట్లు మాడిపోయి బోడిగా దర్శనమిస్తున్నాయి. ఈ పరిణామం పర్యావరణ ప్రేమికులను తీవ్రంగా కలచివేస్తున్నది. రైతులు సాగు చేస్తున్న పంటలు సైతం బూడిద బారిన పడి నాశనమవుతున్నాయి. బూడిద కాలువల్లో నీరు తాగి పశువులు సైతం రోగాల బారిన పడుతున్నాయని, కలుషిత నీరు తాగిన పశువుల సూడి నిలవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

● సుమోటోగా కేసులు

ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంపై గతేడాది నవంబరులో 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రాణాలు హరిస్తున్న ఎన్టీటీపీఎస్ మాకొద్దు' శీర్షికన ప్రచురితమైన కథనంతో ఎన్జీటీ సుమోటోగా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, ఛైర్‌పర్సన్, నిపుణుల సభ్యుడు డాక్టర్ ఎ.సెంథిల్ వేల్‌తో కూడిన జాతీయ హరిత ట్రిబ్యునల్ ప్రధాన ధర్మాసనం స్వయంగా కేసును స్వీకరించింది. ప్లాంట్ నుంచి విడుదలయ్యే బూడిద దాదాపు 10 కిలోమీటర్ల వ్యాసార్థంలో గ్రామాలను కలుషితం చేస్తోందని, సమీప పంటలను నాశనం చేయడాన్ని తీవ్రంగా పరిగణించి వాయు (కాలుష్య) నివారణ, నియంత్రం చట్టం 1981, పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986 నిబంధనలను ఉల్లంఘించడాన్ని ఎన్జీటీ గుర్తించింది. ఈకేసులో కేంద్ర, రాష్ట్ర, కాలుష్య నియంత్రణ బోర్డు, పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ, విజయవాడ జిల్లా మేజిస్ట్రేట్‌లను ప్రతివాదులుగా ట్రిబ్యునల్‌లో చేర్చింది. 2025 జనవరి 10న విచారణ జాబితాలో చేర్చింది. అయినా ఎన్టీటీపీఎస్ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రతి వాదులుగా చేర్చిన వారి తీరులో ఏమాత్రం మార్పు రావడం లేదు. బూడిద కాలుష్యం మరింత అధికమైంది.


సైలోస్ లేకపోవడంతో నేరుగా పైకి లేస్తున్న బూడిద

● వైసీపీ పాలకుల పాపం.. ప్లాంట్‌కు శాపం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీటీపీఎస్‌లో కాలుష్య నివారణచర్యలు పూర్తిగా గాలికొదిలేయడమే నేటి దుస్థితికి కారణంగా తెలుస్తోంది. గత ప్రభుత్వంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు విజయవాడలో ఉన్న ఎన్టీటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో పార్టీలు చేసుకునేందుకే పరిమితం అయ్యారనే ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి. నాటి నిర్లక్ష్యం నేడు ప్లాంట్‌కు, ఈప్రాంత ప్రజలకు శాపంగా దాపురించాయి.

● రోగాల బారిన వందల సంఖ్యలో ఉద్యోగులు

ఎన్టీటీపీఎస్ ప్లాంట్‌లో అనేక విభాగాల్లో వేలసంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు ఉంటే వారిలో వందల సంఖ్యలో కాలుష్యం వల్ల రోగాలబారిన పడిన ఘటనలు వెలుగుచూస్తున్నా సంస్థ ఉన్నతాధికారుల్లో ఏమాత్రం చలనం లేదు.

బూడిద చాలనట్టు బొగ్గు స్టాక్ పాయింట్

ఇప్పటికే బూడిద కాలుష్యంతో అల్లాడుతున్న ప్రజల నెత్తిన మరో పిగుడు వేసేందుకు ఎన్టీటీపీఎస్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇబ్రహీంపట్నం- చత్తీస్‌ఘడ్ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎన్టీటీపీఎస్ కొత్తగేటు వద్ద


ఎన్.హెచ్ 30 అనుకుని బొగ్గు స్టాక్ పాయింట్ ఏర్పాటుకు కేటాయించిన స్థలం

ప్రభుత్వ ఆసుపత్రి, డీఏతఈ స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఖాళీగా ఉన్న ఎన్టీటీపీఎస్ స్థలంలో బొగ్గు స్టాక్ పాయింట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కొద్ది రోజులుగా ఖాళీ స్థలంలో పనులు చేయిస్తున్నారు. 5వ దశ 800 మెగావాట్ల యూనిట్‌కు బొగ్గును నేరుగా పంపేందుకు ఇక్కడ స్టాక్ పాయింట్ పెడుతున్నారు. ఇదే కనుక జరిగితే జాతీయ రహదారి బొగ్గుమయం కావడం ఖాయమని, పాతగేటు ఎదురుగా ఉన్న నివాశితులకు, ఆసుపత్రి సిబ్బంది, రోగులకు, పాఠశాల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తప్పవనే వాదన బలంగా వినిపిస్తున్నది.

● వైద్య శిబిరాలు ఏమయ్యాయి?

ప్లాంట్ పరిసరాల్లో ప్రజలు, పశువులకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు సరఫరా చేయాల్సి ఉంది. ఎన్టీటీపీఎస్ అధికారులు మొక్కుబడి తంతుగానే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులు సైతం విడుదల చేయడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

మాస్క్ లేకుండా ఉండలేకపోతున్నాం

- ఖుద్రు, ఇబ్రహీంపట్నం



మాస్క్ లేకుండా క్షణం కూడా ఉండలేం. ప్లాంట్ నుంచి బూడిద పెద్ద ఎత్తున బయటకు వచ్చేస్తుంది. దుకాణంలో ప్రతి వస్తువుపైనా పడిన బూడిద దులుపుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా ఆరోగ్యాలు ఏమవుతాయోనని భయాందోళన చెందుతున్నాం. ఇబ్బందయినా మాస్క్ ఉండాల్సిందే.

ఇళ్లలో ఉండే పరిస్థితి లేదు

- జాస్తి గోపాలకృష్ణ, గుంటుపల్లి



ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో ఇళ్లల్లో ఉండే పరిస్థితి లేదు. బూడిద వర్షం వచ్చినట్టు ఇళ్లను, పంటలను కమ్మేస్తుంది. దీంతో పంటలు పాడవుతున్నాయి. వాహనాల నిండా బూడిదే. పర్యావరణం సర్వనాశనమవుతోంది. ఎన్టీటీపీఎస్ అధికారులు మొక్కల పెంపకాన్నే విస్మరించారు.

రేపట్నుంచి ఇంద్రకీలాద్రిపై

ఉగాది ఉత్సవాలు ప్రారంభం



వన్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఈనెల 30నుంచి ఉగాది ఉత్సవాలను నిర్వహించనున్నారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఈనెల 30న కనకదుర్గమ్మకు సుప్రభాతం అనంతరం స్నపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలంకారం తదితర పూజాదికాలు ముగిసిన తరువాత ఉదయం అంతరాలయంలో నిర్వహించే సుప్రభాత సేవ, వస్త్రాలంకరణ, ఖడ్గమాల, యాగశాలలో నిర్వహించే రుద్రహోమాలను రద్దు చేశారు. అయితే లక్ష కుంకుమార్చన, శాంతికల్యాణం, శ్రీచక్ర నవావరణార్చన, చండీ హోమం, సౌభాగ్యప్రదాయిని, అష్టోత్తర , శతనామార్చన తదితరాలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయి. 30 నుంచి ఏప్రిల్ 7 వరకు వసంత నవరాత్రుల పూజల సందర్భంగా కొండపైన లక్ష్మీగణపతి మందిరం వద్ద కనకదుర్గమ్మవారికి రోజుకో ప్రత్యేక పుష్పాలతో అర్చనలు జరుగుతాయి. ప్రత్యేక పుష్పార్చనల్లో పాల్గొనే దంపతులు రూ. 2,500 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఉగాది నాడు మధ్యాహ్నం 3 గంటలకు పంచాంగ శ్రవణం అనంతరం గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులతో వెండి రథోత్సవం జరుగుతుంది.

ఏపీలో మైక్రోబయాలజీ ల్యాబ్‌ల ఆధునికీకరణ

- కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ వెల్లడి

వన్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ద కంటైన్‌మెంట్ ఆఫ్ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎన్‌పీపి-ఏఎంఆర్) కింద మైక్రోబయాలజీ ల్యాబొరేటరీలు 14 రాష్ట్రాల్లో మొత్తం 50 ప్రయోగశాలలు ఆధునీకరించినట్టు.. వాటిలో ఏపీలోని గుంటూరు మెడికల్ కాలేజీ, విశాఖలో ఆంధ్ర మెడికల్ కాలేజీ, తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలు ఉన్నాయని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ వెల్లడించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీ భరత్ కలిసి యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ అభివృద్ధిపై లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు శుక్రవారం కేంద్రమంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం తెలిపారు. యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ పర్యవేక్షణ కోసం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రయోగశాలలు అభివృద్ధి చేసినట్టు తెలిపారు

నందిగామకు ఆయుష్ పరిశోధనా కేంద్రం!

- ఫలించిన ఎంపీ కృషి

నందిగామ : నందిగామలో ఆయుష్ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఎంపీ శివనాథ్(చిన్ని) కృషి ఫలించింది. ఆయుష్ ఆధ్వర్యంలో దేశంలో పెద్దఎత్తున వైద్యశాలలు, పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ ప్రశ్నకు అయుష్ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ బదులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే నందిగామలో 25 నుంచి 50 పడకల సమగ్ర ఆయుష్ పరిశోధనా వైద్యశాల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు.

ఓంబిర్లాను కలిసిన ఎంపీ శివనాథ్

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను శుక్రవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి వెంకన్న ప్రసాదం అందజేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన కమిటీ ఆన్ అబ్సెన్స్ ఆఫ్ మెంబర్ ఫ్రమ్ ది సిట్టింగ్ ఆఫ్ ది హౌస్‌లో సభ్యుడిగా తనను నియమించినందుకు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.


ఓంబిర్లాకు తిరుపతి ప్రసాదం అందజేస్తున్న ఎంపీ శివనాథ్

బెజవాడ బార్

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాషా, రంగారావు


ఎ.కె. బాషా


కె.వి.రంగారావు


అనురాధ

విజయవాడ లీగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అధ్యక్షుడిగా ఎ.కె.బాషా, ప్రధాన కార్యదర్శిగా కేవీ రంగారావు గెలుపొందారు. లైబ్రేరియన్ సెక్రటరీగా త్రినాథ్, జాయింట్ సెక్రటరీగా జీవీ లక్ష్మీ, స్పోర్ట్స్ సెక్రటరీగా పల్లగాని రవి బాబు, ట్రెజరర్‌గా ముద్దాడ సత్యనారాయణ గెలుపొందారు. బార్ అసోసియేషన్ మహిళా కార్యదర్శిగా అనూరాధ గెలుపొందారు. బెజవాడ బార్ 2025-26 ఎన్నికల పోలింగ్ శుక్రవారం కోలాహలంగా సాగింది. మొత్తం 1876 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మహిళా న్యాయవాదుల ఓట్లు 420కాగా, 1456 ఓట్లు పురుషులవి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4.30 గంటలకు ముగిసింది. బెజవాడ బార్ ఉపాధ్యక్షులుగా పిళ్లా శ్రీనివాసరావు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విజయవాడ మెట్రోకు జనరల్ కన్సల్‌టెంట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టును అమలు చేయటంతో పాటు, పర్యవేక్షణకు జనరల్ కన్సల్‌టెంట్‌ను నియమించేందుకు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీఎల్) బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. గతంలో ఢిల్లీ మెట్రో కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) తరహాలో విజయవాడ ప్రాజెక్టును ముందుకు తీసుకు వెళ్లేందుకు గుజరాత్ మెట్రో రైల్ కార్పొరేషన్, చెన్నై మెట్రో రైల్ కార్పొరేషన్లకు చెందిన అనుభవజ్ఞులైన రిటైర్డ్ అధికారులను నియమించాలని నిర్ణయించారు.

రియాక్షన్

(3వ పేజీ తరువాయి)

చర్యలు తీవ్ర వివాదాస్పదం కావటం, ప్రతిసారీ పార్టీకి తలనొప్పులు తీసుకురావటం ఇబ్బందికర పరిణామాలుగా మారాయి. పలు వివాదాస్పద ఘటనలకు సంబంధించి పార్టీ నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయన్ను సముదాయించినా, సుతిమెత్తగా చెప్పినా మార్పు రావటం లేదని జిల్లా పార్టీ అభిప్రాయపడుతోంది. ఇప్పటికే అధిష్ఠానం ఒకసారి ఆయన్ను పిలిచి మాట్లాడింది. ఆ తర్వాత కూడా పార్టీకి తీవ్ర తలనొప్పులు రావటంతో రెండు సార్లు టీడీపీ క్రమశిక్షణా సంఘం ముందు ఆయన హాజరు కావాల్సి వచ్చింది. తాజాగా అధిష్ఠానానికే అల్టిమేటం జారీ చేయటంతో ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు.

వైసీపీ బుకీ..ఆటకట్టు

(3వ పేజీ తరువాయి)

కేంద్రంగా నడుస్తున్న బెట్టింగ్ నెట్‌వర్క్‌ను ఛేదించడానికి ప్రత్యేక బృందాన్ని నియమించారు. బుకీలపై నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో వేటాడదామని వేచి ఉన్న ఈ బృందానికి వైసీపీకి చెందిన అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి కుమారుడు పవన్‌కుమార్ దొరికినట్టు తెలిసింది. అతడు విస్తరించిన నెట్‌వర్క్ ద్వారా కృష్ణాజిల్లాకు చెందిన మరో బుకీని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈ బుకీ జనసేనకు మద్దతుదారుడిగా ఉన్నట్టు తెలిసింది.

పటమటలో పందేలు

సన్‌రైజర్స్ హైదరాబాద్, లఖ్‌నవు సూపర్ జైంట్స్ జట్ల మధ్య గురువారం మ్యాచ్ జరిగింది. దీనిపై పటమటలోని దర్శిపేటకు సమీపాన రాఘవనగర్‌లో ఉంటున్న తుంగల పవన్‌కుమార్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. వారు వెంటనే ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. పవన్‌కుమార్ ఉంటున్న స్థావరాన్ని చుట్టుముట్టి లోపలకు వెళ్లే సరికి పందేలు జరుగుతున్నాయి. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. పవన్‌కుమార్ బ్యాంక్ ఖాతాను పరిశీలించగా, లక్షలాది రూపాయల నిల్వ ఉన్నట్టు గుర్తించారని తెలిసింది. అతడిని విచారణ చేయగా, ఉమ్మడి కృష్ణాజిల్లా మొత్తం నెట్‌వర్క్‌ను విస్తరించినట్టు వెల్లడించాడని సమాచారం. పవన్‌కుమార్‌తో నిత్యం ఫోన్లలో ఎవరెవరు సంభాషణలు జరిపారన్న వివరాలను ఈ ప్రత్యేక బృందం ఆరా తీసినట్టు తెలిసింది. అతడి ఫోన్ సంభాషణలన్నీ ఎక్కువగా వాట్సాప్ కాల్స్ ద్వారా సాగినట్టు సమాచారం. పవన్‌కుమార్‌తో నిత్యం సంప్రదింపులు జరుపుతున్న అవనిగడ్డకు చెందిన జనసేన మద్దతుదారుడు చెన్నా గోపయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. పవన్‌కుమార్ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో భారీగా బెట్టింగ్‌లు నిర్వహించినట్టు ఆరోపణలు ఉన్నాయి. పవన్‌కుమార్ ప్రధాన బుకీగా ఉంటూ ఉమ్మడి జిల్లాలో సబ్‌బుకీలను నియమించుకున్నాడు. మిగిలిన బుకీల ఆట కట్టించే పనిలో ప్రత్యేక బృందం ఉంది.

కోల్డ్ స్టోరేజీ ఖాతాలు ఫ్రీజ్

(3వ పేజీ తరువాయి)

చేసింది. స్టోరేజీకి ఉన్న భూమి మూడెకరాలను ష్యూరిటీగా ఉంచింది. స్టోరేజీ నిర్వహణ, బ్యాంకు రుణాల చెల్లింపు బాగుందని భావించిన బ్యాంకు అధికారులు ఈ ఏడాది రుణపరిమితిని రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచాలన్న ప్రతిపాదనను అంగీకరించింది. ఏడాదిగా కోల్డ్ స్టోరేజీలో పంట దాచుకున్న వ్యక్తుల పేరున రుణాలు తీసుకుంటూ సాయి తిరుమలగిరి భాగస్వామ్యులు గ్యారెంటీదారులుగా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు కోల్డ్ స్టోరేజీ భవనం, స్థలం, నిల్వ ఉంచిన పంటకు రూ.5 కోట్లకు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ కూడా చేయించినట్టు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 17న బ్యాంకు.. సాయి తిరుమలగిరి భాగస్వామ్యులకు రుణపరిమితిని రూ.10 కోట్లకు పెంచింది. యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించాక రుణాన్ని విడుదల చేయాల్సి ఉంటుంది. ఈనెల ప్రారంభం నుంచి మిర్చికి ధర పతనం కావటంతో తిరిగి ధర పెరుగుతుందని కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచుకోవాలని రైతులు అనుకున్నారు. దీంతో ఫిబ్రవరి వరకు 14 వేల టిక్కీలు నిల్వ ఉండగా, మార్చి నాటికి 25 వేల టిక్కీలు స్టోరేజీకి చేరాయి. ఈ నేపథ్యంలో బ్యాంకు అధికారులు పెంచిన రుణపరిమితి నుంచి రూ.కోటిపైగా రుణాన్ని మంజూరు చేశారు. ఇదే బ్యాంకుతో పాటు రైతుల కొంపముంచింది. రుణపరిమితిని రూ.10 కోట్లకు పెంచటంతో బ్యాంకు నిబంధనల ప్రకారం రెండున్నర రేట్లకు ఇన్సూరెన్స్ చేయించాల్సి రావటం, ఇన్సూరెన్స్ కంపెనీలతో ప్రీమియంపై బేరసారాలతో కాలహరణం జరగటం, మంగళ వారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రమాదం జరగ్గానే బ్యాంకు ఉన్నతాధికారులు నష్ట నివారణ చర్యలు చేపట్టారు. కంపెనీ పేరుతో ఉన్న రెండు ఖాతాలతో పాటు కంపెనీ గ్యారెంటీగా ఉండి 19 మంది రైతుల పేరున తీసుకున్న రుణాల ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ఆ ఖాతాల్లో సుమారు రూ.9 లక్షల్లోపు నగదు నిల్వ ఉన్నట్టు తెలుస్తోంది. రుణపరిమితిని రూ.10 కోట్లు చేశాక కోల్డ్ స్టోరేజీ భవనం, స్థలం, అందులో ఉంచిన సరుకుతో పాటు భాగస్వాముల్లో ఒకరి పేరున ఉన్న ఆస్తులను హామీగా ఉంచుకున్నట్టు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. స్టోరేజీ భవనం కుప్పకూలిపోగా, మూడెకరాల భూమి, భాగస్వాములు పెట్టిన ఆస్తుల ద్వారా బ్యాంకు ఇచ్చిన రూ.6.63 కోట్ల రుణాన్ని రికవరీ చేసుకోవాలని చూస్తోంది. అవి కూడా సరిపోని పక్షంలో రుణాలు తీసుకున్న 19 మంది రైతుల నుంచి రాబట్టుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. బ్యాంకు రుణాలను వసూలుకు ప్రయత్నిస్తుండగా,పంటను కోల్పోయిన రైతుల పరిస్థితి ఘోరంగా మారింది.

ముందుకు సాగని పోలీసుల విచారణ

జగ్గయ్యపేట తహసీల్దార్ మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జగ్గయ్యపేట పోలీసులు ఇంకా విచారణ ప్రారంభించలేదు. కోల్డ్ స్టోరేజీలో ప్రధాన భాగస్వామిగా ఉన్న రావూరి శ్రీనివాసరావుపైనే కేసు నమోదు చేశారు. ఈ కేసులో మిగిలిన భాగస్వాములను చేర్చటం కానీ, ప్రమాదం యాదృచ్ఛికమా?, ఉద్దేశపూర్వకంగా జరిగిందా? అనే విషయాలను నిగ్గు తేల్చాల్సిన పోలీసులు ఇంతవరకు ఆ దిశగా అడుగులు వేయలేదు. 19 మంది రైతుల పేరున తీసుకున్న రుణాలు, వాటి చెల్లింపులపై రెవెన్యూ అధికారులు బ్యాంకు అధికారులను సమాచారం కోరినా ఇవ్వలేదని తెలుస్తోంది. కాగా, ఇన్సూరెన్స్ లేకుండా రుణాన్ని మంజూరు చేసినందుకు బ్యాంకు మేనేజర్‌కు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

కమిషనర్ బంగ్లా.. దండోరా

(3వ పేజీ తరువాయి)

నిర్మించుకునేందుకు ఉపయోగించుకోవాలని భావించింది. సీతన్నపేట మీసాల రాజారావు బ్రిడ్జి దగ్గర నుంచి ఏలూరు రోడ్డుకు సమాంతరంగా పడవలరేవు వరకు 6.50 కిలోమీటర్ల మేర ఆరు వరసల బీఆర్‌టీఎస్ రోడ్డును అభివృద్ధి పరచాలని నిర్ణయించింది. మధ్యలో రెండు వరసల డెడికేటెడ్ కారిడార్, రెండువైపులా రెండేసి లైన్లలో సాధారణ రోడ్డుతో ఈ కారిడార్‌కు రూపకల్పన చేసింది. ఈ రోడ్డు పనులను కాంటెక్స్ సిండికేట్ అనే నిర్మాణ సంస్థ దక్కించుకుంది. శరవేగంగా రోడ్డు పనులను చేపట్టింది.

రేపు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో ఉగాది సంబరాలు

- పాల్గొననున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య, సీఎం చంద్రబాబు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఉన్నతాధికారులు

ఉంగుటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడచాప్టర్)కు ఈనెల 30న ముఖ్యమంత్రి చంద్రబాబు విచ్చేయుచున్న సందర్భంగా భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి ట్రస్ట్‌లో జరిగే ఉగాది సంబరాల్లో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుతో కలిసి సీఎం చంద్రబాబు పాల్గొంటున్న దృష్ట్యా ముందస్తు భద్రతా(ఏఎస్ఎల్)ఏర్పాట్లను జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ ఆర్.గంగాధరరావుతో కలిసి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. తొలుత అధికారులతో ప్రాంగణమంతా కలియదిరిగిన కలెక్టర్ ట్రస్ట్‌లో పలు వృత్తి నైపుణ్య శిక్షణాకేంద్రాలు, ల్యాబ్‌లను సందర్శించారు. వివిధ శిక్షణా కార్యక్రమాల గురించి ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పరదేశి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ప్రజామందిరంలో సీఎం సభావేదిక, సీటింగ్, మైక్‌సిస్టమ్ తదితర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ట్రస్ట్ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉగాది సంబరాల్లో పాల్గొన్న అనంతరం సువెన్ ఫార్మా సహకారంతో ట్రస్ట్ ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన ఫార్మాల్యాబ్, ఫార్మా తయారీ నైపుణ్య శిక్షణాకేంద్రాన్ని సీఎం ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమానికి ఎలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి వచ్చేప్రముఖులు, అధికారులకు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్, జేసీ, ఎస్పీలతో పాటు అదనపు ఎస్పీ సత్యనారాయణ, ఎస్‌హెచ్‌జీ అదనపు ఎస్పీ శ్రీనివాసు, డీఎస్పీ చంద్రశేఖర్, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాస్, జిల్లా ఫైర్‌ఆఫీసర్ ఏసురత్నం, ఏపీఎంఐపి పీడీ జి.విజయలక్ష్మి, ఎస్పీ సీఏ వి.శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ, ఎస్పీ

తండ్రి మందలించాడని వెళ్లిపోయిన బాలిక

- సీసీ ఫుటేజీ ఆధారంగా రైల్వే స్టేషన్‌లో ఉన్నట్టు గుర్తింపు
- గంటల వ్యవధిలో ఇంటికి చేర్చిన పోలీసులు

గుణదల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తండ్రి మందలించాడని ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికను గంటల వ్యవధిలోనే మాచవరం పోలీసులు ఛేదించారు. గుణదల దేవినగర్ కొండపైన నివాసం ఉంటున్న 11 సంవత్సరాల బాలిక. ఐదో తరగతి చదువుతోంది. గురువారం ఉదయం తండ్రి ఉద్యోగానికి వెళుతు షర్ట్ జేబులో 2వేలు కనబడటంలేదని కుమార్తెపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. నాన్న చంపేస్తాడన్న భయంతో బ్యాగులో రెండు జతల బట్టలు పెట్టుకుని ఇంటినుంచి వెళ్లిపోయింది. మధ్యాహ్నం పిల్ల కనబడకపోయే సరికి చుట్టుపక్కల ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మాచవరం పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. ఈస్ట్ జోన్ ఏసీపీ షాలిని బృందాలతో గాలింపు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజి ఆధారంగా రైల్వేస్టేషన్‌లో తిరుగుతు పోలీసుల కంటపడింది. దాంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు బాలికను చేరదీసి తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతో కథ సుఖాంతమయింది. 11 గంటల వ్యవధిలో బాలిక ఆచూకీని కనిపెట్టి తల్లిదండ్రుల చెంతకు బాలికను చేర్చిన టీమ్‌లో పని చేసిన సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు అభినందించారు.



కనకదుర్గమ్మకు నృత్యార్చన



ఇంద్రకీలాద్రి: కనకదుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం భరత నాట్య ప్రదర్శన జరిగింది. మహామండపం ప్రాంగణంలోని కళావేదికపై తిరుపతికి చెందిన శ్రీసాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ బృందం అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. నృత్యాచార్య శరత్‌చంద్ర ఆధ్వర్యంలో భరత నాట్యప్రదర్శన భక్తులను అలరించింది. అనంతరం దేవస్థానం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.

ఉగాది పురస్కారాల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న నిర్వహించే ఉగాది పురస్కారాల-2025 ప్రధానోత్సవ సభలో పురస్కారాలు అందంచేందుకు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాష్టారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారాల ఎంపిక కోసం వారి సేవలను, ప్రతిభను గురించి తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్స్, ఫొటోలు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుకు జతచేసి పంపాలని కోరారు. దరఖాస్తులు ఏప్రిల్ 5లోగా అకాడమీ కార్యాలయానికి పంపాలని కోరారు. వివరాలకు 96523 47207 సంప్రదించాలన్నారు.

బాలోత్సవ్ భవన్‌లో ఉగాది సమ్మేళనం రేపు

గవర్నర్‌పేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించే ఉగాది-సమభావన సాంస్కృతిక ఉత్సవాలు పోస్టర్‌ను శుక్రవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గుండు నారాయణ, పి.ఐజాక్ న్యూటన్ మాట్లాడుతూ 30న ఉగాది సమ్మేళనం బాలోత్సవ్ భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. జాషువా పురస్కార గ్రహీత డాక్టర్ కోయి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కవి సమ్మేళనం, కవితా పఠనం కార్యక్రమాలు, పాటల పోటీ నిర్వహిస్తామన్నారు.



కలెక్టరేట్‌ను ముట్టడించిన సీపీఎం నాయకులు, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం సీపీఎం ఆధ్వర్యంలో
కలెక్టరేట్ ముట్టడి

టిడ్కో, జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహాల స్వాధీనానికి ఏప్రిల్ 15 డెడ్‌లైన్

కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వండి, లేదంటే పేదలే వాటిని స్వాధీనం చేసుకోవాల్సి వస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్‌లు హెచ్చరించారు. ఈ విషయమై ఈనెల 30న ఉగాది నాడు పీ4పై చంద్రబాబు మాట్లాడే సమయంలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపుపై స్పష్టమైన ప్రకటన చేయాలని వారు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయాన్ని సీపీఎం నాయకులు, ఇంటి జాగా కోసం తరలివచ్చిన ప్రజలతో ముట్టడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహాధర్నాలో వారు మాట్లాడుతూ ఇళ్లులేని పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, పట్టాలు, రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని, రూ.5 లక్షల చొప్పున గృహ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని అన్నారు. టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్లను అప్పగించాలని, ఖాళీగా వున్న జేఎన్ఎన్‌యుఆర్ఎం గృహాలను పేదలకు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

పేదలందరికీ ఇళ్లు, ఇళ్లస్థలాలు మంజూరు చేస్తూ కూటమి ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే నెల 15 వరకు గడువు ఇస్తున్నామని, అప్పటికీ స్పందించకుంటే 15 తర్వాత పేదలే ఖాళీగా వున్న ప్రభుత్వ స్థలాలను, సుమారు 10 వేల టిడ్కో జెఎన్ఎన్‌యుఆర్ఎం గృహాలను స్వాధీనం చేసుకుంటారని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నగరంలోని పేదల ఇళ్ల సమస్యను పరిష్కరిస్తామని, జక్కంపూడి టిడ్కో ఇళ్ల అంశంపై ఇప్పటికే సంబంధిత అధికారులతో చర్చించామని తెలిపారు. పేదల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మూడు సిటీ కమిటీల నాయకులు పెద్దయెత్తున పాల్గొన్నారు

ఉగాది చిత్రోత్సవం ప్రారంభం రేపు

విజయవాడ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంవత్సరాది సందర్భంగా వివిధ నగరాలకు చెందిన 26 మంది చిత్రకారులు ఉగాదిని ప్రతిబింబించే చిత్రకళా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మల్లిక్ డి.దుర్గాప్రసాద్, సృజన్ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఉగాది చిత్రోత్సవం' పేరుతో ఈ నెల 30న సాయంత్రం ముత్యాలంపాడులోని ఎంఎస్ మూర్తి లలిత కళా ఆర్ట్స్ గ్యాలరీలో ప్రారంభం కానున్న ఈ ప్రదర్శన, ఎంఎస్ మూర్తి శతజయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంగా జరుగుతుంది. ఈ ప్రదర్శనను సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉపకులపతి ఏవీ రత్నప్రసాద్ ప్రారంభించనున్నారు. ప్రముఖ చిత్రకళాకారులు నవిరి నాగేశ్వరరావు, కళాపోషకులు అయోధ్య నాగేశ్వరరావు, బి.నాగేష్‌కుమార్లను సత్కరించనున్నారు. ది ఆంధ్రా అకాడమీ ఆఫ్ ఆర్ట్స్, ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం

పటమట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకమని టీడీపీ సీనియర్‌నేత బెజవాడ నజీర్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదంతో చంద్రబాబుపై ఎస్సీల్లో ఆదరణ పెరిగిందన్నారు. తన హయాంలో జగన్ 220 మంది దళితులను హత్య చేయించాడని, సాగులో ఉన్న 11 వేల ఎకరాల దళితుల భూములు లాక్కున్నాడని దుయ్యబట్టారు.

హామీల అమలుకు కూటమి చర్యలు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం 13వ డివిజన్ జేడీనగర్ వాటర్ ట్యాంక్ ఏరియాలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లో ముగ్గురికి రెండు తోపుడు బండ్లు, ఒక కుట్టుమిషన్‌ను అందించారు. ఏప్రిల్‌లో దివ్యాంగులకు సదరన్ సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. మేలో తల్లికి వందనంతో పాటు వ్యవసాయదారులకు రైతు పెట్టుబడి సాయం అందించేందుకు చర్యలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఏపీఐఐసీ కాలనీ వాసులకు తాగునీరు అందించేందుకు ఒక ప్రాజెక్టు రూపొందించి కౌన్సిల్‌లో పెట్టామన్నారు. ఈ అంశంపై సీఎస్‌తో, ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, గద్దె ప్రసాద్, కొర్రపాటి శ్రీను, నూతి శ్రీను, ముమ్మనేని మానస, దూళిపాళ్ల హరిత, నిడమానురు లోకేష్ పాల్గొన్నారు.



ధన్వంతరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయ్ ఓజా

మరింత పురోగతి సాధించాలి

● నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ ఓజా

ప్రభుత్వాసుపత్రి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రభుత్వ సిద్దార్థ మెడికల్ కళాశాల పరిశోధనలలో ముందుకు వెళ్లడం అభినందనీయమని భవిష్యత్‌లో మరింత పురోగతి సాధించాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ ఓజా అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ధన్వంతరి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ నరసింహం, అడిషనల్ డీఎంఈ డాక్టర్ రఘునందన్, ఎన్టీఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధిక రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ సి.హెచ్ శ్రీనివాసరావు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.వి రావు, అడ్మిన్ సత్యనారాయణ, ఏడీ శ్రీకాంత్, విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీఐ ప్రకాష్‌కు సీసీ టీవీ కెమెరాల పరికరాలను అందజేస్తున్న ఎన్టీఆర్ వెటర్నరీ కాలనీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు

సీసీ టీవీ కెమెరా, పరికరాలు అందజేత

భారతీనగర్, మార్చి28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీల్లో ఏర్పాటు చేసేందుకు 56 సీసీ టీవీ కెమెరాలను, వాటి పరికరాలను శుక్రవారం మాచవరం పోలీస్ స్టేషన్ అధికారి సీఐ ప్రకాష్‌కు ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, ఎన్టీఆర్, వెటర్నరీ కాలనీల పెద్దలు మలినేని రంగప్రసాద్, దాసరి హరికృష్ణ, స్వర్ణ ఆంజనేయులు, యుగంధర్, విజయకుమార్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన

నేడు ధర్నాచౌక్ వద్ద శాంతియుత ప్రదర్శన



లబ్బీపేటలోని మసీదు వద్ద నల్లబ్యాడ్జీలతో జమాతే ఇస్లాం హింద్ నిరసన

లబ్బీపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని జమాతే ఇస్లాం హింద్ రాష్ట్ర అధ్యక్షుడు రఫిక్ డిమాండ్ చేశారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనలతో శుక్రవారం లబ్బీపేటలోని మసీదు వద్ద ప్రార్థనల అనంతరం వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లుకు వ్యతిరేకంగా శనివారం ధర్నా చౌక్ వద్ద శాంతియుత ప్రదర్శన నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ఉలేమాలు, మత పెద్దలు, ముస్లిం సమాజానికి చెందిన వారు పాల్గొంటారని, వామపక్ష నేతలు, సెక్యులర్ సిద్ధాంతాల మేధావులు పాల్గొంటారని తెలిపారు. సెక్యులర్ భావాలు కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు మద్దతు ఇస్తారని, పార్లమెంటు ఉభయసభల్లో కూడా టీడీపీ వ్యతిరేకంగా ఓటు వేస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

అధికారుల మన్ననలు పొందిన నాయకుడు రాజుబాబు

డీటీసీ మోహన్



రాజుబాబును అభినందిస్తున్న డీటీసీ మోహన్

కలెక్టరేట్,మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ ఉద్యోగుల సంఘానికి జోనల్ అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికవడం రాజుబాబుపై ఉద్యోగులకు వున్న నమ్మకమే కారణమని డీటీసీ ఎ.మోహన్ పేర్కొన్నారు. బందరురోడ్డులోని డీటీసీ కార్యాలయంలో డీటీసీ మోహన్‌ను రాజుబాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు, ఉద్యోగులకు వారధిలా రాజుబాబు పనిచేసేవారని తెలిపారు. అధికారుల మన్ననలు పొందిన నాయకుడు ఎం.రాజుబాబు అని తెలిపారు. అనంతరం రాజుబాబుకు, కార్యవర్గ సభ్యులకు మోహన్ అభినందనలు తెలిపారు. జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు మాట్లాడుతూ జోన్-2లోని ఏడు జిల్లాల్లోని ఉద్యోగులు నామీద నమ్మకంతో మూడోసారి జోనల్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని, వారి నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా తనపై వుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో వెంకటేశ్వరరావు, రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోన్-2కు నూతనంగా ఎన్నికైన జోనల్ కోశాధికారి కె.రామచంద్రరాజు, సంఘం పూర్వపు జోనల్ సహాధ్యక్షురాలు జి.ఉషాసుందరి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు సత్యనారాయణ, చంద్రకళ, ఉద్యోగులు పాల్గొన్నారు.



తొలి విజయాన్ని నమోదు చేసిన ఆంధ్ర జట్టు

జాతీయ సబ్ జూనియర్ కబడ్డీలో ఆంధ్రకు తొలి విజయం

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సాలోని బుద్ధగయలో జరుగుతున్న జాతీయ సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. శుక్రవారం పూల్-సి నుంచి పోటీలో దిగిన రాష్ట్ర జట్టు అదే పూల్‌లోని బీహార్ జట్టును 51-29 తేడాతో ఓడించి శుభారంభం చేసింది. లీగ్ కం నాక్ అవుట్ పద్ధతిలో ఈ పోటీలు జరుగుతున్నాయి. రాష్ట్ర జట్టును ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, శ్రీకాంత్‌లు అభినందించారు.

విద్యార్థినులకు ల్యాప్‌ట్యాప్‌లు అందజేత



విద్యార్థినులకు ల్యాప్‌ట్యాప్‌లు అందజేసిన వాల్యూలైన్ ఇంజన్ ఆయిల్స్ ప్రతినిధులు, వెంకటేశ్వరరావు తదితరులు

ఆటోనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రంగానికి సంబంధించి ప్రతిభ గల విద్యార్థులకు వాల్యూలైన్ ఇంజన్ ఆయిల్స్ కంపెనీ ప్రతీ సంవత్సరం ముస్కాన స్కాలర్‌షిప్స్ అందిస్తుందని కంపెనీ ప్రతినిధి బాబూ నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలి పారు. ఆటోమొబైల్ రంగంలో ప్రతిభ కనబర్చిన పి.లక్ష్మీ స్రవంతికి, ప్రణీతశ్రీలకు ల్యాప్‌టాప్‌ను ఆటోనగర్ మెకానిక్స్ యూనియన్ అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు అందజేశారు. వాల్యూలైన్ ప్రతినిధి మాధవ్, మేకా రామలక్ష్మణ కుమార్ పాల్గొన్నారు.

మహాజ్ఞాన దీక్ష

ధర్నాచౌక్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బౌద్ధులకు వ్యతిరేకంగా బీహార్ ప్రభుత్వం తీసుకువచ్చిన బీటీ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుద్ధగయ మహాబోధి, మహా విహార్ విముక్తి సాధనకై స్థానిక ధర్నాచౌక్‌లో సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాజ్ఞాన దీక్ష జరిగింది. ఫాదర్ మువ్వల ప్రసాద్, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చర్చస్ కరుణానిధి, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంజాన్ సందడి

దేదీప్యమానంగా వెలిగిపోతున్న పంజా సెంటర్

- ఉపవాస దీక్షలు ముగించుకుని సకుటుంబ సమేతంగా సెంటర్‌కు..
- కాంతులీనుతున్న దుకాణాలు, మాంసాహార, హలీం స్టాళ్లతో కళకళ
- సేమ్యా, ఖర్జూర పండ్ల కొనుగోళ్లతో కిక్కిరిసిపోతున్న సెంటర్
- జోరుగా వస్త్ర దుకాణాల్లో షాపింగ్













ఆంధ్రజ్యోతి, వన్‌టౌన్

పంజా సెంటర్‌లో రంజాన్ సంబరం అంబరాన్నంటుతోంది! విజయవాడ పాతబస్తీ పంజా సెంటర్ వీధులు తిరునాళ్లను తలపిస్తున్నాయి. ఉపవాస దీక్షలు ముగించుకున్న ముస్లిం సోదరులు సకుటుంబ సమేతంగా పంజా సెంటర్‌కు చేరుకుంటున్నారు. విందు, వినోదం, షాపింగ్‌తో హోరెత్తిస్తున్నారు. ఎటువైపు చూసినా వెరైటీలతో కూడిన మాంసాహార వంటకాల స్టాల్స్, చికెన్, మటన్ ఘుమఘుమలు పంజా వీధులను తాకుతున్నాయి. హలీం స్టాల్స్ గురించి అయితే చెప్పనక్కరలేదు. వస్త్ర దుకాణాల స్టాల్స్ వద్ద షాపింగ్ సందడి నెలకొంది. సేమ్యా, ఖర్జూరం, పండ్ల కొనుగోళ్లు భారీగా జరుగుతున్నాయి. విద్యుత్ దీపాలు, షామియానాలు, ఇతరత్రా అలంకారాలు, హలీం ఘుమఘుమలతో సాయంత్ర వేళ పంజా సెంటర్ తిరునాళ్లను తలపిస్తోంది. విద్యుద్దీపకాంతులు జిగేల్‌మంటూ ఓ కొత్త వాతావరణాన్ని రూపొందించాయి. మరికొద్ది రోజుల్లో ఉపవాస దీక్షలు ముగియనున్నాయి. ముస్లిం సోదరులు ఉదయాన్నే సూర్యోదయానికి ముందే అల్పాహారం తీసుకుని ఉపవాస దీక్ష ప్రారంభిస్తారు. తిరిగి సూర్యాస్తమయం తరువాత ఇఫ్తార్ విందు చేసుకుంటారు. ఈ క్రమంలోనే పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఇతరత్రా ప్రత్యేకంగా తయారు చేసిన జ్యూస్‌ల వంటివి సేవిస్తారు. అన్నింటికంటే ముఖ్యంగా హలీంకు వీరు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. హలీంకు ఉన్న డిమాండ్ దృష్ట్యా హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి చేయి తిరిగిన వంట వారిని పిలిపించి ఘుమఘుమలాడే హలీంను సిద్ధంచేసి ముస్లిం సోదరులకు విక్రయించటం పంజా సెంటర్‌లో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ఏ ఏటికాయేడు సరికొత్త హంగులతో స్టాళ్ల ఏర్పాటుతో కేవలం ముస్లిం సోదరులకే కాకుండా ఇతర జనాలను కూడా ఆకర్షిస్తున్నాయి. మతాలకు అతీతంగా అన్ని వర్గాలు కుటుంబాలు హలీమ్ స్టాళ్లను సందర్శిస్తున్నారు. హలీంకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ వంటకంలో ఆరోగ్య సంబంధిత మషాలాలను జోడిస్తారు. ఈ రుచికరమైన హలీంను ఎంతగానో ఇష్టపడతారు. సామాజిక పరివర్తనకు సంకేతంగా ఈ కలయికలను చూడవచ్చు. ఆరోగ్యపరంగానూ హలీం బెస్ట్. దీంతో ముస్లిం సోదరులతో పాటు ఇతరులు కూడా దీన్ని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వన్‌టౌన్‌లో ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతం కాబట్టి హలీం స్టాళ్లను ఈ సెంటర్‌లో ఎక్కువగా ఏర్పాటు చేస్తారు. చికెన్, మటన్, వెజ్‌లలో హలీం రకరకాలుగా లభిస్తుండటంతో అందరూ ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా రుచికరమైన హైదరాబాదీ హలీం అంటే ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తుంది. హలీం తయారీ కొంచెం కష్టమైన పనే. ఎక్కువగా చికెన్ హలీంని ఇష్టపడుతుంటారని స్టాల్స్ యజమానులు చెబుతున్నారు. చరిత్ర చూస్తే 1590లో అక్బర్ ఆస్థానంలోని అబుల్ ఫజల్ చక్రవర్తి హలీం మూలాలను రూపొందించినట్టుగా సమాచారం. ఈ వంటకాలను అప్పట్లో మూడు రకాలుగా వర్గీకరించారు. మాంసం లేని వంటకాలు, బియ్యం లేదా గోధుమ ఆధారిత వంటకాలు, మాంసం, రోటీతో వండీ హలీం ఇలా వర్గీకరణ చేసినట్టు చరిత్ర చెబుతుంది. ఉడికించిన మటన్, గోధుమలు, సుగంధ ద్రవ్యాలు వంటి వాటితో నెయ్యిని దట్టించి రుచికరంగా తయారు చేస్తారు. అందుకే హలీంను కేవలం ముస్లింలే కాకుండా ఇతరులు కూడా ఇష్టంతో తీసుకుంటారు.

మరోవైపు గతంకంటే 15 నుంచి 25శాతం రేట్లు పెరిగాయి. సుగంధ ద్రవ్యాలు, నెయ్యి, డ్రైఫ్రూట్స్, మటన్, వంటి వాటితో పాటు వంటవారికిచ్చే వేతనాలు పెరగటంతో ఆ మేరకు రేట్లు పెరిగాయని చెబుతున్నారు. ఒక బౌల్ మటన్‌తో తయారు చేసిన హలీం సుమారుగా రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. వంటలో వాడే పదార్థాలను బట్టి రేట్లను నిర్ణయిస్తున్నారు. ఫ్యామిలీ ప్యాక్‌లు అందుబాటులో ఉన్నాయి. సాయంత్రం అయితే చాలు పంజా సెంటర్‌లో హలీం స్టాల్స్ జనాల రద్దీతో కిటకిటలాడుతూ పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి.



విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న పంజాసెంటర్



నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు

ఇంద్రకీలాద్రి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో పలువురు ప్రైవేటు కాంట్రాక్టర్లు దేవదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా టెండర్లను దక్కించుకుంటున్నారని వి మర్శలు వినిపిస్తున్నాయి. కమిషనర్ కార్యాలయంలోని పలువురు సూపరింటెండెంట్ స్థాయి అధికారుల అండదండలున్నాయని తెలుస్తోంది. దేవస్థానంలో అన్నదాన విభాగంలో క్లీనింగ్, సర్వీసింగ్ పనిచేయటానికి సిబ్బందిని సప్ల య్ చేసేందుకు గతేడాది దేవస్థానంలో వేలంపాట జరిగింది. సుమారు 4 సంస్థలు పాల్గొన్నాయి. వాటిలో వీఎల్‌డీ ఏజెన్సీ కాంట్రాక్ట్ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. అయితే ఈ సంస్థకు లైసెన్స్ ముగిసిందని, దేవస్థానం పార్కింగ్ టెండర్‌ను పాడుకుని డబ్బులు ఎగ్గొట్టిందని, అంతేకాక కోర్టులోనూ కేసుందని వాంబే కాలనీకి చెందిన అమ్మవారి భక్తుడు ఎం.సి.రావు గతేడాది నవంబరు 30న నాటి కమిషనర్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ విచారణ చేపట్టాలని, ప్రస్తుత దేవదాయ కమిషనర్, ఏడీసీ, దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్‌ను ఆదేశించటంతో ఆయన దుర్గగుడి డిప్యూటీ ఈవో రత్నరాజును విచారణ చేపట్టాలని సూచించారు. విచారణ అధికారి రత్నరాజు ఫిర్యాదుదారుడు ఎం.సి.రావుకు తన వద్ద ఉన్న ఆధారాలతో విచారణకు హాజరు కావాల్సిందిగా గతేడాది డిసెంబరు 11న నోటీసు జారీ చేశారు. దీంతో ఎం.సి.రావు విచారణకు హాజరై విచారణాధికారికి తన వద్ద ఉన్న ఆధారాలు అందజేశారు. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉంది. కాగా, వీఎల్‌డీ ఏజెన్సీ సంస్థ నిర్వాహకులు దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలోని సూపరింటెండెంట్ స్థాయి అధికారితో మాట్లాడుకుని టెండర్ దక్కేలా ప్రయత్నిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఫిర్యాదుదారుడు ఎం.సి.రావు ఈనెల 24న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ, దేవదాయ శాఖ కమిషనర్‌కు ఆ సంస్థపై ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వీఎల్‌డీ ఏజెన్సీ సంస్థకు టెండర్‌ను ఎలా కేటాయిస్తారని ఫిర్యాదుదారుడు ఎం.సి.రావు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇదే సంస్థ దేవస్థానానికి డబ్బులు ఎగ్గొట్టిన కోర్టులో కేసు వేసిందని ఎం.సి.రావు ఆరోపించారు. కాగా, ఈ వ్యవహారంపై దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో ఓ సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా, వీఎల్‌డీ ఏజెన్సీ సంస్థపై ఫిర్యాదు రావటంతో విచారణ జరిగిందని, ఆ సంస్థపై కోర్టులో కేసు కూడా ఉందని ఆంధ్రజ్యోతికి చెప్పారు.



స్వామి వారి భూమిని స్వాధీనం చేసుకుని అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

రంగనాయక స్వామి ఆలయ భూమి స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగనాయక స్వామి ఆలయానికి చెందిన భూమిని 110 ఏళ్ల తరువాత దేవదాయ శాఖాధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈవో జయప్రకాష్ 2009లో కబ్జాకు గురైందని గుర్తించి బహిరంగ వేలం పాటలు నిర్వహించగా ఆ భూమి తమదని తిరుమలగిరికి చెందిన మహిళ కోర్టును ఆశ్రయించటంతో 2018లో భూమి దేవదాయ శాఖదని నిర్ధారించి ఉత్తర్వులివ్వటంతో అప్పటి నుంచి ఆ భూమి స్వాధీనానికి చర్యలు చేపట్టామన్నారు. స్వామి పేరుతో పాస్‌పుస్తకాలు తీసుకుని స్వాధీనం చేసుకున్నామన్నారు. త్వరలోనే వేలంపాటలు నిర్వహిస్తామన్నారు. ఆలయాల పర్యవేక్షణాధికారి పవన్‌కల్యాణ్, ముక్త్యాల కోటిలింగాల ఈవో హరిదుర్గానాగేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

99 ఏళ్ల తరువాత గుర్తించిన ఈవో

తిరుమలగిరి ఈవోగా పనిచేస్తున్న శారదా కుమారి స్వామి భూములకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తుండగా 2009లో రంగనాయక స్వామి ఆలయానికి చెందిన భూములను గుర్తించి అప్పటి కార్యనిర్వహణాధికారులకు వివరాలు అందించటంతో పటిష్ఠ చర్యలు తీసుకోకుండా హడావిడిగా వేలం పాటకు రంగంలోకి దిగారు. దీంతో సదరు భూమి తమదంటూ లింగమ్మ అనే మహిళ కోర్టును ఆశ్రయించటంతో దశాబ్దాలుగా కోర్టులోనే వివాదాలు నడిచాయి. చివరకు కోట్లు విలువ చేసే భూమి స్వాధీనమైంది. కాగా 2009లో 99 ఏళ్ల తరువాత రంగనాయక స్వామి ఆలయానికి చెందిన భూములను గుర్తించిన అప్పటి ఈవో శారదా కుమారికి అధికారులు, ప్రజాప్రతినిధులు బదిలీ బహుమతి అందించటం విశేషం.

దేవదాయ శాఖ ఎన్టీఆర్ జిల్లా
ఇన్‌చార్జి అధికారిగా నూతక్కి

వన్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా నూతక్కి వెంకట సాంబశివరావును బదిలీచేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన దుర్గగుడి దత్తత సంస్థ సీవీ రెడ్డి ట్రస్ట్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా, కృష్ణాజిల్లా దేవదాయ శాఖ ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న పామర్తి సీతారామయ్య అనారోగ్యానికి గురికావటంతో సెలవుపై వెళ్లారు. కమిషనర్ ఉత్తర్వుల మేరకు నూతక్కి సాంబశివరావు ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ ఇన్‌చార్జి అధికారిగా నియమితులయ్యారు. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు తీసుకోనున్నట్టు సమాచారం.

రియల్ బూస్ట్

నాలా చట్టం రద్దు నిర్ణయంతో సర్వత్రా హర్షం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫీజు పెంపు.. దోపిడీ ● రెవెన్యూ అధికారులకు ఆదాయ వనరుగా మారిన వైనం ● చంద్రబాబు నిర్ణయంతో అన్ని వర్గాల నుంచి మద్దతు

కంచికచర్ల మండలంలో కృష్ణానది తీర గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 4 నెలల క్రితం ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేశాడు. అయితే రెవెన్యూ అధికారుల నుంచి ముప్పతిప్పలు ఎదుర్కొన్నాడు. కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో చివరికి తనకు తెలిసిన మంత్రిని ఆశ్రయించాడు. ఆయన జోక్యంతోనే కన్వర్షన్ సర్టిఫికెట్ లభ్యమైంది.

జగ్గయ్యపేట పరిసరాల్లో 8 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఓ పారిశ్రామిక వేత్త ముందుకొచ్చాడు. వ్యవసాయ భూమిని పరిశ్రమకు వినియోగించేందుకు కన్వర్షన్ చేసుకోవాల్సి ఉండగా, నాలా ఫీజుగా రూ.3.15 లక్షలు చెల్లించాల్సి వచ్చింది.

రియల్ ఎస్టేట్ వ్యాపారులు ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేస్తే, రెవెన్యూ అధికారులకు పండగే. అవసరమైన సర్టిఫికెట్ త్వరగా పొందాలంటే లంచం తప్పదు. భూమిని ప్లాట్లుగా మార్చి రోడ్లు వేస్తే, అడిగినంత చెల్లించాల్సిందే. లేకపోతే అనుమతి కోసం కాలయాపన తప్పదు



కంచికచర్ల - ఆంధ్రజ్యోతి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలా చట్టాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించడంతో రైతులు, పారిశ్రామిక వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం అభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారిందని, ఇప్పుడు రియల్ ఎస్టేట్, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు వేగంగా పురోగమిస్తాయని అభిప్రాయపడుతున్నారు. 1963లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చి న ఈ చట్టం ప్రకారం, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్చేందుకు నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ అసెస్‌మెంట్ (నాలా) ఫీజు చెల్లించడం తప్పనిసరి. గతంలో భూమి విలువలో (రిజిస్ట్రేషన్ వాల్యూ) 3 శాతంగా ఉన్న ఫీజును వైసీపీ ప్రభుత్వం 5 శాతానికి పెంచింది. ఈ చట్టాన్ని కొంతమంది రెవెన్యూ అధికారులు లంచాలకు వేదికగా మార్చుకున్నారని, లంచం లేకపోతే కన్వర్షన్ అనుమతులు ఆలస్యమవుతున్నాయని అనేక ఆరోపణలు వచ్చాయి. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ల్యాండ్ కన్వర్షన్ కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం, అనుమతుల కోసం అడ్డంకులు ఎదురవడం అభివృద్ధికి ఆటంకమవుతోందంటున్నారు. ముఖ్యంగా, అనుమతుల మంజూరులో లంచాల ప్రభావం ఎక్కువగా ఉందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు నాయుడు నాలా చట్టాన్ని రద్దు చేస్తామని ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ప్రకటించారు. త్వరలో క్యాబినెట్‌లో చర్చించి, ఆర్డినెన్స్ రూపంలో అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. నాలా చట్టం రద్దుతో రియల్ ఎస్టేట్ రంగం తిరిగి ఊపందుకుంటుందని, పారిశ్రామికవేత్తలకు సులభతరమైన అనుమతులు లభిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాక, లైసెన్సులు, ఎన్‌వోసీల జారీ వేగవంతం చేయాలని యువ పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పుంజుకొంటున్న రియల్ ఎస్టేట్
నన్నపనేని సీతారామరాజు, రియల్టర్, కంచికచర్ల



నాలా చట్టం రద్దుతో ల్యాండ్ కన్వర్షన్ కోసం ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. భూమి విలువ ఎక్కువగా ఉండటంతో నాలా ఫీజు లక్షల్లో చెల్లించాల్సి వస్తున్నది. ఇప్పుడు ఆ భారం ఉండదు. దీంతో వెంచర్లలో స్థలాల ధరలు కూడా తగ్గనున్నాయి. ఇప్పటి వరకు మందంగా నడుస్తున్న రియల్ ఎస్టేట్ రంగం ఇక బాగా పుంజుకోవటానికి అవకాశమేర్పడింది.

సింగిల్ విండో విధానం అమలు చేయాలి
సీహెచ్ నాగేశ్వరరావు, వీఎన్ అసోసియేట్స్, విజయవాడ



నాలా చట్టం రద్దుతో పాటు పారిశ్రామిక పురోగతికి ప్రత్యేకంగా సింగిల్ విండో విధానాన్ని అమలు చేయాలి. ఏపీఐఐసీ అధీనంలోని ప్లాట్లలో ఏదైనా కంపెనీ, ఫ్యాక్టరీ, సంస్థ ఏర్పాటు చేస్తే సింగిల్ విండో విధానం ద్వారా 21 ప్రభుత్వ శాఖల నుంచి అన్ని అనుమతులు వస్తాయి. బయట కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తే వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి ఒక హద్దే ఉండదు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ధర్నాచౌక్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎన్.రమణరావు, ఆర్.వీ.నర్సింహారావు ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు గడుస్తున్నా సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టలేదని విమర్శించారు. దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాలకు సిద్ధం కావాలని, వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

విద్యాసాగర్‌ను కలిసిన గ్రంథాలయ ఉద్యోగులు


గాంధీనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'ఐక్యతే' ఎజెండాగా ముందుకు సాగాలని గ్రంథాలయ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఏ విద్యాసాగర్ సూచించారు. గ్రంథాలయ ఉద్యోగులు, పెన్షనర్లు శుక్రవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. వారి సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయ ఉద్యోగులందరూ సంఘాలతో నిమిత్తం లేకుండా ఒకతాటిపైకి వచ్చి జేఏసీగా ఏర్పడటం ద్వారా సమస్యలను త్వరగా పరిష్కరించుకోవచ్చన్నారు. దీనికి తమ సంఘం మద్దతు ఇస్తుందన్నారు. కల్లెపల్లి మధుసూదనరాజు, కోన దేవదాసు, పి.కమ్మన్న, బీరం వెంకట రమణ తదితరులు విద్యాసాగర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

కేంద్ర సర్వీసులకు గౌతమీశాలి

● అనుమతించిన ప్రభుత్వం

విజయవాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లా అండ్ ఆర్డర్ -1 డీసీపీ గౌతమీశాలి కేంద్ర సర్వీసులకు వెళ్లబోతున్నారు. రెండేళ్లపాటు ఆమె అక్కడ పనిచేయబోతున్నారు. గౌతమీశాలిని రిలీవ్ చేస్తూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. కేంద్ర సర్వీసులకు వెళ్లడానికి గౌతమీశాలి 2 నెలల క్రితం పరీక్ష రాశారు. ఇందులో ఆమె ఉత్తీర్ణులయ్యారు. ఆమె హోంమంత్రిత్వ శాఖలోని క్యాబినెట్ సెక్రటేరియట్‌లో డిప్యూటీ సెక్రటరీ హోదాలో పనిచేస్తారు. గౌతమీశాలిని రిలీవ్ చేయడంతో ఖాళీ అయిన స్థానంలో కొత్త ఐపీఎస్‌ను నియమించే వరకు మరో డీసీపీకి ఇన్‌చార్జి ఇవ్వనున్నారు.

మనక్ మంథన్ సదస్సులు నిర్వహించాలి



మాట్లాడుతున్న వివేక్

ఆటోనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాణ్యత ప్రమాణాలపై మనక్ మంథన్ సదస్సులు విస్తృతంగా నిర్వహించాలని బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ డి. వివేక్ వర్ధన్ రెడ్డి పిలుపునిచ్చా రు. శుక్రవారం ఏపీఐఐసీ కాలనీ సమీపంలోని బీఐఎస్ కార్యాలయంలో మనక్ మందన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్స్ హై డెన్సిటీ పాలిథిలిన్, పాలీప్రొఫైలిన్ నేసిన సంచుల కోసం తాజా సవరణలను వివరించారు. భారతీయ ప్రమాణాలపై, వాటి అమలు తీరును వివరించారు. ఐఎస్ఐ మార్క్, హాల్‌మార్క్, రిజిస్ట్రేషన్ మార్క్ వంటి నాణ్యతా మార్కుల ప్రామాణికతను ఎలాధ్రువీకరించాలో తెలిపారు. కార్యక్రమంలో స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డి. కృష్ణవీర్ వర్మ, అధికారులు, 30 మంది పాల్గొన్నారు.

యువతిపై బ్లేడుతో దాడి

పెనమలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒక యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసు కోర్టులో నడుస్తుండగా తిరిగి అదే యువతిపై అదే యువకుడు ఆమెపై బ్లేడుతో దాడిచేసి పరారైన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోరంకి బీజేఆర్‌నగర్‌కు చెందిన ఒక యువతితో అదేప్రాంతానికి చెందిన కొమరవల్లి వర్ధన్ కొన్నిరోజుల క్రితం అసభ్యంగా ప్రవర్తించడంతో పోలీసుల కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు నడుస్తోంది. 4 నెలలుగా మళ్లీ ఆ యువతి వెంటపడుతూ తన ఇంటికి రమ్మని వేధించడంతో ఆ యువతి గురువారం అతడి ఇంటికివెళ్లింది. అక్కడున్న యువకుడి పెదనాన్న డేవిడ్‌రాజు, విజయ్‌నిర్మల, చంటి ఉండి కేసు వెనక్కి తీసుకొమ్మని బెదిరించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి చెబుతాననగా డేవిడ్‌రాజు బ్లేడు తీసి వర్ధన్ చేతికివ్వగా అతడు ఆ యువతి పీకపై దాడి చేశాడు. గాయాలపాలైన యువతి చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా దయాల

మచిలీపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాల వేల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో నెంబరు 72ను జారీచేసింది. ఈ కార్పొరేషన్‌లో 15 మంది డైరెక్టర్లను నియమించగా, కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం నుంచి దయాల రాజేశ్వరరావుకు డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చారు. పదవీకాలం రెండేళ్లుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐఐటీయన్లకూ ఉద్యోగాలు దొరకట్లే!

(మొదటి పేజీ తరువాయి)

క్షీణత నమోదైంది. ఈ జాబితాలో 25శాతం తగ్గుదలతో ఐఐటీ ధార్వాడ్ టాప్‌లో ఉండగా, 2.88శాతం తగ్గుదలతో ఐఐటీ ఖరగ్‌పూర్ చివరి స్థానంలో నిలిచింది. 15 ఐఐటీల్లో ప్లేస్‌మెంట్ రేటు 10 శాతానికి పైగా తగ్గింది. ఈ మేరకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి సమర్పించిన నివేదికలో కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. 2021-22, 2023-24 మధ్య ఐఐటీలు, ఐఐఐటీల్లో ప్లేస్‌మెంట్లు అసాధారణంగా తగ్గాయని బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నివేదికలో కమిటీ పేర్కొంది. మార్కెట్ ధోరణులకు అనుగుణంగా నియామకాల్లో హెచ్చుతగ్గులు ఉంటాయని, విద్యార్థులు ఉన్నత విద్యకు మొగ్గు చూపడం, స్టార్టప్‌ల వైపు మళ్లడం కూడా ప్లేస్‌మెంట్ల రేటు తగ్గడానికి కారణమని అభిప్రాయపడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)ల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని, 2022-23, 2023-24 మధ్య విద్యార్థులకు అందిన సగటు వేతన ప్యాకేజీల్లో తగ్గుదల నమోదైందని తెలిపింది. ఉద్యోగావకాశాలు పెంచడానికి ఉన్న మార్గాలను అన్వేషించి, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖను కమిటీ కోరింది. ఐఐటీల్లో 2024-25 ప్లేస్‌మెంట్ల సీజన్ ఈ ఏడాది జూన్ 30 వరకూ కొనసాగనుంది. ఈ నివేదిక ప్రకారం.. ఐఐటీ(బీహెచ్‌యూ) వారాణసీలో ప్లేస్‌మెంట్ రేటు 83.15 శాతం నుంచి 88.04 శాతానికి పెరిగింది. ఈ ఒక్కచోట మాత్రమే 4.89 శాతం పెరుగుదల నమోదైంది. ఐఐటీ ధార్వాడ్‌లో ప్లేస్‌మెంట్లు 90.20 శాతం నుంచి 65.56 శాతానికి, ఐఐటీ జమ్ములో 92.08 శాతం నుంచి 70.25 శాతానికి, ఐఐటీ రూర్కీ 98.54 శాతం నుంచి 79.66 శాతానికి తగ్గాయి. 2021-22లో మొత్తం 23 ఐఐటీలకు గాను 14 చోట్ల 90 శాతానికి పైగా ప్లేస్‌మెంట్లు నమోదవగా 2023-24లో 3 ఐఐటీలు (జోధ్‌పూర్, పట్నా, గోవా) మాత్రమే 90 శాతం మార్కును దాటాయి. 2022-23తో పోలిస్తే 2023-24లో తిరుపతి, గాంధీనగర్, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో ప్లేస్‌మెంట్ల శాతం పెరిగింది.

హోటల్ ఫుడ్ బిల్లులో సర్వీసు ఛార్జీ వసూలు తగదు

» ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మార్చి 28: హోటల్‌లో వినియోగదారులు కొనుగోలు చేసే ఆహార పదార్థాలకు ఇచ్చే బిల్లులో 'సర్వీసు ఛార్జీ'ని కూడా కలపడం నిబంధనలకు విరుద్ధమని శుక్రవారం ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఫుడ్ బిల్లులో ఆటోమేటిక్ రీతిలో సర్వీసు ఛార్జీని కలపడం నిషేధం అంటూ కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) జారీ చేసిన మార్గదర్శకాలు సరైనవేనంటూ తీర్పు ఇచ్చింది. వివిధ పేర్లతో తప్పనిసరిగా చెల్లించాలన్న రీతిలో సర్వీసు ఛార్జీని విధించడం వినియోగదారుల హక్కుల ఉల్లంఘనేనని తెలిపింది. ఇది 'అనుచిత వ్యాపార విధానం' కిందకే వస్తుందని స్పష్టం చేసింది. అనుచిత వ్యాపార విధానాలు, వినియోగదారుల హక్కుల ఉల్లంఘనలను నిరోధిస్తూ 2022 జులైలో సీసీపీఏ మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిని సవాలు చేస్తూ ఫెడరేషన్ ఆఫ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్, నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించాయి.

డిజిటల్ చానళ్ల విప్లవం

దేశ వినోద, మీడియా రంగంలో ఇప్పుడు ఇదే నెంబర్‌వన్

» ఆదాయపరంగా గతేడాది టీవీచానళ్లనూ దాటేసిన వైనం
» డిజిటల్ యాడ్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్న కార్పొరేట్ కంపెనీలు
» తగ్గుతున్న ప్రింట్, టీవీ మీడియా మార్కెట్ వాటా, ఆదాయం



2024లో భారతీయులు మొత్తంగా 1.1 లక్షల కోట్ల గంటలు సెల్‌ఫోన్ స్క్రీన్ చూస్తూ గడిపారు. సగటున ఇది ఒక వ్యక్తికి రోజుకు ఐదు గంటలతో సమానం.

న్యూఢిల్లీ, మార్చి 28: ప్రస్తుతం మన దేశంలో ఒక విప్లవం నడుస్తోంది. దాని పేరే డిజిటల్ చానల్స్. ఈ విప్లవం ఏ స్థాయిలో ఉందంటే.. గతేడాది దేశ వినోద, మీడియా రంగం రూ.2.5 లక్షల కోట్ల విలువైన వ్యాపారాన్ని నమోదు చేయగా.. దాంట్లో అత్యధిక వాటా డిజిటల్ చానల్స్‌దే. వినోద, మీడియా రంగంలో ఎప్పుడూ తొలిస్థానంలో ఉండే టెలివిజన్ చానళ్లను దాటి వేసి డిజిటల్ చానల్స్ మొట్టమొదటిసారిగా నెంబర్‌వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. దీనికి కారణం.. జనం వినోదం కోసమైనా, వార్తల కోసమైనా ఇప్పుడు మొబైల్ ఫోన్ వైపే చూస్తున్నారు. 2024లో భారతీయులు మొత్తంగా 1.1 లక్షల కోట్ల గంటలు సెల్‌ఫోన్ స్క్రీన్ చూస్తూ గడిపారు. సగటున ఇది ఒక వ్యక్తికి రోజుకు ఐదు గంటలతో సమానం. ఈ ఐదు గంటల్లో దాదాపు 70% సమయం సోషల్ మీడియా, గేమ్‌లు, వీడియోలను చూడటంతోనే గడుస్తోంది. ఈ వివరాల్ని బహుళజాతి కంపెనీ 'ఈవై' తన వార్షిక నివేదికలో వెల్లడించింది. పలు ఆసక్తికరమైన అంశాలు ఈ నివేదికలో ఉన్నాయి.

అంతర్జాతీయంగా మూడోస్థానం

దేశ ప్రజలు మొబైల్‌ఫోన్‌ను చూడటానికి రోజువారీగా వెచ్చిస్తున్న సగటు సమయం ప్రకారం.. ప్రపంచంలో భారత్ మూడోస్థానంలో ఉంది. ఇండోనేషియా, బ్రెజిల్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. అయితే, మొత్తంగా దేశం యావత్తూ సెల్‌ఫోన్ మీద గడిపిన సమయం ప్రకారం చూస్తే.. భారత్ ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉంది. ఈ నేపథ్యంలోనే, భారత్‌లో పలు కార్పొరేట్ కంపెనీలు ఇప్పుడు టీవీ ప్రకటనలు, బిల్‌బోర్డుల కన్నా డిజిటల్ అడ్వర్టైజింగ్ మీద ఎక్కువ మొత్తం వ్యయం చేస్తున్నాయని పలు సర్వేల్లో వెల్లడవుతోంది.

ఇన్‌ఫ్లుయెన్సర్ల హవా

భారత్‌లో కొనసాగుతున్న డిజిటల్ విప్లవం కారణంగా.. లక్షలాది మంది కంటెంట్ క్రియేటర్లు కొత్తగా రంగంలోకి వస్తున్నారు. చిన్న చిన్న ఆరోగ్య చిట్కాల నుంచి సెలెబ్రిటీలతో ఇంటర్వ్యూల వరకూ, విహార యాత్రల నుంచి సమకాలీన రాజకీయాల వరకూ.. వీరు ఏ అంశాన్నీ వదలటం లేదు. ప్రస్తుతం ఈ కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో.. దేశ వినోదరంగంలో ఓ భారీ పరిశ్రమనే రూపుదిద్దుకుంటోంది. ఇది కార్పొరేట్లకు కూడా ప్రయోజనకరంగానే ఉంటోంది. టీవీచానళ్లలో, పత్రికల్లో, బిల్‌బోర్డుల్లో ప్రకటనలు ఇచ్చే పాతధోరణి స్థానంలో.. తమ ఉత్పత్తి పట్ల ఆసక్తి చూపే వినియోగదారులకు మాత్రమే తమ యాడ్ వెళ్లేలా వారు ఇప్పుడు ప్రకటనలు ఇవ్వగలుగుతున్నారు. మార్కెటింగ్ రంగంలో కంటెంట్ క్రియేటర్లు నేడు ఒక బలమైన శక్తిగా అవతరించారు. వారు వినోదాన్ని అందించడమే కాక.. జనం ఏది కొనాలి? ఎక్కడ కొనాలి? ఏ బ్రాండ్ మంచిది? వంటి అంశాల్ని ప్రభావితం చేస్తున్నారు. అయితే, దీని ప్రభావం టెలివిజన్, పత్రికలు, రేడియో వంటి సంప్రదాయ మీడియాపై తీవ్రంగా పడుతోంది. 2024లో సంప్రదాయ మీడియా ఆదాయం, మార్కెట్ వాటా తగ్గినట్లుగా ఈవై నివేదిక వెల్లడించింది. దేశంలో అత్యంత చవకగా మొబైల్ డేటా లభించటం ఈ డిజిటల్ విప్లవానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. గతేడాది భారతీయుల సగటు డేటా వినియోగం నెలకు 27.5 జీబీగా నమోదైంది. దేశ జనాభాలో 42% మంది (56.2 కోట్ల మంది) ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు.

జస్టిస్ వర్మ బదిలీకి కేంద్రం ఓకే



న్యూఢిల్లీ, మార్చి 28: నోట్ల కట్టల వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ సుప్రీం కొలీజియం చేసిన సిఫారసుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. అయితే, ఆయనకు ప్రస్తుతానికి ఎలాంటి న్యాయపరమైన విధులూ కేటాయించవద్దని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సుప్రీంకోర్టు సూచించింది. మరోవైపు.. జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలోని స్టోర్ రూమ్‌లో సగం కాలిన నోట్లకట్టలు కనిపించిన నేపథ్యంలో ఆయనపై ఎఫ్ఐఆర్ దాఖలుకు ఆదేశించాలంటూ న్యాయవాది మాథ్యూస్ జె నెడుంపర వేసిన పిల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే సుప్రీం కొలీజియం నియమించిన త్రిసభ్య కమిటీ జరుపుతున్న అంతర్గత విచారణ పురోగతిలో ఉందని ధర్మాసనం గుర్తు చేసింది. అంతర్గత విచారణ అనేది దర్యాప్తు సంస్థలు జరిపే నేర దర్యాప్తునకు ప్రత్యామ్నాయం కాదని, అసలు అది కోర్టు పని కాదని, దాన్ని పోలీసులకు వదిలేయాలని న్యాయవాది నెడుంపర వాదించారు. దీంతో.. "అంతర్గత విచారణ పూర్తి కానివ్వండి" అని జస్టిస్ ఓకా సమాధానమిచ్చారు.

అత్యాధునిక ఎఫ్‌పీవీ డ్రోన్ పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ, మార్చి 28: అత్యాధునిక డ్రోన్ల తయారీపై దృష్టి సారించిన భారత ఆర్మీ తాజాగా అత్యాధునిక ఫస్ట్ పర్సన్ వ్యూ (ఎఫ్‌పీవీ) కమికాజె (ఆత్మాహుతి) డ్రోన్‌ను విజయవంతంగా పరీక్షించింది. శుక్రవారం పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో నిర్వహించిన ఈ పరీక్షలో నిర్దేశిత లక్ష్యం వద్దకు మందుగుండు సామగ్రితో వెళ్లిన డ్రోన్ దాన్ని సమర్థవంతంగా పేల్చివేసింది. ఈ వీడియోను భారత సైన్యం ఎక్స్‌లో పోస్టు చేసింది. చండీగఢ్‌లోని డీఆర్‌డీవోకు చెందిన టెర్మినల్ బాలిస్టిక్ రీసెర్చ్ ల్యాబొరేటరీ సాయంతో.. సైన్యానికి చెందిన ఫ్లూర్- ద- లిస్ బ్రిగేడ్ ప్రత్యేక యూనిట్ రైజింగ్ స్టార్ డ్రోన్ బ్యాటిల్ స్కూల్‌లో ఈ డ్రోన్‌ను అభివృద్ధి చేశారు. ఈ డ్రోన్‌లో పూర్తి స్థాయిలో స్వదేశీ పరికరాలనే వాడినట్లు తెలుస్తోంది. లక్ష్యాలను కచ్చితంగా ఛేదించేలా పైలట్లకు వీటిపై పూర్తిస్థాయి నియంత్రణ ఉండేలా ద్విభద్రతా వ్యూహంతో వీటిని రూపొందించారు. కాగా, ఈ డ్రోన్లు శత్రువులకు సంబంధించిన సమాచారాన్ని వీడియో రూపంలో పైలట్లకు ఎప్పటికప్పుడు చేరవేయడంతో వారికి యుద్ధ క్షేత్రాన్ని అంచనా వేసే అవకాశం లభిస్తుంది. నిఘా, గస్తీ లక్ష్యాలపై దాడికి, ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్రానికి వాడే ఈ డ్రోన్లు, చిన్న సైజులో ఉండడంతో దళాలు ఎక్కడికైనా వీటిని సులువుగా తరలించి ఆపరేషన్లు చేపట్టవచ్చు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధంలో ఈ డ్రోన్లను విరివిగా వినియోగిస్తున్నారు.

నాగ్ క్షిపణి వ్యవస్థ కోసం ఏవీఎన్ఎల్‌తో రక్షణ శాఖ డీల్

కంది/అల్వాల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నాగ్ క్షిపణి వ్యవస్థ (ట్రాక్డ్ వర్షన్) కోసం సంగారెడ్డి జిల్లా ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలోని ఏవీఎన్ఎల్(ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్)తో రక్షణశాఖ ఒప్పందం చేసుకొంది. దీని విలువ రూ.1,801కోట్లు. దీంతో పాటు, 5వేల అత్యాధునిక సైనిక వాహనాల కోసం రక్షణ శాఖ ఫోర్స్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థలతో రక్షణ శాఖ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం విలువ దాదాపు రూ.700కోట్లు. ఒక్కో సైనిక వాహనం 800కిలోల వరకు మోసుకెళ్లగలదు.

1న పదవ తరగతి సోషల్ పరీక్ష

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సోషల్ స్టడీస్ పరీక్షను ఏప్రిల్ 1న నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. రంజాన్ పండగ నేపథ్యంలో మార్చి 31 లేదా ఏప్రిల్ 1న పరీక్ష జరుగుతుందని షెడ్యూలులో పేర్కొన్నారు. 31న రంజాన్ జరుపుకొంటున్నందున పరీక్షను 1న నిర్వహించాలని నిర్ణయించారు.

బార్లను బలవంతంగా మూయించొద్దు

» నిబంధనలు ఉల్లంఘించొద్దు: ఎక్సైజ్ కమిషనర్

త్రీస్టార్, ఆపై స్థాయి హోటళ్లలో బార్ల పనివేళల విషయంలో పోలీసులు నిబంధనలు ఉల్లంఘించొద్దని ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్‌కుమార్ స్పష్టంచేశారు. నిబంధనల ప్రకారం బార్లకు ఉదయం 11 నుంచి రాత్రి 11గంటల వరకు, త్రీస్టార్, ఆపైస్థాయి హోటళ్లలోని బార్లకు ఉదయం 11 నుంచి రాత్రి 12గంటల వరకు అనుమతి ఉందని వివరించారు. అయితే రాత్రి వేళల్లో విధుల్లో ఉండే పోలీసులు ముందుగానే బార్లు మూయిస్తున్నారంటూ విజయవాడ హోటల్స్ అసోసియేషన్ ఎక్సైజ్ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. ముందుగానే మూయించడం నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా, ప్రభుత్వ ఆదాయాన్ని నిలువరించినట్టు అవుతుందని.. అందువల్ల నిర్ణీత సమయానికి ముందే బార్లను బలవంతంగా మూయించొద్దని కమిషనర్ స్పష్టంచేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విజయవాడ, విశాఖపట్నం పోలీస్ కమిషనర్లకు లేఖ రాశారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో ఐదో తరగతి, జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం, డిగ్రీ కాలేజీల్లో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 6 వరకు http://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఆన్‌లైన్‌లో కాకుండా ఇతర మార్గాల్లో పంపే దరఖాస్తులు పరిశీలించబోరని స్పష్టం చేసింది.

సర్వేశ్వరశర్మకు సైన్స్ పాపులరైజేషన్ అవార్డు



అమలాపురం టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సైన్స్ రచయిత, కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మకు హైదరాబాద్‌కు చెందిన అకాడమీ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ సంస్థ సైన్స్ పాపులరైజేషన్ అవార్డును ప్రకటించింది. రాష్ట్రం నుంచి సర్వేశ్వరశర్మకు మాత్రమే ఈ అవార్డును అందిస్తున్నట్టు సంస్థ కార్యదర్శి శుక్రవారం సమాచారం అందించారు. ఏప్రిల్ 22న హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర్ ఆడిటోరియంలో జరిగే సంస్థ వార్షిక సమావేశంలో ఆయనకు అవార్డును ప్రదానం చేయనున్నారు. సైన్స్ సంబంధిత అంశాలను జనరంజకంగా రాయడమేకాక, ప్రజల్లో విశేషంగా ప్రచారం చేసిందుకు సర్వేశ్వరశర్మను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. 41 ఏళ్ల సైన్స్ ప్రచారానికి తన పూర్తి సమయాన్ని కేటాయించిన ఆయన 83 ఏళ్ల వయసులో కూడా సైన్స్‌పై కొత్త రచనలు చేస్తుండడాన్ని అకాడమీ ఫర్ సైన్స్ సంస్థ గుర్తించింది.

రాష్ట్రంలో మరో నాలుగు వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు

» పురపాలక శాఖ మంత్రి నారాయణ

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 28(ఆంధ్రజ్యోతి): వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు రాష్ట్రంలో మరో నాలుగు వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ-రాజమహేంద్రవరం మధ్య ఒకటి, నెల్లూరు-తిరుపతి మధ్య మరొకటి ఏర్పాటు చేస్తామన్నారు. కడప, కర్నూలులో కూడా వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విశాఖపట్నం, గుంటూరుల్లో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే రెండు ప్లాంట్లు పనిచేస్తున్నాయన్నారు.

కొత్త జిల్లాల్లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీల దరఖాస్తులకు ఆహ్వానం

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 కొత్త జిల్లాల్లో ఏర్పాటు చేయబోయే చైల్డ్ వెల్ఫేర్ కమిటీల్లో చైర్‌పర్సన్లు, మెంబర్లు, జువైనల్ జస్టిస్ బోర్డుల్లో సోషల్ వర్కర్ మెంబర్లుగా సేవలు అందించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు రాష్ట్ర బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ సంచాలకులు ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్దేశిత విధానంలో వారి అర్హత ధ్రువీకరణ పత్రాల నకళ్లతోపాటు ఏప్రిల్ 9వ తేదీ లోపు విజయవాడలోని ఈ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్హతలు, అనుభవం, ఎంపిక విధానం, ఇతర వివరాలకు http://wdcw.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.



శ్మశాన వాటిక కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కొత్తచెరువు తహశీల్దారు నీలకంఠా రెడ్డి, రెవెన్యూ సిబ్బంది

చివరి మజిలీ కష్టాలకు మోక్షం

» త్వరలో కొత్త చెరువు పంచాయతీకి శ్మశాన వాటిక స్థలం అప్పగింత
» 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'కు స్పందన

కొత్తచెరువు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రం ప్రజలకు శ్మశానవాటిక కష్టాలు త్వరలో తీరనున్నాయి. జనవరి 28న కొత్తచెరువు బీసీ కాలనీలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ఈ సమస్యను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి దృష్టికి గ్రామస్థుడు సాలమ్మగారి శివప్రసాద్ చౌదరి తీసుకువచ్చారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని వేదికపై ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. కొత్తచెరువు జనాభా 30 వేలకు పైగా ఉంది. శ్మశాన వాటిక లేకపోవడంతో చెరువు, కాలువ గట్లు, ఆర్అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా అంత్యక్రియలను నిర్వహిస్తున్నారు. హామీ మేరకు శ్మశాన వాటిక కోసం స్థానికంగా ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పుట్టపర్తి రహదారి పక్కన, నల్లగొండ సమీపంలో సర్వే నంబర్ 1451లోని 1, 2, 3 లెటర్లలో 3.70 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఈ భూమిని శుక్రవారం పరిశీలించిన తహశీల్దార్ నీలకంఠా రెడ్డి, ఈ స్థలానికి ఉన్న దారిని ఆక్రమించిన రైతుకు నోటీసు ఇచ్చి, సమస్య పరిష్కరిస్తామని, దారి కల్పించిన అనంతరం స్థలాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రామ పంచాయతీకి అప్పగిస్తామని తెలిపారు.

రూ.లక్ష ఇవ్వాల్సిందే!

» గ్యాస్ ఏజెన్సీ యజమాని పేరు మార్పునకు కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ లంచం డిమాండ్
» ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
» కార్యాలయంలోనే నగదు తీసుకుంటూ దొరికిన రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్, డాక్యుమెంట్ రైటర్

కాకినాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, డాక్యుమెంట్ రైటర్ వెలుగుల జగదీష్ కార్యాలయంలోనే లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తునికి చెందిన ఆర్.రమేశ్‌బాబు తన భార్య పేరున ఉన్న గ్యాస్ ఏజెన్సీని తన పేరిట మార్చుకునేందుకు పార్టనర్‌షిప్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావును ఆశ్రయించారు. ఆ పని చేయాలంటే రూ.లక్ష ఇవ్వాలని ఆనందరావు డిమాండ్ చేశారు. 15 రోజులుగా ఈ వ్యవహారం సాగుతుండటంతో రమేశ్‌బాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు శుక్రవారం కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి లంచం సొమ్మును ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఆనందరావు నుంచి రూ.లక్ష, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి నుంచి రూ.25వేలు, అనధికారికంగా ఉన్న మరో రూ.85 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మధ్యవర్తిగా వ్యవహరించిన డాక్యుమెంట్ రైటర్ వెలుగుల జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. శనివారం వారిని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్ బాబు తెలిపారు. కాగా.. ఆనందరావు వాహనంలో రూ.7.80 లక్షల నగదు, 13 మద్యం సీసాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



కాకినాడలో ఏసీబీకి చిక్కిన జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, డాక్యుమెంట్ రైటర్ జగదీష్

పొలంలో బోరు అనుమతికి రూ.12 వేలు

» రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడిన నక్కపల్లి ఆర్ఐ



కన్నబాబు

నక్కపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి లంచం తీసుకుంటుండగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి ఇన్‌చార్జి ఆర్ఐ కన్నబాబును ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఎన్.రమ్య కథనం మేరకు.. మండలంలోని ఒక గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు తమ పొలంలో బోరు వేయించుకోవడానికి దరఖాస్తు చేసుకోగా ఇన్‌చార్జి ఆర్ఐ మోటకట్టు కన్నబాబు, రూ.5 వేల చొప్పున రూ.15 వేలు లంచం డిమాండ్ చేసి రూ.12 వేలకు అంగీకరించారు. విశాఖలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించిన రైతులు వారి సూచన మేరకు తహశీల్దార్ కార్యాలయంలో కన్నబాబుకు రూ.12 వేలు ఇచ్చారు. వెంటనే ఏసీబీ అధికారులు ఆయన నుంచి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. శనివారం విశాఖలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని డీఎస్పీ చెప్పారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అమిత్ బర్దార్, చిత్రంలో లొంగిపోయిన మావోయిస్టులు

10 మంది మావోయిస్టుల లొంగుబాటు

పాడేరు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల సిద్ధాంతాలపై విసుగుచెంది పార్టీలో వేర్వేరు బాధ్యతలు నిర్వర్తిస్తున్న పది మంది శుక్రవారం లొంగిపోయారని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పామేడు ఏరియా కమిటీ పీపీసీఎం డిప్యూటీ కమాండర్ కడితి మంగిలి, ఏవోబీ ఎస్‌జెడ్‌సీ ఏరియా కమిటీ సభ్యురాలు కొవ్వాసి సుక్కి అలియాస్ మంజు, పీపీసీఎం ప్రొటెక్షన్ టీమ్ కమాండర్ సోడి కోసా, పీపీసీఎం మిలీషియా ప్లాటూన్ డిప్యూటీ కమాండర్ సోడి రాజు అలియాస్ రాజా, ఎర్రపల్లి ఆర్‌పీసీ అధ్యక్షుడు మడకం పొజ్జ అలియాస్ కిక్కిరి పొజ్జ, ఎర్రపల్లి ఆర్‌పీసీ మిలీషియా సభ్యుడు ముచ్చంకి గంగ, జారుపల్లి ఆర్‌పీసీ మిలీషియా కమాండర్ బాడిసి భీమయ్య అలియాస్ భీమా, జారుపల్లి ఆర్‌పీసీ సీఎన్ఎం సభ్యుడు కురసం నాగరాజు అలియాస్ రామ, బాలల సంఘం పాలగూడెం ఆర్‌పీసీ కలుముల రామా అలియాస్ ఊరా, డీవీసీఎం సౌత్ బస్తర్ డివిజన్ డీకేఎస్ జడ్‌సీ కడితి రామ అలియాస్ సమ్మయ్య లొంగిపోయారని ఎస్పీ వెల్లడించారు.

బ్లూఫ్లాగ్ బీచ్‌గా సూర్యలంక

» మంత్రి కందుల దుర్గేష్

బాపట్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో సూర్యలంక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శుక్రవారం బాపట్లలో విలేకరులతో మాట్లాడుతూ బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా సూర్యలంక బీచ్‌ను రూపొందిస్తామన్నారు. బాపట్ల-చీరాల మధ్య టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 ద్వారా మంజూరైన రూ.97.52 కోట్ల నిధులతో సూర్యలంక బీచ్‌లో అధునాతన సదుపాయాలు కల్పించి సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.


» తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 6వ తేదీ రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. 7వ తేదీన శ్రీరామపట్టాభిషేకాన్ని నిర్వహించనున్నారు.



ఉగాది మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీశైలంలో కైలాస వాహనంపై విహరిస్తున్న స్వామిఅమ్మవార్లు









వైసీపీకి బెట్టింగ్ బేడీలు

- అవనిగడ్డ ఎంపీపీ కుమారుడి అరెస్టు
- జనసేన మద్దతుదారూ అదుపులో!
- బ్యాంక్ ఖాతాలో భారీగా నగదు

విజయవాడ, ప్రొద్దుటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బెట్టింగ్‌రాయుళ్ల కోసం పోలీసుల వేట ముమ్మరమైంది. శుక్రవారం కృష్ణా జిల్లా అవనిగడ్డ వైసీపీ ఎంపీపీ తుంగల సుమతీదేవి కుమారుడు పవన్‌కుమార్ బెట్టింగ్ నిర్వహిస్తూ పోలీసులకు అడ్డంగా దొరికినట్టు తెలిసింది. ఈ జిల్లాకు చెందిన మరో బుకీనీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అతడు జనసేన మద్దతుదారు అని తెలిసింది. పోలీసువర్గాల కథనం ప్రకారం, విజయవాడ పటమటకు చెందిన తుంగల పవన్‌కుమార్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. వారు వెంటనే ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. పోలీసులు పవన్‌కుమార్ ఉంటున్న స్థావరాన్ని చుట్టిముట్టి లోపలకు వెళ్లే సరికి మ్యాచ్‌లో పరుగులకు మించి ఆయన పందాలను పరుగెత్తిస్తున్నాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. పవన్‌కుమార్ బ్యాంక్ ఖాతాను పరిశీలించగా, అందులో లక్షలాది రూపాయలు నిల్వ ఉన్నట్టు గుర్తించారు. విచారించగా ఉమ్మడి కృష్ణా జిల్లా మొత్తం నెట్‌వర్క్‌ను విస్తరించినట్టు పవన్‌కుమార్ వెల్లడించాడని సమాచారం.


తుంగల పవన్ కుమార్

ఆయన ఫోన్ సంభాషణలు ఎక్కువగా వాట్సాప్ కాల్స్ ద్వారా సాగినట్టు సమాచారం. పవన్‌కుమార్‌తో నిత్యం సంప్రదింపులు చేస్తున్న అవనిగడ్డకు చెందిన జనసేన మద్దతుదారు చెన్నా గోపయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. పవన్‌కుమార్ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో భారీగా బెట్టింగ్‌లు నిర్వహించినట్టు ఆరోపణలు ఉన్నాయి. అతడి స్వస్థలం అవనిగడ్డ అయినప్పటికీ విజయవాడ కేంద్రంగా బెట్టింగ్‌లు నడుపుతున్నాడు. పవన్‌కుమార్ ప్రధాన బుకీగా ఉంటూ ఉమ్మడి జిల్లాలో సబ్ బుకీలను నియమించుకున్నాడు. ఈ నెట్‌వర్క్‌ను ఛేదించి మిగిలిన బుకీలను కూడా ఏరివేసే పనిలో ప్రత్యేకబృందం ఉన్నట్టు తెలిసింది.

అప్పులపాలై యువకుని ఆత్మహత్య

కడప జిల్లా ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్‌లతో అప్పులపాలై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో కాకనూరు నాగేశ్వరరెడ్డి అనే వ్యక్తి చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. నాగేశ్వరరావు కుమారుడు ప్రేమ్‌సాగర్ రెడ్డి (23) బీటెక్ రెండవ సంవత్సరంలో చదువు మానేశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో కొన్ని రోజులు పనిచేశారు.


ప్రేమ్ సాగర్‌రెడ్డి

అనంతరం తిరుపతి చేరుకుని అక్కడ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేస్తూ 15 రోజుల క్రితం కడపకు బదిలీపై వచ్చారు. క్రికెట్ బెట్టింగ్‌లు ఆడి డబ్బులు పోగొట్టుకున్నారు. పలువురి దగ్గర సుమారు రూ.8లక్షలు అప్పు చేశారు. వాటిని తీర్చలేని స్థితిలో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంట్లో వాళ్లు కిరాణా షాపులో ఉండగా.. ప్రేమ్‌సాగర్‌రెడ్డి పైన గదిలో ఇనుప పైపులకు చీరతో ఉరివేసుకున్నారు. కాసేపటికి కుటుంబసభ్యులు గమనించి అతడిని కిందకు దించి దగ్గరలోని ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడని ఆయన తెలిపారు. తండ్రి నాగేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేశామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఏడుకొండల స్వామికి కునుకు కరువు!

(మొదటి పేజీ తరువాయి)

మహాద్వారం, వెండి వాకిలి, బంగారు వాకిలి తలుపులు తెరిచి 3 గంటలకు సుప్రభాత సేవ నిర్వహిస్తున్నారు. సాధారణంగా రాత్రి 12 గంటలలోపే ఏకాంత సేవ నిర్వహించాలి. అయితే గత పదేళ్లగా ఈ సేవ నిర్వహణ సమయం అర్ధరాత్రి 1 నుంచి 2గంటల మధ్య సమయానికి మారిపోయింది. కొన్నేళ్లుగా రాత్రి 2.30 గంటలకు ఏకాంత సేవను నిర్వహించి, ఆలయం తలుపులు మూస్తున్నారు. ఒక్కోసారి 2.50 గంటలకు ఏకాంత సేవ పూర్తిచేసి, ఆ వెంటనే అంటే కేవలం 7 నిమిషాల వ్యవధిలోనే తిరిగి ఆలయం తలుపులు తెరుచుకుంటున్నాయి. క్యూలైన్లు భారీగా ఉండి, కంపార్టుమెంట్లలో గంటల తరబడి నిరీక్షిస్తున్న భక్తులకు వీలైనంత త్వరగా దర్శనం చేయించాలనే ఉద్దేశంతో అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా క్యూలైన్లు కొనసాగిస్తుండటంతో ఈ పరిస్థితులు నెలకొంటున్నాయి. రోజుకు 23 గంటలకు పైగా శ్రీవారి దర్శనాలు కొనసాగుతున్నాయి. అయితే, ఇది సరికాదని, గర్భాలయంలోని మూలమూర్తికి కనీసం గంట నుంచి గంటన్నర సేపైనా ఏకాంతం కల్పించాలని కొందరు పండితులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏకాంత సమయంలోనే దేవతలు భూలోకానికి వచ్చి శ్రీనివాసుడిని ఆరాధిస్తారని, స్వయంగా బ్రహ్మదేవుడే వచ్చి పూజ చేస్తారని పురాణాల్లో ఉందని గుర్తుచేస్తున్నారు. దేవతల ఆగమన సమయంలో మానవ సంచారం ఉండరాదని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్శనాల సమయాన్ని కుదించి ఏకాంత సమయాన్ని పెంచాలని అర్చకులు, కొందరు పండితులు టీటీడీ అధికారులను కోరినట్టు తెలుస్తోంది.

గుత్తాధిపత్యంతో విమాన టికెట్ ధరలకు రెక్కలు

- లోక్‌సభలో టీడీపీ

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

న్యూఢిల్లీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): 'దేశ పౌర విమానయాన రంగంలో రెండు విమానయాన సంస్థలు మార్కెట్‌లో అధిక భాగాన్ని ఆక్రమించుకున్నాయి. దీనివల్ల విమాన ప్రయాణ టికెట్ల ధరలు అందుబాటులో ఉండడం లేదు' అని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శుక్రవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు. 'విమాన టికెట్ల ధరలు నిమిషాల వ్యవధిలో వేలకు వేలు పెరుగుతున్నాయి. పౌర విమానయాన రంగంలో ఇండిగో 60% వాటాను, ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థలైన ఎయిరిండియా ఎక్స్ ప్రెస్, విస్తారా మరో 30 శాతం వాటాను కలిగి ఉన్నాయి. నా నియోజకవర్గంలో ఉండే పల్నాడులో నిర్మించే విమానశ్రయాన్ని శిక్షణ కోసం వినియోగిస్తామని కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు చెప్పారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్. సీనియర్ సిటిజన్లకు విమాన టికెట్ల ధరలను పరిమితిలో ఉంచే విషయంపై విమానయాన మంత్రిత్వ శాఖ దృష్టి పెట్టాలి' అని ఎంపీ లావు కోరారు.

అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది



నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'రాబిన్‌హుడ్' చిత్రం శుక్రవారం విడుదలైంది. అద్భుతమైన రెస్పాన్స్ వస్తోందనీ, ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారనీ దర్శకుడు వెంకీ చెప్పారు. శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'మేం రెండు థియేటర్స్‌కి వెళ్లాం. నితిన్ పెర్ఫార్మెన్స్‌తో పాటు రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ కామెడీ ట్రాక్‌ను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. అలాగే క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్, ట్విస్టుల గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. డేవిడ్ వార్నర్ ఎంట్రీకి థియేటర్ అదిరిపోయింది. ఆడియన్స్ రియాక్షన్ చూశాక చాలా హ్యాపీగా అనిపించింది. ఈ ఉగాదికి మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. అందరూ థియేటర్‌కు వెళ్లి చూడండి' అని కోరారు. నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ మాట్లాడుతూ 'థియేటర్‌కి వెళ్లి ఫ్యామిలీ, యూత్ ఎంజాయ్ చేసే సినిమా ఇది. ఆడియన్స్ నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రతి షో కీ కలెక్షన్లు పెరుగుతున్నాయి.. డిస్ట్రిబ్యూటర్స్ కూడా ఫోన్ చేసి బాగుందని చెబుతున్నారు. సినిమా కచ్చితంగా విన్నర్ అవుతుందని మా నమ్మకం' అన్నారు.

నవ్వించడంలో విజయం సాధించాం



నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ ప్రెస్ మీట్‌లో నాగవంశీ మాట్లాడుతూ 'మా చిత్రం సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. భారీ ఓపెనింగ్స్ వస్తున్నాయి. ప్రేక్షకులను నవ్వించడంలో విజయం సాధించాం. మాపై ప్రేమను కురిపిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. దర్శకుడు కల్యాణ్ శంకర్ మాట్లాడుతూ 'సినిమాలో సునీల్ పాత్రకు మంచి స్పందన రావడం ఆనందంగా ఉంది' అని అన్నారు. నిర్మాత హారిక సూర్యదేవర మాట్లాడుతూ 'మా కష్టానికి ఫలితం దక్కడం సంతోషంగా ఉంది' అని అన్నారు.

నాటక కళాకారులకు వెలుగునిస్తోంది



- తనికెళ్ల భరణి

ఎందరో మహానుభావులు నాటక రంగానికి సేవలందిస్తూ, కళాకారులను ప్రోత్సహిస్తున్నారని నటుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. ఆంధ్ర నాటకకళాపరిషత్ 96వ వార్షిక జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా అమీర్‌పేటలోని కమ్మసంఘం హాల్‌లో కొనసాగుతున్న పద్మవిభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలకు శుక్రవారం తనికెళ్ల భరణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో మంచి నాటికలు, నాటకాలను ఇప్పటికీ ప్రజలు ఆదరిస్తుండడం వెనుక ఎంతో మంది. కృషి దాగుందన్నారు. నాటక కళాకారులకు వెలుగునిస్తున్న ఆంధ్రనాటక కళాపరిషత్ కృషిని కొనియాడారు. అంతకుముందు శార్వాణీ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ ప్రదర్శించిన 'కొత్త పరిమళం', మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ వారు ప్రదర్శించిన 'మా ఇంట్లో మహాభారతం' నాటికలు ఆకట్టుకున్నాయి. రావులపాలెంకు చెందిన సామాజిక సేవకుడు డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డికి ఆంధ్రనాటక కళాపరిషత్ జీవిత సాఫల్య సాధన పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు లోని ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణ, కమ్మసంఘం ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ, హాస్యనటుడు గౌతంరాజు తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేట, (ఆంధ్రజ్యోతి)

చిత్రజ్యోతి

SINCE 1965


ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఢిల్లీలో కలసిన విజయ్ దేవరకొండ, యామీ గౌతమ్, అమిత్ సాథ్ తదితరులు

నాకు నచ్చినట్టు జీవిస్తా

- సమంత



'నాకు నచ్చినట్టు జీవిస్తా.. రూల్స్ పెడితే అస్సలు నచ్చదు' అంటూ హాట్ కామెంట్స్ చేశారు సమంత. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశమవుతున్నాయి. ప్రస్తుతం సమంత సిడ్నీలో పర్యటిస్తున్నారు. అక్కడ నిర్వహించిన ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న సమంత మాట్లాడుతూ 'నాకు ఇష్టమైన రంగంలో రాణించాలన్నదే నా ఆశ. ఆడపిల్లనని ఇది చేయకూడదు, అది చేయకూడదు, ఇలా ఉండు, అలా ఉండు అంటూ రూల్స్ పెడితే నాకు నచ్చదు. అన్ని రకాల పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించాలి. అదే నా సక్సెస్‌గా భావిస్తా' అని అన్నారు.

హృతిక్ దర్శకత్వంలో 'క్రిష్-4'



బడ్జెట్ సమస్యల కారణంగా వాయిదా పడుతూ వస్తోన్న 'క్రిష్-4' చిత్రం ఎట్టకేలకు పట్టాలెక్కనుంది. హృతిక్ రోషన్ హీరోగా నటించనున్న ఈ మూవీకి ఆయనే దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని హృతిక్ తండ్రి రాకేశ్ రోషన్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఆ మధ్య ఆదిత్య చోప్రా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకొన్నారనే వార్తలు బీటౌన్‌లో చక్కర్లు కొట్టాయి. అలాంటిదేమీ లేదు ఆయన మాతోనే ఉన్నాడంటూ రాకేశ్ స్పష్టతనిచ్చారు. 'హృతిక్, ఆదిత్య ఇద్దరూ కలిసి వెండితెరపై ఇదివరకెవ్వరూ చేయలేని ఓ అద్భుతాన్ని 'క్రిష్-4' రూపంలో ఆవిష్కరించనున్నారు' అంటూ రాకేశ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'దుగ్గు (హృతిక్ రోషన్) పాతికేళ్ల క్రితం నిన్ను ఓ నటుడిగా ఈ ప్రపంచానికి పరిచయం చేశాను. ఇప్పుడు నేను, ఆదిత్య కలసి నిన్ను దర్శకుడిని చేయబోతున్నాం. ఈ కొత్త ప్రయాణంలో అన్నీ విజయాలే చేకూరాలని కోరుతున్నా' అని రాకేశ్ రోషన్ పేర్కొన్నారు.

భార్యను చంపి.. ముక్కలుగా కోసి..
ట్రావెల్ బ్యాగులో కుక్కి పరారీ

» బెంగళూరులో దారుణం.. నిందితుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీరు


గౌరితో భర్త రాకేశ్ (ఫైల్)

బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన భార్యను దారుణంగా హత్య చేశాడు. మృతదేహాన్ని ముక్కలుగా చేసి ట్రావెల్ బ్యాగ్‌లో కుక్కి పారిపోయాడు. ఆ తర్వాత తానే పోలీసులకు సమాచారమిచ్చాడు. ఈ ఘటన హుళిమావు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొడ్డకమ్మనహళ్ళిలో గురువారం వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రకు చెందిన రాకేశ్ బెంగళూరు నగరంలోని ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆయన భార్య గౌరి అనిల్ సాంబేకర్ (32) గృహిణి. రాకేశ్ వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం భార్యను హత్య చేసిన రాకేశ్, అత్తమామలకు గురువారం ఫోన్ చేసి, గౌరి ఆత్మహత్య చేసుకుందని, తాను మరోచోట ఉన్నానని సమాచారం ఇచ్చాడు. దీంతో గౌరి తల్లిదండ్రులు మహారాష్ట్ర పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈలోగా రాకేశ్ మహారాష్ట్ర పోలీసులకు ఫోన్ చేసి, బెంగళూరులో తన భార్యను హత్య చేశానని తెలిపాడు. వారిచ్చిన సమాచారంతో హుళిమావు పోలీసులు రాకేశ్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లి పరిశీలించారు. ట్రావెల్ బ్యాగ్‌లో ముక్కలు ముక్కలుగా ఉన్న గౌరి మృతదేహాన్ని గుర్తించారు. ఈలోగా మహారాష్ట్ర పోలీసులు రాకేశ్ ఆచూకీ తెలుసుకుని గురువారం రాత్రి పుణెలో అరెస్టు చేశారు. నెలన్నర క్రితమే రాకేశ్ దంపతులు దొడ్డకమ్మనహళ్ళిలోని ఇక్కడి అపార్ట్‌మెంట్‌లో చేరారు. హత్యకు గల కారణాలేంటనేదానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ జయంతి జాతీయ సెలవు దినం

న్యూఢిల్లీ, మార్చి 28: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14ను జాతీయ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ శుక్రవారం ఎక్స్ ద్వారా తెలిపారు.

బీఏసీ సమావేశం నుంచి ధన్‌ఖడ్ వాకౌట్

న్యూఢిల్లీ, మార్చి 28: బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం నుంచి రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వాకౌట్ చేశారు. ఈ సమావేశంలో 'సముచిత గౌరవం' లోపించడమే కారణమని రాజ్యసభ వర్గాలు తెలిపాయి. అయితే వివిధ అంశాలపై ఎన్డీయే ఎంపీలకు, తమకు తీవ్ర విభేదాలు రావడంతో ఆయన మధ్యలో వెళ్లిపోయారని విపక్ష సభ్యులు చెబుతున్నారు. వచ్చే వారం రాజ్యసభ కార్యకలాపాలను నిర్ణయించడానికి శుక్రవారం బీఏసీ సమావేశం నిర్వహించారు. నకిలీ ఓటరు ఐడీ నంబర్లు, మణిపూర్ ఘటన, పార్లమెంటరీ కమిటీల బిల్లులను పరిశీలనకు పంపాలన్న అంశాలపై చర్చించేందుకు సమయం కేటాయించాలన్న డిమాండ్‌పై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు రావడంతో ధన్‌ఖడ్ వాకౌట్ చేశారని ఓ విపక్ష నాయకుడు తెలిపారు.

తూర్పు లద్దాఖ్ వద్ద శాశ్వత సైనిక స్థావరం

» ఎల్ఏసీ రక్షణకు '72 ఇన్‌ఫాంట్రీ డివిజన్'..ఆర్మీ నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 28: తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వద్ద రక్షణకు శాశ్వత సైనిక స్థావరం ఏర్పాటు చేయాలని భారత ఆర్మీ నిర్ణయించింది. ఆ ప్రాంతంలో శాశ్వతంగా మోహరించేందుకు కొత్తగా డివిజన్ స్థాయి దళాన్ని సిద్ధం చేస్తోంది. దానికి 72 ఇన్‌ఫాంట్రీ డివిజన్ అని నామకరణం చేసింది. చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే లద్దాఖ్‌లోని ఎల్ఏసీ మొత్తాన్ని గస్తీకాస్తున్న 3వ డివిజన్‌కు అదనంగా కొత్త పదాతిదళ విభాగం పనిచేస్తుంది. ఈ కొత్త విభాగం ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ ఆధీనంలో ఉంటుంది.

2060 నాటికీ భారత్ నంబర్ వన్ కాదు: మమత

కోల్‌కతా/లండన్, మార్చి 28: భారత్ 2060నాటికి ఆర్థికాభివృద్ధిలో నంబర్ వన్‌గా ఎదుగుతున్న అంచనాలతో తాను విభేదిస్తున్నట్లు బెంగాల్ సీఎం, టీఎంసీ అధ్యక్షురాలు మమత అన్నారు. యూకే పర్యటనలో ఉన్న ఆమె.. గురువారం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని కెల్లాగ్ కాలేజీలో జరిగిన చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూకేకు చెందిన సంధానకర్త మాట్లాడుతూ.. 'ఆర్థికాభివృద్ధిలో భారత్ ఇప్పటికే మమ్మల్ని అధిగమించి ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. త్వరలోనే మూడో ఎకానమీగా ఆవిర్భవించనుంది. 2060నాటికి ప్రథమ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న అంచనాలు ఉన్నాయి' అని ప్రస్తావించారు. మమత స్పందిస్తూ.. ఈ అంచనాలతో తాను విభేదిస్తున్నానని అన్నారు. 'ప్రపంచంలో ఆర్థిక యుద్ధ వాతావరణం ఉంటే భారత్ పైచేయి సాధిస్తుందని ఎలా అంచనా వేస్తాం? ఇది ఆశ మాత్రమే' అని ఆమె వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ విరుచుకుపడింది. విదేశీ గడ్డపై ఇలా ఎవరైనా వ్యవహరిస్తారా అని మండిపడింది.

యూకేను వీడనున్న లక్ష్మీ మిత్తల్!



న్యూఢిల్లీ, మార్చి 28: ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్సెలార్ మిత్తల్ మాజీ సీఈవో లక్ష్మీ మిత్తల్ బ్రిటన్‌ను వీడనున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా అక్కడే నివసిస్తున్న ఆయన.. యూకే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆ దేశాన్ని వీడాలని అనుకున్నట్లు సమాచారం. నాన్ డోమ్ పన్ను విధానాన్ని రద్దుచేయాలని బ్రిటన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పన్ను విధానం కింద యూకేలో నివసించే వారు విదేశాల్లో సంపాదించిన ఆదాయంపై బ్రిటన్ ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించనక్కర్లేదు. అయితే ఇప్పుడు ఈ విధానాన్ని రద్దు చేయాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఆయన ఏప్రిల్‌లో కొత్త నిబంధనలు అమలులోకి రాకముందే యూకే నుంచి వెళ్లిపోయే అవకాశం ఉంది. ఆయన యూకేను వీడి సంపన్నులకు ఆకర్షణీయమైన పన్ను ప్రోత్సాహకాలను అందించే దుబాయ్, స్విట్జర్లాండ్, ఇటలీ వంటి దేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. మిట్టల్ 1995లో యూకేకు వెళ్లారు. ఫోర్బ్స్ అంచనా ప్రకారం, మిత్తల్ సంపద 14.9 బిలియన్ పౌండ్లుగా ఉంది.

గాలి జనార్దన్‌రెడ్డి కేసులో మే 6న తుది తీర్పు

హైదరాబాద్, మార్చి 28: గాలి జనార్దన్‌రెడ్డి నేతృత్వంలోని ఓబుళాపురం మైనింగ్ కంపెనీ ఇనుప గనుల అక్రమాలపై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం విచారణ శుక్రవారం ముగిసింది. మే ఆరో తేదీన తీర్పు వెలువరిస్తామని న్యాయస్థానం ప్రకటించింది. 2011లో సీబీఐ గాలి జనార్దన్‌రెడ్డిపై కేసు నమోదు చేయగా, చార్జిషీటు దాఖలు అనంతరం 13 ఏళ్లుగా ప్రత్యేక కోర్టులో విచారణ నడుస్తోంది. ఈ కేసులో నాలుగు నెలల్లో విచారణ పూర్తి చేసి తీర్పు వెల్లడించాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే న్యాయస్థానం విచారణ పూర్తి చేసింది. ఈ కేసులో గాలి జనార్దన్‌రెడ్డితో పాటు ఓఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, మరో ఐదుగురు నిందితులుగా ఉన్నారు.

ఆచార్య రంగా సమాధిని పరిరక్షించాలి

» ఏపీ ప్రభుత్వానికి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఫ్రీడం ఫైటర్స్ కాలనీలో కబ్జాదారులు ధ్వంసం చేసిన ఆచార్య రంగా సమాధిని పునరుద్ధరించామని, ఆ ప్రదేశంలో ఆచార్య రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని స్మారకచిహ్నంగా ఏపీ ప్రభుత్వం పరిరక్షించాలని రంగా ట్రస్ట్, రంగా కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో రంగాకు ప్రధాన అనుచరుడిగా ఉన్న రతిరామ్.. రంగా సమాధిని ఢిల్లీలో నిర్మించాచగా, ఇటీవల రతిరామ్ వారసులే ఆ సమాధిని ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దక్షిణ ఢిల్లీ కలెక్టర్‌గా ఉన్న తెలుగు వ్యక్తి మేకల చైతన్యప్రసాద్.. రంగా సమాధి పరిరక్షణకు, పునరుద్ధరణకు చొరవ తీసుకున్నారని శుక్రవారం రంగా ట్రస్టు సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

భూ విలయం


బ్యాంకాక్‌లో భూకంప తీవ్రతతో కుప్పకూలిన భవన సముదాయం



(మొదటి పేజీ తరువాయి)

థాయ్‌లాండ్, చైనాలోనూ విధ్వంసం సృష్టించింది. థాయ్‌లాండ్‌లో 100 మంది గల్లంతయ్యారని, డజన్ల సంఖ్యలో గాయపడ్డారని అధికార వర్గాలు తెలిపాయి. చైనా వివరాలు అసలు బయటకే రాలేదు. అయితే, మూడు దేశాల్లో కలిపి ప్రాణనష్టం శనివారం నాటికి భారీగా పెరగొచ్చని అనుమానిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు శిథిలాల్లో చిక్కుకొని ఉంటారని భావిస్తున్నారు. ముఖ్యంగా బహుళ అంతస్తులకు నిలయమైన థాయ్‌లాండ్ రాజధాని, ప్రముఖ పర్యాటక కేంద్రం బ్యాంకాక్‌లో పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం నిలువునా కూలిపోయిన దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను నిరుత్తరులను చేశాయి. అంతపెద్ద భవనం క్షణాల్లో సిమెంటు రాళ్ల, ఇనుప తీగల కుప్పగా మారింది. ఈ ఒక్క భవనంలోనే 43 మంది నిర్మాణ కార్మికులు చిక్కుకున్నారని అంటున్నారు. శిథిలాల్లో చిక్కుకుపోయిన వారి ఆర్తనాదాల వీడియోలు సోషల్ మీడియాలో తిరుగుతున్నాయి. మయన్మార్, థాయ్‌లాండ్ రెండు దేశాల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భూకంప కేంద్రం ఉన్న మయన్మార్‌లో పరిస్థితి తీవ్రంగానే ఉంది. ఐరావతి నది మీద మాండలే నగరంలో 90 ఏళ్ల క్రితం కట్టిన ప్రఖ్యాత అవా వంతెన కుప్పకూలిపోయింది. దాంతో మాండలేకు, మయన్మార్ అతిపెద్ద నగరం యాంగూన్‌కు మధ్య రాకపోకలు దెబ్బతిన్నాయి. మాండలేలో బహుళ అంతస్తుల భవనం వంగిపోవడంతో పైభాగాన స్విమ్మింగ్‌పూల్ నుంచి నీరంతా జలపాతంలా దూకే దృశ్యాలను ప్రజలు చిత్రీకరించారు. మయన్మార్ రాజధాని నేపీటాలో వెయ్యి పడకల ఆసుపత్రి కూలిపోయి 20 మంది మరణించారు. మాండలే నగరంలోని మాండలే రాజప్రాసాదం, బౌద్ధ క్షేత్రం మహాముని పగోడా పునాదులు దెబ్బతిన్నాయి. ఎవరు సాయం ఇచ్చినా స్వీకరిస్తామని మయన్మార్ ప్రభుత్వం ప్రకటించింది. బ్యాంకాక్ నగరంలో పలు హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు ముందుజాగ్రత్తగా మూసేశారు. ప్రభుత్వం కూడా పర్యాటకులు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లొద్దని సూచించింది. బ్యాంకాక్‌ను ప్రభుత్వం విపత్తు ప్రాంతంగా ప్రకటించింది. తెలుగు వారు ఎక్కువగా వెళ్లే పట్టాయా భూకంప కేంద్రానికి దూరంగా ఉండటంతో అక్కడ పెద్దగా ప్రభావం లేదు. అయితే, మరిన్ని ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. భూకంపం కారణంగా థాయ్‌లాండ్‌లో విమానాశ్రయాలు మూసేయడంతో హైదరాబాద్ విమానాశ్రయానికి వచ్చే పలు విమానాలు రద్దు అయ్యాయి. ఆ విమానాల్లో ప్రయాణించాల్సిన ప్రయాణికులు సాయంత్రం నుంచి శంషాబాద్ విమానాశ్రయంలో ఎదురు చూస్తున్నారు. భూకంప కేంద్రం ఉపరితలానికి కేవలం పది కిలోమీటర్ల లోతులో ఉండటం వల్ల నష్టం తీవ్రత అధికంగా ఉందని భావిస్తున్నారు. భూకంపం నేపథ్యంలో థాయ్‌లాండ్ స్టాక్ ఎక్స్ఛేంజీని నిలిపేశారు.

కోల్‌కతాలోనూ ప్రకంపనలు

భూప్రకంపనలు భారత్ వరకు విస్తరించాయి. కోల్‌కతా, ఇంఫాల్‌లో భవనాలు కంపించాయి. భూకంపం నష్టంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. రెండు దేశాలకు ఎలాంటి సాయం అవసరమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. మయన్మార్, థాయ్‌లాండ్ ప్రభుత్వాలతో భారత విదేశాంగ శాఖ టచ్‌లో ఉందని చెప్పారు. బంగ్లాదేశ్‌లో 7.3 తీవ్రతతో భూకంపం వచ్చింది. రాజధాని ఢాకా, చిట్టగాంగ్‌లలో ప్రకంపనలు వచ్చాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బ్యాంకాక్ సబర్బన్ ప్రాంతాల్లో 1.7 కోట్ల మంది నివసిస్తున్నారు. పర్యాటక ప్రాంతమైన బ్యాంకాక్‌లో ప్రజలంతా షాపింగ్ మాల్‌లు ఖాళీ చేసి నగరం మధ్యలో ఉన్న పార్క్‌లో పోగయ్యారు. భారతీయ పర్యాటకులు పెద్ద ఎత్తున ఉండే నగరం కావడంతో ప్రస్తుతం అక్కడే ఉన్న పర్యాటకుల బంధువులు ఆందోళనలో మునిగి పోయారు. యోగక్షేమాల కోసం ఫోన్లు ఎక్కువ కావడంతో నెట్‌వర్క్‌లు స్తంభించిపోయాయి. భారత ప్రభుత్వం భారతీయ పర్యాటకుల కోసం +66618819218 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసింది. నైరుతి చైనాలోని యునాన్ రాష్ట్రంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చైనా ప్రభుత్వం ప్రకటించింది. ప్రకంపనల భయానికి జనం ఇళ్లలోకి వెళ్లడం లేదు. మయన్మార్ సరిహద్దులోని చైనా పట్టణం జిన్హోంగ్‌లో భూమి ఒక నిమిషం పాటు కంపించిందని స్థానిక అధికారులు తెలిపారు. మయన్మార్, థాయ్‌లాండ్‌లకు కావాల్సిన మందులను పంపిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. 2004 సునామీ భూకంపం తర్వాత థాయ్‌లాండ్‌లో భూకంపాలను ఎదుర్కోవడానికి అన్ని రకాల వ్యవస్థలను సిద్ధం చేశారు. దాంతో ప్రాణనష్టం తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.


భూకంపంతో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న మయన్మార్ సైనిక నేత హ్లాయింగ్


భవన శిథిలాల్లో ఇనుప చువ్వల కింద చిక్కుకుపోయిన ఓ వ్యక్తి

బ్యాంకాక్‌లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కుటుంబం

» ఇద్దరు కుమారులు, కోడలితో పర్యటనకు వెళ్లిన ఆయన సతీమణి

» భూకంపంతో దెబ్బతిన్న వారి హోటల్

» అప్రమత్తమై హుటాహుటిన ఎయిర్‌పోర్టుకు..

హైదరాబాద్/కోల్‌సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ కుటుంబానికి బ్యాంకాక్‌లో ప్రాణాపాయం తప్పింది. అక్కడ చోటుచేసుకున్న భూకంపం నుంచి వారు సురక్షితంగా బయటపడ్డారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రాజ్‌ఠాకూర్ హైదరాబాద్‌లోనే ఉండగా.. ఆయన సతీమణి మనాలీ ఠాకూర్, పెద్ద కుమారుడు ప్రతీక్, ఆయన భార్య, చిన్న కుమారుడు నితీశ్ గురువారం బ్యాంకాక్ పర్యటనకు వెళ్లారు. శుక్రవారం అక్కడ సంభవించిన భూకంపం తాకిడికి వారు విడిది చేసిన హోటల్ దెబ్బతిన్నది. సమీపంలోని చాలా భవనాలు కూలిపోయాయి. రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ ఠాకూర్ అప్రమత్తంగా వ్యవహరించి కుటుంబ సభ్యులను బయటకు తీసుకొచ్చారు. వారంతా హుటాహుటినా బ్యాంకాక్ విమానాశ్రయానికి చేరుకున్నారు. కాగా, తమ కుటుంబ సభ్యులు క్షేమంగానే ఉన్నారని, వారు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ వెల్లడించారు.

అమెరికాకు సుంకాల తగ్గింపు ఆఫర్!

పలు అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై టారిఫ్ కోతకు భారత్ అంగీకారం

న్యూఢిల్లీ, మార్చి 28: అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. ఇతర దేశాల ఉత్పత్తులపై సుంకాల మోత మోగించడం, దానికి ప్రతిగా ఆయా దేశాలు కూడా అదే స్థాయిలో స్పందిస్తుండడం చూశాం. అయితే ఇందుకు భిన్నంగా భారత్ ముందుకు వెళుతోంది. తాజాగా ఆ దేశానికి మరింత రాయితీ కల్పిస్తూ.. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు బాదం, క్రాన్‌బెర్రీస్ వంటి వాటి దిగుమతులపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించినట్లు తెలిసింది. ఈ మేరకు రెండు దేశాల ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. దీనిపై దక్షిణ, మధ్య ఆసియాకు అమెరికా ట్రేడ్ ప్రతినిధిగా ఉన్న బ్రెండెన్ లించ్‌తో ఢిల్లీలో జరిగిన వరుస సమావేశాల్లో చర్చలు జరిగినట్లు తెలిసింది. బోర్బన్ విస్కీతో పాటు బాదం, వాల్‌నట్స్, క్రాన్‌బెర్రీస్, పిస్తా, కాయధాన్యాలు వంటి వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇది వచ్చే వారం ట్రంప్ నిర్ణయించిన పరస్పర సుంకాలను తప్పించడంపై ఆశాభావాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, గత నెల బోర్బన్ విస్కీపై సుంకాన్ని భారత్ 150 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఇక క్రాన్‌బెర్రీస్, బాదం, వాల్‌నట్స్‌పై సుంకాలు 30 నుంచి 100 శాతం వరకు ఉండగా, కాయధాన్యాలపై 10 శాతం వరకు ఉన్నాయి. చైనా, కెనడా, ఈయూ వంటి దేశాల మాదిరిగా కాకుండా భారత్ మాత్రం.. ట్రంప్‌ను ప్రసన్నం చేసుకొనేందుకు చురుకుగా ప్రయత్నిస్తోందని, 23 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై సగానికి పైగా సుంకాలను తగ్గించేందుకు సిద్ధంగా ఉందని రాయిటర్స్ ఇటీవల పేర్కొంది.

కేంద్ర ఉద్యోగులకు డీఏ 2% పెంపు

పెన్షనర్లకు డీఆర్ కూడా.. కేంద్ర క్యాబినెట్ నిర్ణయం



» ఖరీఫ్‌లో ఫాస్పేట్, పొటాష్ ఎరువులపైరూ.37,216 కోట్ల సబ్సిడీ

న్యూఢిల్లీ, మార్చి 28: కేంద్ర మంత్రివర్గం కేంద్ర ప్రభుత్వోద్యోగులకు, పెన్షనర్లకు శుభవార్త ప్రకటించింది. వారికి కరువు భత్యం (డీఏ), డీఎఫ్‌లను రెండు శాతం పెంచే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన శుక్రవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ దీనితో పాటు మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుందని రైల్వే, సమాచారప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులు, పెన్షనర్ల మౌలిక వేతనం/పింఛనులో డీఏ, డీఆర్ 53 శాతంగా ఉన్నాయని.. ఇప్పుడవి 55 శాతానికి పెరిగినట్లు చెప్పారు. ఏడో వేతన సంఘం సిఫారసుల ఆధారంగా.. ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి పెంపు అమల్లోకి వస్తుంది. దీనివల్ల 48.66 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులు, 66.55 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందుతారని తెలిపారు. ఎనిమిదో వేతన కమిషన్ ఏర్పాటుకోసం ఎదురుచూస్తున్న వీరికి ఇప్పుడు వేతనాలు, పెన్షన్లు పెరుగుతాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే ఈ పెంపు కారణంగా కేంద్ర ఖజానాపై ఏటా రూ.6,614.04 కోట్ల భారం పడుతుందని మంత్రి చెప్పారు. కాగా.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులపై రూ.37,216 కోట్ల సబ్సిడీ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. డీఏపీ ఎరువుల ప్రస్తుత రిటైల్ ధరలు యథాతథంగా కొనసాగుతాయి. రూ.22,919 కోట్లతో నాన్-సెమీకండక్టర్ ఎలక్ట్రానిక్స్ పరికరాలకు ఉత్పాదక ఆధారిత రాయితీ (పీఎల్ఐ) స్కీంను కూడా మంత్రివర్గం ఆమోదించింది. ఈ పరిశ్రమ ఎంతకాలంగానో ఈ నిర్ణయం కోసం ఎదురుచూస్తోందని, ఈ ప్యాకేజీ ఆరేళ్ల అమల్లో ఉంటుందని వైష్ణవ్ చెప్పారు. బిహార్లో అత్యంత కీలకమైన కోసీ మేచీ అంతర్గత అనుసంధాన ప్రాజెక్టును కూడా కేబినెట్ ఆమోదించింది. ప్రధానమంత్రి కృషి సించయీ యోజన-సత్వర సాగునీటి లబ్ధి పథకం (ఏఐబీపీ) కింద దీనికి ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ పథకం అంచనా వ్యయం రూ.6,282.32 కోట్లు కాగా.. కేంద్రం బిహార్‌కు రూ.3,652.56 కోట్లు అందిస్తుంది. సాగునీరు, వరద నిర్వహణ కోసం ఇప్పుడున్న తూర్పు కోసి ప్రధాన కాలువను ఆధునికీకరించి.. కోసి నదిలో మిగులు జలాలను మహానంద బేసిన్‌లో సాగునీటి అవసరాలకు మళ్లించడం దీని ప్రధానోద్దేశం. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే నేపాల్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు వైష్ణవ్ వెల్లడించారు. 2029నాటికి పథకం పూర్తవుతుందని, అరారియా, పూర్ణియా, కిషన్‌గంజ్, కటిహార్ జిల్లాల్లో 2.10 లక్షల హెక్టార్లకు అదనంగా సాగునీరు అందుతుందని చెప్పారు.

డీఏ బకాయిలు ఏప్రిల్ వేతనంలో!

పెరిగిన డీఏ/డీఆర్ బకాయిలను ఏప్రిల్ నెల వేతనంతో కలిపి అందిస్తారు. డీఏ పెంపుతో ఉద్యోగుల వేతనాలు పెరుగనున్నాయి. ఉదాహరణకు.. రూ.18 వేల మౌలిక వేతనం కలిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి (ఈ ఏడాది జనవరి 1 నుంచి) ఇక ప్రతి నెలా రూ.360 పెరుగుతుంది. 18 వేల మౌలిక వేతనం, నెలనెలా రూ.30 వేల జీతం పొందుతున్న ఉద్యోగికి ఇక డీఏ కింద రూ.9,900 అందుతుంది.

156 ప్రచండ్ హెలికాప్టర్ల కొనుగోలుకు ఓకే

భారత సైన్యం, వాయుసేన కోసం 156 తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ల (ప్రచండ్)ను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) నుంచి కొనుగోలు చేసేందుకు శుక్రవారం భద్రతా వ్యవహారాల కేంద్ర క్యాబినెట్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన డీల్ విలువ రూ.62,000 కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు హెచ్ఏఎల్‌కు ఇదే అతిపెద్ద ఆర్డరు కావడం గమనార్హం. ఈ హెలికాప్టర్లను హెచ్ఏఎల్.. కర్ణాటకలోని బెంగళూరు, తుంకుర్ ప్లాంట్లలో తయారు చేయనుంది. ఇక 156 హెలికాప్టర్లలో 90 భారత సైన్యానికి, మిగతావి భారత వైమానిక దళానికి కేటాయించనున్నారు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో కార్యకలాపాల కోసం వీటిని వినియోగించనున్నారు. ఇంత భారీ స్థాయి ఆర్డరును ఇవ్వడం వల్ల దేశంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడుతుందని రక్షణ రంగ వర్గాలు చెబుతున్నాయి. ప్రచండ్ 5వేల మీటర్ల ఎత్తులో అలవోకగా లాండింగ్, టేక్ ఆఫ్ కాగలదు.

2 లక్షల మంది మహిళా కెప్టెన్లతో..
దేశవ్యాప్తంగా 'పింక్ ర్యాపిడో'

న్యూఢిల్లీ, మార్చి 28: దేశంలోనే అతి పెద్ద బైక్-ట్యాక్సీ ప్లాట్‌ఫామ్ ర్యాపిడో.. తన 'పింక్ మొబిలిటీ' పథకాన్ని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు సిద్ధమైంది. దీని ద్వారా వచ్చే మూడేళ్లలో 2 లక్షల మంది మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని సృష్టించడంతోపాటు, మహిళా ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని కల్పించడమే తమ లక్ష్యంగా పేర్కొంది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు.. ఆజాద్ ఫౌండేషన్, సఖా కన్సల్టింగ్ వింగ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మూడు సంస్థలూ కలిసి.. ప్రొఫెషనల్ డ్రైవింగ్ నైపుణ్యాలు కలిగిన మహిళలకు బైక్ కొనుగోలు, రిజిస్ట్రేషన్ వంటివాటిలో సహాయం చేస్తాయి. వారికి సేఫ్టీ ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు.. తరచుగా వర్క్‌షాపులు నిర్వహిస్తూ పలు అంశాలపై అవగాహన కల్పించనున్నాయి. ఈ పథకంలో చేరే మహిళలకు నెలకు రూ.25 వేల దాకా సంపాదించుకునే అవకాశం కల్పించడం ద్వారా వారి దీర్ఘకాల ఆర్థికభద్రతకు భరోసానివ్వడమే తమ లక్ష్యమని ర్యాపిడో చీఫ్ ఆఫ్ స్టాఫ్ శ్రావ్య రెడ్డి తెలిపారు. 'పింక్ ర్యాపిడో' సేవలను తొలుత చెన్నైలో ప్రారంభించిన ర్యాపిడో సంస్థ.. తర్వాత వాటిని హైదరాబాద్, ఢిల్లీ నగరాలకు విస్తరించింది. చెన్నైలో దాదాపు 350 మంది మహిళా కెప్టెన్లు (రైడర్లు) ఉండగా.. హైదరాబాద్‌లో 220 మంది, ఢిల్లీలో 170 మంది మహిళా రైడర్లు 'పింక్ ర్యాపిడో' ద్వారా ఉపాధి పొందుతున్నారు. కర్ణాటకలో కూడా ఈ సేవలను అందించేందుకు ర్యాపిడో కిందటి నెలలో ప్రయత్నాలు ప్రారంభించింది. 2025 చివరికల్లా కర్ణాటకలో 25 వేల మంది మహిళలకు 'పింక్ ర్యాపిడో' ద్వారా ఉపాధి కల్పించాలన్నది తమలక్ష్యంగా ఆ సంస్థ ప్రకటించింది.

డబ్ల్యూటీవోకు నిధులు నిలిపివేసిన అమెరికా

న్యూఢిల్లీ, మార్చి 28: ప్రపంచ వాణిజ్య సంస్థకు (డబ్ల్యూటీవో) అమెరికా నుంచి వెళ్లే నిధులను నిలిపివేసినట్లు ట్రేడ్ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ నివేదించింది. ప్రభుత్వ వ్యయాలను తగ్గించుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అమెరికా పలు ప్రపంచ సంస్థల నుంచి తప్పుకుంటూ వస్తోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో డబ్ల్యూహెచ్‌వో) నుంచి వైదొలుతున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. 2024లో డబ్ల్యూటీవో వార్షిక బడ్జెట్ 23.2 కోట్ల డాలర్ల బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో అమెరికా 11% నిధులు సమకూరుస్తుంది. కాగా, స్వదేశంలో కోడిగుడ్ల ధరలను అదుపులోకి తెచ్చేందుకు అమెరికా ప్రపంచ వ్యాప్తంగా వాటి అన్వేషణలో పడింది! జర్మనీ, ఇటలీ, పోలాండ్, స్వీడన్ తదితర దేశాలను అమెరికా వ్యవసాయ శాఖ తమకు అర్జెంటుగా గుడ్లను సరఫరా చేయాలని కోరింది. కాగా అమెరికాలో బర్డ్ ఫ్లూ ప్రబలడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని యూరోపియన్ పరిశ్రమల వర్గాలు తెలిపాయి.



గుంటూరు యార్డులో రైతులే మిర్చిని అమ్మాలి

▸ ఏ రాష్ట్రమైనా వ్యాపారులకు అవకాశం లేదు: మంత్రి అచ్చెన్న

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చి యార్డులో రైతులే అమ్ముకోవాలని, ఇతర రాష్ట్రాల వ్యాపారులు, మధ్యవర్తుల సరుకును అనుమతించవద్దని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుని, వారి సమస్యలపై దృష్టి పెట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో మిర్చి రైతుల సమస్యలపై వ్యవసాయ, మార్కెటింగ్, బ్యాంకు అధికారులు, కోల్డ్‌స్టోరేజీల యజమాన్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గుంటూరు మిర్చి యార్డుకు ఇతర రాష్ట్రాల వ్యాపారులు పెద్ద మొత్తంలో సరుకు తెచ్చి అమ్ముతుండటంతో, ఇక్కడి రైతులకు సరైన ధర రావట్లేదనే వాదన ఉందని చెప్పారు. పక్క రాష్ట్రాల రైతులు మిర్చిని తెచ్చి అమ్ముకోవటానికి అభ్యంతరం లేదన్నారు. కర్ణాటక నుంచి మిర్చిని తెచ్చి, గుంటూరు యార్డులో అమ్ముకునే వ్యాపారులను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ మిర్చిని కొనుగోలు చేసిన వ్యాపారులైనా ఇక్కడ అమ్మడానికి లేదని, రైతులు మాత్రమే అమ్ముకునే చూడాలన్నారు. జగ్గయ్యపేట కోల్డ్‌స్టోరేజ్‌కి యాజమాన్యం బీమా కట్టకపోవడం వల్ల మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఆ నష్టాన్ని యాజమాన్యం భరించాలని మంత్రి చెప్పారు. కోల్డ్‌స్టోరేజ్‌లు బీమాను పునరుద్ధరించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కోల్డ్ స్టోరేజ్‌ల్లో మిర్చి, ఇతర పంటలు నిల్వ చేసినప్పుడు బ్యాంకర్లు రుణాలివ్వకుండా రైతుల్ని ఇబ్బంది పెట్టవద్దని, సకాలంలో రీషెడ్యూల్ చేయాలని కోరారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాల్లో సకల సౌకర్యాలతో ఒక్కో ఆధునిక రైతుబజారు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ అధికారులను మంత్రి అచ్చెన్న ఆదేశించారు.

51 మండలాల్లో కరువు: సిసోడియా

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 51 మండలాలు కరువుబారిన పడ్డాయని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా వెల్లడించారు. శుక్రవారం ఇక్కడి విపత్తు నిర్వహణా సంస్థ కార్యాలయంలో కరువు ప్రభావ అంచనా కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్లు ఇచ్చిన నివేదికల ఆధారంగా 51 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నట్లు సిసోడియా చెప్పారు. కలెక్టర్ల నివేదికలను నిశితంగా పరిశీలించిన తర్వాత త్వరలో కరువు మండలాల జాబితాను ప్రకటించడంతోపాటు సహాయ చర్యలపై స్పష్టత ఇస్తామని తెలిపారు. సమావేశంలో విపత్తు నిర్వహణ డైరెక్టర్ కూర్మనాథ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' వేతనం ఇక రూ.307

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉపాధి పథకం కూలీల వేతనాలను రూ.300 నుంచి రూ.307లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఉపాధి కూలీల వేతనాలను పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం.. ఏపీలో గత ఏడాదితో పోలిస్తే వేతనం రూ.7 పెరిగింది. కేంద్రం ప్రతి ఏటా ఆయా రాష్ట్రాల ప్రజల కొనుగోలు శక్తి, ధరల ఆధారంగా వేతనాలను నిర్ణయిస్తుంది.

మాల సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకం

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాల సంక్షేమ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ జాబితాలో దానం లాజర్‌బాబు (పిఠాపురం నియోజకవర్గం), పొన్నా యుగంధర్ (గంగాధర నెల్లూరు), సి.బాబు (చిత్తూరు), కొనకారి కమలమ్మ (తాడిపత్రి), పురిమిట్ల కుమారి (తిరుపతి), బండ్లమూడి బాబురావు(పొన్నూరు), చెల్లి అశోక్ (ముమ్మిడివరం), రాజేశ్వరరావు (గన్నవరం), కొల్లాబత్తుల అప్పారావు (కాకినాడ రూరల్), దాసరి ఆంజనేయులు (ఏలూరు), రవికుమార్ (కర్నూలు), కొంద్రు మరిదియ్య (నర్సీపట్నం), బోనెల అప్పారావు (ఆముదాలవలస), మద్దా మణి (రాజమండ్రి రూరల్), సబ్బవరపు గణేష్ (అనకాపల్లి నియోజకవర్గం) ఉన్నారు. వీరు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.

30, 31 తేదీల్లోనూ ఆస్తి పన్ను కట్టొచ్చు!

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపు కోసం మున్సిపల్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 30, 31 తేదీల్లో కూడా పన్ను చెల్లింపు కౌంటర్లు పనిచేయనున్నాయి. మార్చి 31 వరకే గడువు ఉండటంతో పన్ను బకాయిల చెల్లింపునకు వీలుగా మున్సిపల్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు కౌంటర్లు పనిచేయనున్నాయి.

డిస్కమ్‌ల బలోపేతానికి నేడు జాతీయ సమావేశం

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జాతీయంగా విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)ల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర పునరుద్పాదక విద్యుత్ శాఖ మంత్రి శ్రీపాద యశోనాయక్ అధ్యక్షతన సమావేశం జరగనుంది. శనివారం లఖ్‌నవూలో జరిగే ఈ భేటీలో రాష్ట్ర ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొంటారు. డిస్కంలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్రం తీసుకువచ్చిన 'రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టమ్' (ఆర్డీఎస్ఎస్) ద్వారా ఆర్థిక సాయం అందుతున్నా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. దీంతో ఏపీ సహా పది రాష్ట్రాల ఇంధన మంత్రులతో కమిటీని వేశారు. ఈ కమిటీకి కేంద్ర మంత్రి శ్రీపాద యశోనాయక్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కమిటీ నెలకిందట అహ్మదాబాద్‌లో సమావేశమైంది. ఆ సమావేశంలో మంత్రి గొట్టిపాటి వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నారు. తదుపరి భేటీకి వ్యక్తిగతంగా రావాలని యశోనాయక్ కోరడంతో శనివారం నాటి సమావేశానికి గొట్టిపాటి హాజరవుతున్నారు.

అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్ బాధితుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడంతోపాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తామని సీఎస్ హామీ ఇచ్చారని న్యాయవాది ముప్పాళ్ల నాగేశ్వరరావు మీడియాకు తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై సీఎస్ శుక్రవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఎస్పీ ఈశ్వర్, ఆర్థిక సలహాదారు సి.కుటుంబరావు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈవీ నాయుడు, వి.తిరుపతిరావు, ఉప ప్రధాన కార్యదర్శి బి.వి.చంద్రశేఖర్, సూర్యనారాయణ, జగన్ తదితరులు పాల్గొన్నారు. సమస్య పరిష్కారానికి గత 9 నెలలుగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, సీఐడీ తీసుకున్న చర్యలను రవిశంకర్ వివరించారు. కాలపరిమితితో కూడిన నిర్ణయాలు తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు కోరారు.

ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 710 కోట్లు!

▸ ప్రభుత్వ గ్యారెంటీతో రుణం

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఏపీపీఎఫ్‌సీఎల్) రూ.710 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఈ నిధులను గతంలో చేసిన అప్పులకు వడ్డీ కింద చెల్లించేందుకు వినియోగించనుంది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) నుంచి తీసుకునే ఈ రుణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హడ్కో నుంచి ఏపీపీఫ్‌సీఎల్ రుణం తీసుకుంది. దీనికి సంబంధించిన వడ్డీ, కొంత మేరకు అసలు చెల్లించేందుకు వీలుగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.710 కోట్ల రుణాన్ని తీసుకోనుంది.

బోగస్ ఇన్వాయిస్‌లతో 42.73 కోట్ల ఇన్‌పుట్ క్రెడిట్

▸ విజయవాడలో జీఎస్టీ కన్సల్టెంట్ అరెస్టు

విశాఖపట్నం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకూ తప్పుడు ఇన్వాయిస్‌లు సృష్టించి ఇన్‌పుట్ క్రెడిట్ పొందిన వ్యాపారులను పట్టుకుంటున్న విశాఖపట్నం జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు... ఈసారి విజయవాడలో ఒక జీఎస్టీ కన్సల్టెంటే తన క్లయింట్ల పేరుతో బోగస్ ఇన్వాయిస్‌లు పెడుతున్నట్టు గుర్తించి అరెస్టు చేశారు. ఆయన ఎవరికీ సరుకులు సరఫరా చేయకుండానే.. చేసినట్టు ఇన్వాయిస్‌లు పెట్టి జీఎస్టీ రిటర్న్‌లు సమర్పించారు. సుమారు రూ.42.73 కోట్ల బోగస్ ఇన్వాయిస్‌లు వేశారు. వాటి ద్వారా ప్రభుత్వం నుంచి రూ.6.51 కోట్ల ఇన్‌పుట్ క్రెడిట్ పొందారు. ఆధారాలతో నిందితుడిని పట్టుకున్న ఇంటెలిజెన్స్ అధికారులు విశాఖ ఆర్థిక నేరాల కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు విశాఖ జోనల్ యూనిట్ జాయింట్ డైరెక్టర్ శివకృష్ణ కుంభా తెలిపారు.



రాష్ట్రంలో వాటర్ ఎయిర్‌పోర్టులు!

విజయవాడ, శ్రీశైలం, విశాఖలో ఏర్పాటు యోచన..అధ్యయనానికి ఆర్ఎఫ్‌పీలు ఆహ్వానించిన ఏపీఏడీసీ

అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా సీప్లేన్ సేవలను అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. దీనికోసం అవసరమైన వాటర్ ఎయిర్ పోర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటోంది. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ, శ్రీశైలం జలాశయం, నాగార్జున సాగర్‌తోపాటు విశాఖపట్నం సముద్ర తీరప్రాంతంలోనూ వాటర్ ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయవచ్చని రాష్ట్ర ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఏడీసీ) సీఎం చంద్రబాబుకు ప్రతిపాదనలు సమర్పించింది. సీప్లేన్ సేవలు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతాల్లో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని, తద్వారా రాష్ట్రానికి ఆదాయంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో వాటర్ ఎయిర్‌పోర్టుల ఏర్పాటులో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఏపీఏడీసీకి ముఖ్యమంత్రి సూచించారు. సీఎం ఆదేశాల మేరకు ఇప్పటికే ఏపీఏడీసీ అధికారులతో మంత్రి బీసీ జనార్దనరెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం వాటర్ ఎయిర్ పోర్టుల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు ఆసక్తి కలిగిన సంస్థల నుంచి ఏపీఏడీసీ.. రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)ను ఆహ్వానించింది. వాటిని ఏప్రిల్ 3వ తేదీలోగా సమర్పించాలని కోరింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం పొందిన సంస్థలు మాత్రమే.. ఆర్ఎఫ్‌పీలు సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ నివేదికలను పరిశీలించాక వాటర్ ఎయిర్ పోర్టుల స్థాపనపై తుది నిర్ణయం తీసుకుంటామని ఏపీఏడీసీ చెబుతోంది.

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

30 శాతం కన్నా అధికం. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త సాంకేతికతలో విద్యార్థులు ముందుండాలి" అని ఆయన సూచించారు. 1991 ఆర్థిక సంస్కరణల ప్రభావాన్ని గుర్తు చేస్తూ.. "సంస్కరణలు భారత ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఆర్థిక సంస్కరణలతో చైనా ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. టెలికాం రంగంలో అనేక మార్పులు వచ్చాయి. ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్, వీఎస్ఎన్ఎల్ ఆధిపత్యం ఉండేది. సంస్కరణలు రావడంతో ప్రైవేటు సంస్థలు కూడా టెలికాం రంగంలోకి వచ్చాయి. ఇదొక గేమ్ చేంజర్ అయింది. ప్రస్తుతం ప్రపంచం చూపు మన దేశం వైపు మళ్లింది. రాబోయే రోజులన్నీ భారత్‌వే." అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

గట్టి కృషి చేస్తే మనమే నం.1

"1995లో సీఎం అయ్యాక బిల్‌గేట్స్‌ను కలిసేందుకు ప్రయత్నించాను. అయితే, రాజకీయ నేతలతో ఆయనకు సత్సంబంధాలు లేవు. కలవడం కుదరదని ఆయన తిరస్కరించారు. అయినా నేను గట్టిగా ప్రయత్నించి, భేటీకి ఆయనను ఒప్పించి దాదాపు 45 నిమిషాలు మాట్లాడాను. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టాలని బిల్‌గేట్స్‌ను ఆనాడు కోరాను. ఇప్పుడు అదే మైక్రోసాఫ్టకు తెలుగు వ్యక్తి సత్య నాదెళ్ల సీఈవోగా ఉన్నారు. 2014లో భారత్ పదో ఆర్థిక వ్యవస్థగా ఉండేది. అది ఇప్పుడు ఐదవ స్థానానికి ఎగబాకింది. మనమంతా గట్టి కృషి చేస్తే ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుంది".


అక్కడ తెలుగు, తమిళులే అధికం..

"భారత్‌కు జనాభా గొప్ప వరంలాంటిది. మన దేశానికి ఇంకో నలభయ్యేళ్లదాకా జనాభా సమస్య ఉండదు. దక్షిణ భారతదేశంలో కూడా జనాభాను పెంచాల్సి వుంది. అమెరికాలో అత్యధిక తలసరి ఆదాయం మన దేశీయులదే. అక్కడి ధనిక ప్రాంతాల్లో తెలుగు, తమిళ వాసులే అధికంగా ఉన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో భారతీయులు ముందుంటారు. అందుకే సిలికాన్ వ్యాలీ, నాసా, వాల్ స్ట్రీట్‌లలో మనవారిదే ఆధిపత్యం".

గ్రీన్ ఎనర్జీలో మనదే అగ్రస్థానం

"గ్రీన్ ఎనర్జీలో ఏపీ ఆధిపత్యాన్ని సాధించింది. ఈ రంగంలో అన్ని రాష్ట్రాల కంటే ముందుంది. భవిష్యత్తులో ఏపీ రెండు రూపాయలకే యూనిట్ విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. భారత్ మొత్తం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకోగా, ఇందులో 160 గిగావాట్లు ఒక్క ఏపీలోనే ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించాం. గ్రీన్ ఎనర్జీలో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టి 7.5 లక్షల ఉద్యోగాల సాధనే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ యూనిట్ స్థాపిస్తోంది. రిలయన్స్ బయో ఎనర్జీ ప్రాజెక్టులో పెట్టుబడులు పెడుతోంది. రాబోయే రెండేళ్లలో 20 లక్షల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేస్తున్నాం." అని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐటీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి చంద్రబాబును పరిచయం చేస్తూ....సైబరాబాద్ అభివృద్ధికి దార్శనికుడని అభివర్ణించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు చంద్రబాబు సమాధానమిచ్చారు.





ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన ఆలిండియా రీసెర్చ్ స్కాలర్స్ సదస్సుకు హాజరైన ప్రతినిధులు, మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

పవన్‌కల్యాణ్, బాలకృష్ణ బాగానే ఉన్నారు

▸ విద్యార్థులతో బాబు సరదా సంభాషణ

పరిశోధక విద్యార్థుల కోరిక మేరకు చంద్రబాబు చివరిలో తెలుగులో ప్రసంగించారు. తెలుగువారు ఎక్కడ ఉన్నా జన్మభూమిని, కర్మభూమిని మరువకూడదని సూచించారు. వెంటనే విద్యార్థులు 'తెలుగుదేశాన్ని మరువం సార్' అని అనగా, చంద్రబాబు పెద్దగా నవ్వారు. "తెలుగుదేశాన్ని తప్పకుండా గుర్తుంచుకోండి. మంచి రాజకీయ పార్టీ బలంగా ఉంటేనే ప్రజలకు మంచి పథకాలు అమలు చేయగలుగుతాం' అని వ్యాఖ్యానించారు. 25 యేళ్లకు ముందు జనాభా నియంత్రణ ఉండేదని, ప్రస్తుతం జనాభా నిర్వహణ తెరమీదికి వచ్చిందని పేర్కొన్నారు. తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగానే అమలు చేశాయని, ప్రస్తుతం జనాభా నిర్వహణపై అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండకపోతే ఉత్తరాది రాష్ట్రాలు జనాభాలో ఉన్నతస్థితికి చేరుకుని ఉత్తరాదివారంతా దక్షిణాది రాష్ట్రాలకు వలసగా వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. చంద్రబాబు తెలుగు ప్రసంగాన్ని ముగించేందుకు సిద్ధమవుతుండగా 'వాట్ ఎబౌట్ పవన్, బాలయ్య సార్' అంటూ కొంతమంది విద్యార్థులు కేకలేశారు. ఇందుకు చంద్రబాబు చిరునవ్వులు చిందిస్తూ.. 'పవన్ కల్యాణ్, బాలకృష్ణ బాగానే ఉన్నారు' అంటూ సమాధానమిచ్చారు. ఆ తర్వాత 'అందరికీ వణక్కం' అంటూ చంద్రబాబు ప్రసంగం ముగించారు.

ఐఐటీఎంలో తెలుగు హవా..

ఐఐటీ మద్రాస్ చాలా విషయాల్లో మొదటి స్థానంలో ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. "వివిధ రకాల ఆన్‌లైన్ కోర్సులు ఐఐటీఎం అందిస్తోంది. కొత్త ఆవిష్కరణలు, అగ్నికుల్ కోస్మోస్, మైండ్‌గ్రో టెక్నాలజీస్ వంటి స్టార్టప్‌లలో ఈ సంస్థ చేపట్టిన నూతన పరిశోధనలు దేశాన్ని అంతరిక్షం, సెమీ కండక్టర్ రంగాల్లో ముందుండేలా చేస్తున్నాయి. ఇక్కడి స్టార్టప్‌లు దాదాపు 80 శాతం విజయం పొందాయి. ఇక్కడ తెలుగు రాష్ట్రాల విద్యార్థులు 40 శాతం దాకా ఉన్నారు" అని సీఎం పేర్కొన్నారు.

పుస్తకాలకు 'టెండర్'!

▸ గైడ్‌లు ముద్రించే పబ్లిషర్లకే ఎక్కువ వర్క్

▸ చిన్న ముద్రణదారుల ఉపాధిపై చావుదెబ్బ

▸ ఆరోపణలున్న పబ్లిషర్లకూ అవకాశం

▸ పాఠశాల విద్యాశాఖ తీరుపై విమర్శలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



అనుకున్నంతా అయింది. విక్రయ పాఠ్యపుస్తకాల టెండర్లలో సింహభాగం గైడ్‌లు ముద్రించే కంపెనీలే దక్కించుకున్నాయి. రాబోయే రెండు విద్యా సంవత్సరాలకు సేల్ బుక్స్ టెండర్లు తాజాగా ఖరారయ్యాయి. మొత్తం 7 పబ్లిషింగ్ సంస్థలు టెండర్లలో అర్హత సాధించగా వాటిలో ఐదు సంస్థలు గైడ్లు ముద్రించేవే. 4, 9 తరగతులు విశాలాంధ్రకు, 1, 2, 10 తరగతులు వీజీఎస్‌కు, 6వ తరగతి ప్రజాశక్తి బుక్‌హౌస్‌కు, 3, 5, 7 తరగతులు ఎస్ఆర్‌కు, 8వ తరగతి శిరిడీ, విజయవాణి పబ్లిషర్లకు దక్కాయి. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తామని ప్రభుత్వం చెబుతుంటే పాఠశాల విద్యాశాఖ విధించిన నిబంధనలతో చిన్న ప్రింటర్లు ఈ టెండర్లకు అర్హత సాధించలేకపోయాయి. పాఠ్యపుస్తకాల ముద్రణలో గైడ్‌లు ముద్రించే ప్రింటర్లు, ప్రచురణకర్తల(పబ్లిషర్ల)ను మొదటినుంచీ దూరంగా ఉంచుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే కంటెంట్‌ను వాడుకోకూడదని నిబంధనలున్నా వాటిని ఉల్లంఘించి మరీ ఈ కంపెనీలు గైడ్‌లు రూపొందిస్తున్నాయి. తొలుత గైడ్‌లు విక్రయించి, తర్వాతే పాఠ్యపుస్తకాలు అమ్మకానికి పెడుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఫలితంగా ఎక్కువమంది విద్యార్థులు పాఠ్యపుస్తకాలకు బదులు ఆయా కంపెనీల స్టడీ మెటీరియళ్లు, గైడ్‌లు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావంతో పాటు ప్రభుత్వానికి వచ్చే రాయల్టీ కూడా తగ్గిపోతోంది. ఈ కారణాలతో కొన్నేళ్లుగా ఈ కంపెనీలకు పాఠ్యపుస్తకాల కాంట్రాక్టు ఇవ్వడం లేదు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఓ సలహాదారు ఒత్తిడితో గైడ్‌లు ముద్రించే సంస్థలకూ అవకాశం కల్పించారు. అలా అవకాశం పొందిన ఓ కంపెనీ ప్రభుత్వ కంటెంట్‌తో స్టడీ మెటీరియల్ తయారుచేసుకుని అమ్ముకుంది. అది అప్పట్లో పెద్ద వివాదమైంది. అదే కంపెనీకి ఇప్పుడు కూడా అవకాశం లభించింది!

చిన్న ప్రింటర్లు దూరం

రాష్ట్రంలో 50కిపైగా ప్రింటింగ్ కంపెనీలున్నాయి. వాటిలో ఐదారు మాత్రమే పెద్దవి కాగా, మిగిలినవన్నీ చిన్న, మధ్య తరగతి కంపెనీలే. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఇటీవల పాలసీ తీసుకొచ్చింది. పాఠశాల విద్యాశాఖ దానిని పట్టించుకోలేదు. చిన్న కంపెనీలు టెండర్లలోకి రాకుండా కఠిన నిబంధనలు పెట్టింది. ఇప్పటి వరకూ గత మూడేళ్లలో ఏదైనా ఒక ఏడాదిలో రూ.5కోట్ల టర్నోవర్ ఉండాలనే నిబంధన ఉండగా, ఇప్పుడు గత మూడేళ్లలో ప్రతి సంవత్సరం రూ.10కోట్ల టర్నోవర్ ఉండాలన్నారు. గత మూడేళ్లలో కచ్చితంగా రెండేళ్లు పాఠ్యపుస్తకాలు ముద్రించి ఉండాలనే నిబంధన కూడా విధించడంతో చిన్న కంపెనీలు టెండర్లకు పూర్తిగా దూరమైపోయాయి. అందరూ ఊహించినట్లే గైడ్లు ముద్రించే కంపెనీలు తెరపైకి వచ్చాయి. ఇప్పుడు వారికే పెద్దమొత్తంలో వర్క్‌లు లభించాయి. దీంతో పాఠశాల విద్యాశాఖ తీరుపై విమర్శలు వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ విధానాలనే ఎలా కొనసాగిస్తారని చిన్న ప్రింటర్లు ప్రశ్నిస్తున్నారు.

ఇంధన రంగంలో సంస్కరణలు

▸ సీఎస్ విజయానంద్‌తో నీతి ఆయోగ్ బృందం చర్చ



అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఇంధన రంగంలో తీసుకురానున్న సంస్కరణలను నీతి ఆయోగ్ ప్రతినిధి బృందానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె. విజయానంద్ వివరించారు. విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన భేటీలో ఖర్చు తగ్గించడంతోపాటు సమర్థవంతమైన ఇంధన పరివర్తన కోసం వ్యూహాత్మక ప్రణాళికల రూపకల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. 2047 నాటికి రాష్ట్రంలో నికర సున్నా లక్ష్యాలను(నెట్‌జీరో టార్గెట్స్) సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. '2024-ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ' కింద 160 గిగావాట్లకు మించి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. దానిలో భాగంగా సౌర, పవన విద్యుదుత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించి పలు ప్రాజెక్టులు నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఖర్చు-సమర్థ ఇంధన పరివర్తనను సాధించడంలో ఏపీకి మద్దతు ఇవ్వడానికి నీతి ఆయోగ్ ముందుకు వచ్చింది. అదేవిధంగా 2027 నాటికి రాష్ట్రం నెట్ జీరో లక్ష్య సాధనకు చేరుకోవడానికి వీలుగా మద్దతు ఇచ్చేందుకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు నీతి ఆయోగ్ బృందం అంగీకరించింది.

నిమ్స్‌లో ఏపీ చిన్నపిల్లలకూ ఉచిత గుండె చికిత్సలు

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని చిన్నపిల్లలకు కూడా గుండె చికిత్సలు ఉచితంగా అందిస్తున్నట్లు హైదరాబాద్‌లోని ఆ ఆస్పత్రి కార్డియోథెరాసిక్ విభాగం వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి అనుమతి పత్రాలు ఉంటే అన్ని వర్గాల పిల్లలకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు ప్రకటించారు. నిమ్స్‌లో పిల్లలకు గుండె పరీక్షలు, శస్త్రచికిత్సలు చేయరని చాలా మందికి అనుమానాలు ఉన్నాయని, వారి సందేహాలను నివృత్తి చేయడానికి ప్రత్యేకంగా అవగాహన చేపట్టినట్లు డాక్టర్ ప్రవీణ్ వివరించారు. తెలంగాణలోని రోగులకు తల్లిదండ్రుల ఆధార్ కార్డు, రోగి జనన ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు ఉంటే సరిపోతుందని, ఆంధ్రప్రదేశ్‌వాసులు అక్కడి ఆధార్ కార్డు, సీఎంఆర్ఎఫ్ లేఖ తెచ్చినా చికిత్స అందిస్తామని చెప్పారు. నిమ్స్ పాత భవనంలోని మొదటి అంతస్తు ఆరో నెంబరు వార్డు వద్ద పీడియాట్రిక్ కార్డియాక్ ఐసీయూ కింద ఉచితంగా పీడియాట్రిక్ కార్డియాక్ శస్త్రచికిత్స సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో వినహా ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాక్టర్ అమరేష్ రావు మార్గదర్శకంలో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గోపాల్ అందుబాటులో ఉంటారని వివరించారు. ఇతర వివరాలకు 7893337836 నంబర్‌కు ఫోన్ చేయాలని డాక్టర్ ప్రవీణ్ తెలియజేశారు.



తేనెతుట్టె కదిలి.. మధ్యలో ఆగిన అంతిమయాత్ర!

ఎటపాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) ఓ వృద్ధురాలి అంతిమయాత్రలో బాణసంచా పేలుడుకు తేనెతుట్టె కదిలి కలకలం రేగింది. అంతిమయాత్రలో పాల్గొన్నవారిపై తేనెటీగలు దాడి చేయడంతో మృతదేహాన్ని రెండు గంటలపాటు రహదారిపై వదిలి పరుగులు తీశారు. ఈఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం గన్నేరుకొయ్యపాడులో జరిగింది. తేనెటీగల దాడిలో 26 మంది గాయపడ్డారు. ముగడ చంద్రశేఖర్ అనే వ్యక్తి తేనే టీగల దాడిలో స్పృహ కోల్పోయాడు. మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చివరికి బంధువులు మృతదేహాన్ని ట్రాక్టర్‌లో శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

పోలవరాన్ని విధ్వంసం చేసింది

తండ్రీకొడుకులే

▸ వైఎస్, జగన్‌పై మంత్రి నిమ్మల ఆగ్రహం



పాలకొల్లు టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): 'పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిన ఘనులు తండ్రీకొడుకులే. మొదటిసారి ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మధుకాన్ కాంట్రాక్ట్ సంస్థను రద్దు చేస్తే.. రెండోసారి విభజిత ఆంధ్రప్రదేశ్‌లో జగన్ రెడ్డి రివర్స్ టెండరింగ్ పేరిట 17 నెలలు ఏజెన్సీ లేకుండా చేశారు. వీరిద్దరి వల్లే రాష్ట్రానికి, పోలవరం ప్రాజెక్టుకు తీవ్ర నష్టం కలిగింది' అని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పోలవరం ప్రాజెక్టుపై జగన్ ముఠా పదే పదే అసత్యాలు వల్లెవేస్తోంది. 2020లో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల డయాఫ్రమ్ వాల్ ధ్వంసం కావడంతో రూ.440 కోట్లు నష్టం కలిగింది. వందల కోట్ల విలువైన గైడ్ బండ్‌కు నష్టం వచ్చింది. పోలవరం చరిత్రలో ఫేజ్ 1, ఫేజ్ 2 అంటూ 41.15, 45.72 మీటర్లకు తీసుకువచ్చింది జగన్. పోలవరం కుడి, ఎడమ కాలువల నీటి సామర్థ్యం 17,500 క్యూసెక్కుల నుంచి 9 వేల క్యూసెక్కులకు, 6 వేల క్యూసెక్కులకు తగ్గించి ఉత్తరాంధ్రకు, రాయలసీమకు ద్రోహం చేసిన వ్యక్తి జగన్. గత ప్రభుత్వం వల్ల పోలవరానికి రూ.50 వేల కోట్లు నష్టం వాటిల్లింది. ఇంత జరిగినా ఇప్పుడు ఆ పార్టీ నేతలు అసత్యాలు పలుకుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరాన్ని పట్టాలెక్కించారు. ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రి, కేంద్ర జలవనరుల మంత్రులను కలిసి తొమ్మిది నెలల్లో రూ.12,157 కోట్లు మంజూరు చేయించారు. ఇప్పుడు అడ్వాన్సుగా రూ.5,052 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం రూ.990 కోట్లతో డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఎగువ కాఫర్ డ్యాముల బలోపేతానికి బట్రస్ డ్యామ్ పనులు ఏకకాలంలో జరుగుతున్నాయి' అని మంత్రి అన్నారు.

ఏప్రిల్ నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లను ఏప్రిల్ నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అద్దెకు తీసుకున్న ప్రతి ప్రైవేట్ గోడౌన్ వద్ద రేషన్ సరుకుల నిల్వ, రవాణా, భద్రత, నిర్వహణను మరింత సమర్థంగా పర్యవేక్షించేందుకు ఏఐ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన బోర్డు మీటింగ్‌కు మంత్రి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఖరీఫ్ నాటికి ధాన్యం కొనుగోళ్లను మరింత సమర్థంగా నిర్వహించడానికి వీలుగా రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం కింద హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు 1.14 లక్షల టన్నుల సన్నబియ్యం అందిస్తామని చెప్పారు. సమావేశానికి పౌరసరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్, కార్పొరేషన్ ఎండీ మనజీర్ జిలాని సమూన్, బోర్డు ఛైర్మన్ తోట సుధీర్, డైరెక్టర్లు హాజరయ్యారు.

వైసీపీ పాలనలో ప్రజలు మోసపోయారు: భువనేశ్వరి

కుప్పం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు పూర్తిగా మోసపోయారని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ స్మారక ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి విమర్శించారు. దేవుడి దయవల్ల చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఎన్నో పథకాలు అమలు చేస్తుండడంతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని పేర్కొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా మూడవ రోజైన శుక్రవారం చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం నక్కనపల్లెలో మల్బరీ తోటలను ఆమె సందర్శించారు. పట్టు పురుగుల షెడ్లను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామకుప్పం మండలం కొంగనపల్లె, రాజుపేట గ్రామాలను సందర్శించి మహిళలతో సమావేశమయ్యారు. అంతకుముందు శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న సొంత ఇంటి పనులను పరిశీలించి సూచనలు చేశారు. మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో భువనేశ్వరి మాట్లాడారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.


కుప్పంలో ముస్లిం మహిళలతో ఇఫ్తార్ విందులో పాల్గొన్న నారా భువనేశ్వరి

మొగల్తూరు అభివృద్ధిపై పవన్ దృష్టి

- డిప్యూటీ సీఎం ఆదేశాలతో గ్రామసభ
- సమస్యలపై గ్రామస్థులతో చర్చలు.. నూరుశాతం పరిష్కారానికి పీఆర్ కమిషనర్ హామీ



మొగల్తూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు గ్రామ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ భరోసా ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో శుక్రవారం మొగల్తూరులో నిర్వహించిన గ్రామాభివృద్ధి సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మొగల్తూరు సమస్యలు తెలుసుకునేందుకు.. 'గ్రామస్థులు మనవద్దకు రావడం కాదు.. మనమే వెళ్లాల'ని డిప్యూటీ సీఎం.. ఆదేశించడంతో గ్రామ సభ ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామస్థులు కోరిన మేరకు ప్రతి సమస్యనూ పరిష్కరించే దిశగా ప్రతిపాదనలు సిద్ధంచేయాలని సూచించారని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలన్నీ నూరుశాతం పూర్తవుతాయని స్పష్టంచేశారు. జేసీ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ఇచ్చిన అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీకే శివకుమార్‌తో షర్మిల భేటీ


డీకే శివకుమార్‌తో వైఎస్ షర్మిల

అమరావతి, బెంగళూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. కర్ణాటకలోని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు పార్టీ జిల్లా అధ్యక్షులతో కలసి డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న షర్మిల ఆయనను కలిశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులపై డీకేకు వివరించిన ఆమె... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన కార్యాచరణ గురించి చర్చించారు. శివకుమార్‌తో సమావేశంపై ఆమె ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

47 మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీ కార్యక్రమాన్ని మరోసారి చేపట్టింది. ఇప్పటికే అనేక కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను నియమించిన ప్రభుత్వం.. తాజాగా వివిధ జిల్లాల్లోని 47 మార్కెట్ యార్డులకు చైర్మన్లను శుక్రవారం ప్రకటించింది. చైర్మన్ల నియామకంలో రిజర్వేషన్ కేటగిరీలను పరిగణలోకి తీసుకుని, మహిళలకు కూడా ప్రాధాన్యమిస్తూ ఈ జాబితాను విడుదల చేసింది. ప్రకటించిన యార్డు చైర్మన్ పదవుల్లో టీడీపీ నుంచి 37 మందికి, జనసేన నుంచి 8 మందికి, బీజేపీ నుంచి ఇద్దరికి అవకాశం దక్కింది. చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్, ఇతర డైరెక్టర్ల ప్యానల్‌తో కూడిన నియామక ఉత్తర్వులను రెండు-మూడు రోజుల్లో జారీచేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో మొత్తం 218 మార్కెట్ యార్డులు ఉండగా, చైర్మన్ పదవుల్ని రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం నిర్ణయిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని మిగతా యార్డు కమిటీలకు త్వరలో చైర్మన్లను ప్రకటించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

మత్స్య శాఖలో 9 మంది డీడీలకు పదోన్నతులు

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మత్స్య శాఖలో 9 మంది డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించింది. పదోన్నతి పొందిన వారికి పోస్టింగులు కేటాయించింది. ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ డైరెక్టర్లుగా ఎన్ నిర్మల కుమారి(తూర్పు గోదావరి), పీవీ శ్రీనివాసరావు(కోనసీమ), కే శ్రీనివాసనాయక్(బాపట్ల), నాగలింగాచార్యులు(పశ్చిమ గోదావరి), కే శాంతి(కమిషనరేట్), ఏ నాగరాజ(కృష్ణా), ఎన్ శ్రీనివాసరావు(కమిషనరేట్), సీహెచ్ శ్రీనివాసరావు(ప్రకాశం), పీ లక్ష్మణరావు(విశాఖపట్నం) నియమితులయ్యారు.

30 ఏళ్లు అధికారం కాదు.. 30 తరాలైనా వైసీపీ రాదు

- బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ 30ఏళ్ల అధికారంలో ఉండడం కాదు... 30 తరాలైనా ఆ పార్టీ అధికారంలోకి రాదని జమ్మలమడుగు ఎమ్మెల్యే, బీజేపీ నేత ఆదినారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వైసీపీ డైనోసార్‌లా కాలగర్భంలో కలిసిపోయింది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఏపీ ప్రజలు ఒప్పుకోరు. వైసీపీ అధినేత జగన్‌కు ఆధ్యాత్మికత గురించి మాట్లాడే నైతికత లేదు. కాశినాయన ఆశ్రమానికి 2023లో 23 హెక్టార్లు కావాలని లేఖ రాస్తే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక దగ్గుబాటి పురందేశ్వరి నేతృత్వంలో కేంద్ర అటవీ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు భూ కేటాయింపుల కోసం విజ్ఞప్తి చేశాం. 13 ఎకరాలు ఆశ్రమానికి కేటాయించేందుకు ఆయన ఒప్పుకున్నారు. కాశినాయన ఆశ్రమ పునర్నిర్మాణాన్ని చేపట్టాం. ప్రధాని మోదీ ఏప్రిల్‌లో ఏపీకి వస్తున్నారు' అని ఆదినారాయణరెడ్డి తెలిపారు.

రూ.557 కోట్లతో 402 గ్రామీణ రోడ్లు

- ఉగాదికి డిప్యూటీ సీఎం మరో తీపి కబురు


అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లె ప్రజలకు ఉగాది పండుగ సందర్భంగా మరో తీపి కబురు అందించారు. ఇప్పటికే 'పల్లె పండుగ కార్యక్రమం కింద ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 3,600 కి.మీ సిమెంట్ రోడ్లను నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు దీనికి రూ.557 కోట్లతో 1,202 కిలోమీటర్ల మేర 402 గ్రామీణ అనుసంధాన రోడ్లకు ప్రతిపాదించి నిధులు సాధించారు. ఉగాది తర్వాత ఈ పనులన్నీ త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, పల్లెల్లో అభివృద్ధి పండుగ నిరంతరం కొనసాగేలా చేసి గ్రామాల రూపురేఖలు మార్చేలా పనులు కొనసాగాలని పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు.

పర్యాటకాభివృద్ధికి 97 కోట్ల కేంద్ర నిధులు: తెన్నేటి

న్యూఢిల్లీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఏపీలో పర్యాటక అభివృద్ధికి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ రూ.97.52 కోట్ల నిధులు ప్రకటించారని టీడీపీ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. ఇందులో బాపట్లలోని సూర్యలంక పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయించడం సంతోషమన్నారు. శుక్రవారం ఆయన టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి మీడియాతో మాట్లాడారు. బాపట్ల చీరాలలో 12 బీచ్‌లు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్, అమరావతి నుంచి గోవాకు వెళ్లాలంటే 15 గంటల సమయం పడుతుందని, బాపట్ల చీరాల బీచ్‌ల మీదుగా వెళ్లే ఎన్‌హెచ్ 167 రహదారి పూర్తయితే 4 గంటలలోపే బీచ్‌లో ఉండొచ్చని తెలిపారు. కాగా, ఏపీ అభివృద్ధి గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అట్టడుగుకు దిగజారిపోయిందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు.

ఏపీకి రూ.259 కోట్ల అదనపు నిధులివ్వండి

- కేంద్ర ఆర్థిక మంత్రిని కోరిన ఆరోగ్య మంత్రి సత్యకుమార్


కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌తో సమావేశమైన మంత్రి సత్యకుమార్

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్, ఇతర పథకాలకు రాష్ట్రానికి అదనంగా రూ.259 కోట్లు కేటాయించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ విన్నవించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. కేంద్ర ఆరోగ్య శాఖ రూ.800 కోట్ల మేరకు పునఃకేటాయింపులు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖను కోరిన నేపథ్యంలో, వీటిలో ఎన్‌హెచ్ఎం కింద ఏపీకి రూ.109 కోట్లు, పెర్ఫామెన్స్ ఇన్సెంటివ్ కింద రూ.150 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనలకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారు. అలాగే, కేంద్ర మంత్రులు పీయూష్ గోయెల్, గజేంద్రసింగ్ షెకావత్, అర్జున్ రామ్‌మేఘ్వాల్‌తో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి, క్యాన్సర్ చికిత్సల విభాగానికి అదనపు సాయం అందించాలని కోరారు.

ఆటుపోట్లతో రాటుదేలి..!

తెలుగుదేశం 43 ఏళ్ల ప్రస్థానం.. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుని శక్తిమంతంగా మారిన ప్రాంతీయ పార్టీ


తెలుగు జాతి సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ వారికి వెలుగుబాటై నిలిచింది తెలుగుదేశం పార్టీ. నందమూరి తారక రామారావు 1982 మార్చి 29న ఈ పార్టీకి ఊపిరిపోశారు. 43ఏళ్ల ప్రస్థానంలో ఎన్నెన్నో ఆటుపోట్లు.. అయినా రాటుదేలి జాతీయ రాజకీయాల్లో కీలక శక్తిగా మారింది. నేడు 43వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకొంటున్న ఈ పార్టీ పుట్టుకే పెను సంచలనం. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ప్రధాన ఘట్టం. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి 1983 వరకు మూడున్నర దశాబ్దాలపాటు కాంగ్రెస్ పాలనతో విసిగివేసారిన తెలుగు ప్రజలకు.. టీడీపీ.. రాజకీయ ప్రత్యామ్నాయంగా నిలిచింది. చివరకు అదే ప్రధాన పక్షంగా నిలిచింది. జాతీయ రాజకీయాలను సైతం చేయిబట్టి నడిపే కీలకశక్తిగా ఆవిర్భవించింది. రాష్ట్ర విభజన తర్వాత.. అప్పుల కుంపటి నెత్తిన పెట్టుకున్న నవ్యాంధ్రకు ఏకైక ఆశాకిరణంగా నిలిచింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకుని.. పరాజయాలు ఎదురైనా అనతికాలంలోనే పుంజుకోవడం తెలుగుదేశం పార్టీ సహజ లక్షణమైంది. దాని ఆవిర్భావమే దేశంలో ప్రాంతీయ పార్టీల ఏర్పాటుకు ఒక నమూనా. ఇతర రాష్ట్రాల్లోని ప్రాంతీయ నాయకులకు స్ఫూర్తిగా నిలిచింది. కేంద్రీకృత రాజకీయ వ్యవస్థకు సవాల్ విసిరింది. 1982లో ఆవిర్భావం తర్వాత 10 సార్లు శాసనసభ ఎన్నికలు జరుగగా.. ఆరుసార్లు టీడీపీ విజయం సాధించింది. 1989, 2004, 09, 19ల్లో ఓడిపోయి ప్రతిపక్షంలో కూర్చుంది. ఈ గణాంకాలే ప్రజలకు టీడీపీపై ఉన్న నమ్మకానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఎన్టీఆర్, చంద్రబాబు సారథ్యంలో రాష్ట్ర స్థాయిలోనే కాదు జాతీయ స్థాయి రాజకీయాల్లో తీవ్ర అనిశ్చితి నెలకొన్న సమయంలోనూ.. ముందుండి ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తెచ్చింది. 1989లో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం, 1996-98 నడుమ యునైటెడ్ ఫ్రంట్ సర్కార్ల ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించింది. 1998, 99ల్లో వాజపేయి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వాల ఏర్పాటులోనూ చంద్రబాబు చక్రం తిప్పారు. 2024లో మూడోసారి ప్రధానమంత్రి అయిన మోదీ నాయకత్వంలోని ఎన్డీయే సర్కారుకు టీడీపీయే ఆలంబనగా మారింది.







నాదెండ్ల భాస్కరరావు సృష్టించిన ఆగస్టు సంక్షోభం మొదలు.. లక్ష్మీపార్వతి నుంచి పార్టీని కాపాడుకుని నిలదొక్కుకునేలా చేయడంలో.. 2004, 09ల్లో వరుస పరాజయాల అనంతరం ఫీనిక్స్ పక్షిలా ఎగిరి 2014లో అధికారం చేజిక్కించుకోవడం.. 2019-24 నడుమ తీవ్ర నిర్బంధాలను అధిగమించి 2024 ఎన్నికల్లో రికార్డు విజయాన్ని నమోదు చేయడం వరకు ప్రతి సంక్షోభాన్నీ అవకాశంగా మలుచుకోవడం వల్లే సాధ్యపడింది.

కార్యకర్తలే బలం.. అభివృద్దే పథం

టీడీపీకి మూలబలం కార్యకర్తలే. పార్టీ ఆశయాలకు కట్టుబడిన బలమైన కేడర్ దాని సొంతం. కోటి పైచిలుకు సభ్యత్వాల నమోదే దీనికి నిదర్శనం. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలను.. వేధింపులను తట్టుకుని పార్టీ నిలబడగలిగిందంటే ప్రధాన కారణం కార్యకర్తలే. మెడపై కత్తి పెట్టి.. పార్టీ మారితే తప్ప వదిలేది లేదని బెదిరించినా.. పార్టీ జెండా కప్పుకొనే చనిపోతానని చెప్పి మరీ ప్రాణాలు విడిచిన చంద్రయ్యలే టీడీపీ బలం. అయినా పార్టీ కేడరా.. రాష్ట్రాభివృద్ధా అంటే.. అభివృద్ధి వైపే మొగ్గు చూపే విధానం ఆ పార్టీది.. చంద్రబాబుది. అందుకే ఆయన్ను వ్యతిరేకించేవారు కూడా.. అభివృద్ధి గురించి చెప్పాల్సి వస్తే ఆయన్నే ఉదాహరణగా చెబుతుంటారు. టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని అంగీకరిస్తారు.

విప్లవాత్మక నిర్ణయాలు

ఆంధ్రప్రదేశ్‌లో.. 1982 వరకు కాంగ్రెస్ ఆధిపత్యమే సాగేది. కేంద్రంలోని ఆ పార్టీ నాయకత్వం రాష్ట్రంలో తరచూ ముఖ్యమంత్రులను మార్చడం, వారిని అవమానించడం..స్థానిక నాయకత్వాన్ని నిర్లక్ష్యం చేయడం.. వంటి చర్యలు ప్రజల్లో వ్యతిరేకత పెంచాయి. ఆ సమయంలో 'తెలుగు వారి ఆత్మగౌరవం' నినాదంతో రాజకీయ కదన రంగంలోకి దూకిన ఎన్టీఆర్‌ను తెలుగు ప్రజలు అక్కున చేర్చుకున్నారు. సామాజిక న్యాయమే ప్రధాన అజెండాగా.. పేదలు, రైతులు, వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా నాటినుంచి నేటి వరకు టీడీపీ రాజకీయ ప్రయాణం అప్రతిహతంగా సాగుతోంది. 43ఏళ్ల ప్రస్థానంలో నెలకొల్పిన రికార్డులు.. తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు.. ఎదుర్కొన్న ఆటుపోట్లు ఎన్నో..!

ఆ లోపం వెంటాడుతోంది..!

ప్రభుత్వానికి నిఘా వ్యవస్థ ఉన్నట్టే.. రాజకీయ పార్టీకీ పటిష్ఠ నిఘా యంత్రాంగం ఉండాలి. టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆగస్టు సంక్షోభం పార్టీని కుదిపేసింది. పార్టీకి అంతర్గత రాజకీయ నిఘా(పొలిటికల్ ఇంటెలిజెన్స్) ఎంత అవసరమో ఈ ఉదంతం చాటింది. 2019 ఎన్నికలకు ముందు జరిగిన వైఎస్ వివేకానందరెడ్డి హత్యోదంతం కూడా టీడీపీపై బలమైన ప్రభావం చూపింది. పటిష్ఠమైన పోలీసు, నిఘా యంత్రాంగం ఉన్నా వ్యతిరేక ప్రచారాన్ని చంద్రబాబు అడ్డుకోలేకపోయారు. 2019 ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమికి ఇది కూడా ఓ కారణమేనని ఆయనే అంగీకరించారు. దుష్ప్రచారాన్ని సకాలంలో దీటుగా తిప్పికొట్టలేకపోవడం బలహీనతగా మారిందని.. 43వ ఆవిర్భావ దినోత్సవం వేళ దిద్దుబాటు దిశగా నాయకత్వం అడుగులు వేయాల్సిన అవసరముందని ఆ పార్టీ నేతలు సూచిస్తున్నారు.

నేడు ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. ఉదయం 9 గంటలకు టీడీపీ కేంద్ర కార్యాలయంలో అట్టహాసంగా వేడుకలు నిర్వహించనున్నారు. జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ జెండాను ఆవిష్కరించి, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆవిర్భావ సభను ప్రారంభిస్తారు. ఈ వేడుకల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్, పొలిట్‌బ్యూరో సభ్యులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించాలని, ఎన్టీఆర్ విజయ ప్రస్థానం, సీఎంగా చంద్రబాబు సాధించిన విజయాలకు సంబంధించిన వీడియోలను జిల్లావ్యాప్తంగా ప్రదర్శించాలని ఆదేశించింది.

ఆవిర్భవించిన 9 నెలల్లోనే అధికారం..

టీడీపీని స్థాపించిన కేవలం 9 నెలల్లోనే 1983 జనవరిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో అద్భుతమైన విజయంతో ఎవరూ చెరపలేని రికార్డును సృష్టించింది. ఎన్టీఆర్ నాయకత్వంలో టీడీపీ 294సీట్లలో 202 గెలుచుకుంది. ఈ విజయం భారత రాజకీయాల్లోనే పెను సంచలనం.

- స్వతంత్ర భారత చరిత్రలో తొలగించిన ముఖ్యమంత్రి తిరిగి సీఎం కావడం ఎన్టీఆర్ ఒక్కరికే సాధ్యమైంది. 1984 ఆగస్టు సంక్షోభంలో పదవిని కోల్పోయిన ఆయన.. తిరిగి నెలరోజులకే సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు.
- ఎన్టీఆర్ పాలనలో రూ.2కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పేదలకు పక్కా ఇళ్లు, మహిళలకు ఆస్తి హక్కు, కరణాలు, మునసబు, పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేయడం వంటి సంక్షేమ పథకాలు, విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారు.
- వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లను తొలిగా ప్రారంభించింది టీడీపీయే. ఎన్టీఆర్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20శాతం, మహిళలకు 9శాతం రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనతా టీడీపీ సొంతం.
- మైనారిటీల అభివృద్ధికి ప్రత్యేకంగా మైనారిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనా ఈ పార్టీదే. 1985లో ఆ కార్పొరేషన్‌ను స్థాపించారు.
- తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో పొట్టిశ్రీరాములు తెలుగు వర్సిటీ, విజయవాడలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.. ఇవన్నీ టీడీపీ హయాంలో పురుడుపోసుకున్నవే. తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులకు వసతుల కల్పన కూడా ఎన్టీఆర్ నుంచే ప్రారంభమైంది. 1985 ఏప్రిల్ 6న తిరుమలలో నిత్యాన్నదాన పథకం ప్రారంభించడం చరిత్ర సృష్టించింది. మరిన్ని మెరుగులతో నేటికీ అప్రతిహతంగా సాగుతోంది.
- రాష్ట్ర విభజన అనంతరం అప్పుల ఊబిలో కూరుకుపోయి.. రాజధాని లేకుండా మిగిలిన రాష్ట్రానికి అమరావతిని రాజధానిగా చేసి.. నవ్యాంధ్ర నిర్మాణానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు.

చంద్రబాబు.. ఓ శక్తిమంతమైన నేత!

- అఖిల భారత నాయకుల జాబితాలో 14వ స్థానంలో నిలిచిన సీఎం
- 73వ స్థానంలో డిప్యూటీ సీఎం పవన్
- ఇద్దరి ఎంపిక తొలిసారే కావడం విశేషం
- నెంబర్ 1 స్థానంలో ప్రధాని మోదీ
- కొనియాడిన 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'



హైదరాబాద్/అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అత్యంత శక్తిమంతమైన నాయకుల జాబితాలో సీఎం చంద్రబాబు 14వ స్థానంలో నిలిచారు. రాజకీయ వ్యూహాలు, మొక్కవోని దీక్ష, భవిష్యత్‌పై పక్కా ప్రణాళిక, రాష్ట్రాన్ని ముందువరుసలో నిలపాలన్న విజన్ వంటివి ఆయనకు ఈ స్థానాన్ని కట్టబెట్టాయి. దేశంలోని వివిధ రంగాల్లో అత్యంత శక్తిమంతులైన 100మంది ప్రముఖులతో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్-2025' జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితాలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 73వ స్థానంలో నిలిచారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గతంలోనూ ఇలాంటి జాబితా రూపొందించినా.. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పేర్లను తొలిసారి తాజా జాబితాలో పేర్కొనడం విశేషం. ఇక, ఈ జాబితాలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి 28వ స్థానంలో నిలిచారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నంబర్ 1 స్థానాన్ని నిలబెట్టుకున్నారు. నిరుడు కూడా ఆయన 1వ స్థానంలోనే ఉండటం గమనార్హం. రెండోస్థానంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మూడో స్థానంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ నిలిచారు. తర్వాత(పది స్థానాల్లో) వరసగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్వినీ వైష్ణవ్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ ఉన్నారు. 100 మంది జాబితాలో దేశంలోని రాజకీయ, వ్యాపార, క్రీడా, వినోద రంగాల్లో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు ఉన్నారు. సినీ నటుడు అల్లు అర్జున్ 92వ స్థానంలో నిలిచారు.

ఒక కృషి-ఒక పట్టుదల!

ఈ జాబితాలో సీఎం చంద్రబాబుకు 14వ స్థానం దక్కడంపై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పలు కీలక విషయాలను వెల్లడించింది. వ్యూహాత్మక రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరని తెలిపింది. వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్ జైల్లో పెట్టినప్పటికీ మొక్కవోని దీక్షతో కేవలం ఏడాది కాలంలోనే పార్టీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగారని పేర్కొంది. బీజేపీ, జనసేనలతో కూటమికట్టి కనీవినీ ఎరుగని విజయం దక్కించుకున్నారని, ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి చంద్రబాబు వెన్నుదన్నుగా ఉన్నారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వివరించింది. ప్రస్తుతం జాతీయస్థాయిలోనూ చంద్రబాబు ముఖ్య భూమిక పోషిస్తున్నారని తెలిపింది. 'స్వర్ణాంధ్ర 2047' సాకారం దిశగా చంద్రబాబు పట్టుదలతో ముందుకు సాగుతున్నట్టు పేర్కొంది. అదేవిధంగా ఎన్నికల హామీలైన 'సూపర్-6' అమలుకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపింది. ఇక, పాలనలో పారదర్శకతకు పెట్టపీట వేస్తూ.. తన మంత్రులకు, తనకు కూడా ఫైళ్ల పరిష్కారంలో ఆయన ర్యాంకులు కేటాయించుకున్న విధానాన్ని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రధానంగా ప్రశంసించింది.

అపజయాల బాటలో విజయతీరాలకు..

జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్-2025' జాబితాలో 73వ స్థానాన్ని పొందారు. ఆయన గురించి ప్రస్తావిస్తూ.. అపజయాల బాటలో విజయతీరాలకు చేరిన అలుపెరుగని నాయకుడిగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అభివర్ణించింది. 2014లో పార్టీ పెట్టినా ఆయన రాజకీయాలు వడ్డించిన విస్తరి కాలేదని పేర్కొంది. అధికారం కోసం సుదీర్ఘకాలం ఎదురు చూశారని తెలిపింది. 2024లో కూటమి కట్టి వైసీపీని గద్దె దించడంలో కీలక పాత్రపోషించినట్టు వివరించింది.

పేద ముస్లిం ఇంట లోకేశ్

- మంగళగిరిలో ఆ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు
- అక్కడే ఇఫ్తార్ విందు స్వీకరణ.. కుటుంబ బాధ్యత తీసుకుంటానని హామీ


హలీం స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మంత్రి లోకేశ్ శుక్రవారం రాత్రి తన నియోజకవర్గం మంగళగిరిలో.. ఓ నిరుపేద ముస్లిం ఇంటికి ఆకస్మికంగా వెళ్లి ఆ కుటుంబ సభ్యులందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. వారితో కలిసి ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ వేళ అనుకోని అతిథిగా లోకేశ్ తమ ఇంటికి రావడంతో వారి సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. లోకేశ్ ఎవరికీ ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఉండవల్లిలోని తన నివాసం నుంచి నేరుగా మంగళగిరి పాత శ్రీనివాసమహల్ పక్కనే వున్న మురికివాడకు చేరుకున్నారు. అక్కడ నిరుపేద ముస్లిం షేక్ షెహన్‌షా ఇంటికి వెళ్లారు. ఇది చాలా చిన్న ఇల్లు. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన వారు అంతలోనే తేరుకుని ఆయన్ను లోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేశ్ వుదూ నిర్వహించి ముస్లింల సంప్రదాయ కుఫీ టోపీని ధరించారు. అనంతరం వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తర్వాత షెహన్‌షా కుటుంబసభ్యులకు పండ్లు తినిపించి ఉపవాసాన్ని విరమింపజేశారు. అనంతరం ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ సందర్భంగా లోకేశ్ ఆ ఇంటిని పరిశీలించి వారందరి యోగక్షేమాలను తెలుసుకున్నారు. చాలీచాలని సంపాదనతో ఎలాగో బతుకుతున్నామని వారు బాధగా చెప్పారు. దిగులుపడొద్దని లోకేశ్ వారికి భరోసా ఇచ్చి.. కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రస్తుత రేకుల ఇంటి స్థానంలో నూతన గృహాన్ని నిర్మించి ఇస్తానన్నారు. పిల్లలను కనీసం ఇంటర్ అయినా చదివిస్తే ప్రభుత్వం వృత్తివిద్య శిక్షణను ఇప్పించి ఉద్యోగాలను కల్పిస్తుందని చెప్పారు. అనంతరం లోకేశ్ షెహన్‌షా కుటుంబ సభ్యులకు పవిత్ర ఖురాన్‌తోపాటు వారందరికీ రంజాన్ బహుమతులను అందజేశారు.

లోకేశ్‌ను కలిసిన 11 ఏళ్ల టెక్ పిడుగు అఖిల్



అమరావతి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన 11 ఏళ్ల టెక్ సంచలనం.. అఖిల్ ఆకెళ్ల రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. తన తండ్రితో కలిసి శుక్రవారం ఉండవల్లి నివాసానికి వెళ్లిన అఖిల్‌తో లోకేశ్ సుమారు అరగంట సమావేశమయ్యారు. బ్రిటన్‌లో చదువుతున్న అఖిల్ చిన్నవయసులోనే మైక్రోసాఫ్ట్ ధృవీకరించిన అజ్యూర్, డేటా సెక్యూరిటీతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఫౌండేషన్ కోర్సుల్లో సర్టిఫికెట్లు సాధించాడు. అమరావతిలో జరగనున్న సమాచార, సాంకేతిక అభివృద్ధిలో భాగమయ్యేందుకు అఖిల్ ఆసక్తి చూపించడంతో ఆ చిన్నారిని కలుస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు అఖిల్‌ను కలిశారు.

పదే పదే ఏమిటిది?

ఎమ్మెల్యే కొలికపూడిపై మళ్లీ టీడీపీ అధిష్ఠానం సీరియస్

రఘురాం, ఎంపీ కేశినేని, సత్యనారాయణరాజుతో కమిటీ

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పదే పదే పార్టీకి తలనొప్పులు తీసుకొస్తున్న వైనం అధిష్ఠానాన్ని ఆగ్రహానికి గురిచేస్తోంది. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ఎప్పుడూ ఏదో ఒక వివాదం సృష్టిస్తున్నారని.. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని గుర్రుగా ఉంది. తాజాగా స్థానిక టీడీపీ నేత రమేశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏకంగా అధిష్ఠానానికే అల్టిమేటం జారీ చేయడం.. 48 గంటల్లో చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తానని బెదిరించడాన్ని పార్టీ సీరియస్‌గా పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త సత్యనారాయణరాజుతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. నియోజకవర్గంలో గత 10 నెలలుగా చోటుచేసుకున్న సంఘటనలపై సమగ్ర నివేదిక తెప్పించుకున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు.. దానిని పార్టీ అధినేత చంద్రబాబుకు సమర్పించారు. కొలికపూడిపై ఎలాంటి చర్య తీసుకోవాలో చంద్రబాబుదే తుది నిర్ణయమని టీడీపీ వర్గాలు తెలిపాయి.

నరకం చూపిస్తా నాయాలా!

టెక్కలిలో ఎలా ఉద్యోగం చేస్తావో చూస్తా

ఎమ్మెల్సీ ఇంటికొచ్చి కనెక్షన్ కట్ చేశావంటే ఎంత ధైర్యం

నిన్ను కోర్టుకు లాగుతా.. ఎవడితో చెప్పుకొంటావో చెప్పుకో

ట్రాన్స్‌కో జేఈకి వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ బెదిరింపులు

బిల్లు చెల్లించనందుకు కనెక్షన్ తొలగించడంపై ఆగ్రహం

శ్రీకాకుళం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): 'నరకం చూపిస్తా.. నాయాలా' అంటూ ప్రభుత్వ ఉద్యోగిపై వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నోరు పారేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం అక్కువరంలో దువ్వాడ పేరుతో విద్యుత్ కనెక్షన్ ఉంది. అదే ఇంటికి అతని సన్నిహితురాలి పేరుతో మరో కనెక్షన్ ఉంది. శ్రీనివాస్ పేరుతో ఉన్న కనెక్షన్‌కు రూ.56,692 బకాయిలు గడువు తీరినా చెల్లించలేదు. దీంతో ఈ కనెక్షన్‌తో పాటు అదే ఇంటికి అనుబంధంగా ఉన్న కనెక్షన్‌ను అధికారులు శుక్రవారం తాత్కాలికంగా తొలగించారు. విషయం తెలుసుకున్న దువ్వాడ.. టెక్కలి ట్రాన్స్‌కో జేఈకి ఫోన్ చేసి తీవ్రంగా బెదిరించారు. "ఎలా కట్ చేస్తారు.. నా ఇంటికి వచ్చి.. కొంచెమైనా లెక్కలు పత్రాలు ఉన్నాయా? ఒక ఎమ్మెల్సీ ఇంటికి వచ్చి కట్ చేశావంటే నీకు ఎంత ధైర్యమబ్బా? టెక్కలిలోనే ఎన్ని రైస్‌మిల్లులు ఉన్నాయి. దమ్ముంటే వెళ్లి కట్ చేయి. ఎవరితో పెట్టుకుంటున్నావు.. బిల్లు కట్టినా ఎలా కట్ చేస్తావు.. నువ్వు ఏ రైట్స్‌తో కట్ చేశావో చెప్పు. నీపై కంజ్యూమర్ కోర్టుకు వెళ్తా... కోర్టుకి లాగి నీ జీవితం ఈడ్చిఈడ్చి పెడతా. ఎవడితో చెప్పుకొంటావో చెప్పుకో. దువ్వాడ శ్రీనివాస్ ఇంటికి డి. మాధురి పేరున ఉన్న బిల్లు పేమెంట్ జరిగి వారం రోజులైంది. నిన్ను కోర్టుకు లాగుతా. నీకు నరకం చూపుతా. నువ్వు ఏదో తెలుగుదేశం వాడివి అయ్యుండొచ్చు. ఎంత ధైర్యంతో నా ఇంటికి వచ్చావు. నువ్వు పారిపోయేట్లు చేస్తాను చూడు. టెక్కలిలో ఎలా ఉద్యోగం చేస్తావో చూస్తా.. నాయాలా' అంటూ దువ్వాడ శ్రీను బెదిరించారు. అనంతరం దువ్వాడ బకాయి మొత్తాన్ని చెల్లించి రశీదును వాట్సాప్‌లో పంపారు. దీనిపై ట్రాన్స్‌కో జేఈ దాసరి మురళీకృష్ణ మాట్లాడుతూ సర్వీస్‌కు సంబంధించి బిల్లు మొత్తం చెల్లించేశారని, విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించామని తెలిపారు. కాగా, ఎమ్మెల్సీ, జేఈ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ వైరల్‌గా మారింది.

సుర్రుమన్న సూరీడు



» 181 ప్రాంతాల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, కోస్తాలో వడగాడ్పులు సెగలు పుట్టిస్తున్నాయి. శుక్రవారం 181 ప్రాంతాల్లో 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 15 మండలాల్లో తీవ్రంగా, 90 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. గరిష్ఠంగా ప్రకాశం జిల్లా తాటిచెర్ల, కడప జిల్లా కమలాపురంలో 42.6, నంద్యాల జిల్లా ఆలమూరులో 42.5, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 42.2, అనకాపల్లి జిల్లా రావికమతంలో 42.1, అన్నమయ్య జిల్లా వతలూరులో 42, అనంతపురం జిల్లా గుంతకల్లు, పల్నాడు జిల్లా నడికుడిలో 41.9, విజయనగరం జిల్లా నెలివాడలో 41.8, నెల్లూరు జిల్లా నెల్లూరిపాలెంలో 41.5, చిత్తూరు జిల్లా నగరి, కర్నూలు జిల్లా ఉలిందకొండలో 41.1 డిగ్రీలు నమోదయ్యాయి. శనివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని 35 మండలాల్లో తీవ్రంగా, శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు 223 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఆదివారం 85 మండలాల్లో వాటి ప్రభావం ఉంటుందని పేర్కొంది.

వంశీకి నో బెయిల్!



» సత్యవర్ధన్ కేసులో పిటిషన్ తిరస్కృతి

» జేడీ, ఐవోకు నోటీసులు జారీ చేసిన కోర్టు

» వచ్చే నెల 9 వరకు రిమాండ్ పొడిగింపు

» భూముల కేసులో పోలీసు కస్టడీకి అనుమతి

» నేడు కస్టడీకి తీసుకోనున్న ఆత్కూరు పోలీసులు

విజయవాడ/గన్నవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైలులో విచారణ ఖైదీగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీమోహన్‌కు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదిదారుడు ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు శుక్రవారం తిరస్కరించింది. బెయిల్ పిటిషన్‌పై విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో శుక్రవారం విచారణ జరిగింది. దీనిపై ప్రాసిక్యూషన్, వంశీ తరపు న్యాయవాదుల వాదనలు విన్న న్యాయాధికారి హిమబిందు బెయిల్ మంజూరు చేయలేమని తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ చేసిన వాదనలతో ఏకీభవిస్తూ బెయిల్ పిటిషన్‌ను కొట్టేసినట్టు వెల్లడించారు.

ఇద్దరికి నోటీసులు

తీర్పు సందర్భంగా న్యాయస్థానంలో కీలక పరిణామం జరిగింది. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించిన జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, కేసు దర్యాప్తు అధికారి(విజయవాడ సెంట్రల్ ఏసీపీ) కె. దామోదరరావుకు కోర్టు నోటీసులు జారీ చేసింది. వాదనల సందర్భంగా రాజేంద్రప్రసాద్ కొన్ని అదనపు అంశాలను కోర్టుకు చెప్పాలని అడిషనల్ సబ్‌మిషన్స్‌ను దాఖలు చేశారు. న్యాయస్థానంలో కేసు విచారణ సమయంలో జరుగుతున్న పరిణామాలపై వ్యాఖ్యలు చేస్తూ అడిషనల్ సబ్‌మిషన్స్ దాఖలు చేశారు. కేసు దర్యాప్తు అధికారి కె. దామోదరరావు తరఫున దీన్ని కోర్టుకు ఇచ్చారు. దీనిపై న్యాయాధికారి హిమబిందు దర్యాప్తు అధికారి దామోదరరావును కోర్టుకు పిలిపించారు. అదేవిధంగా ప్రాసిక్యూషన్ తరఫున జేడీ రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. అదనపు పత్రాల్లో పేర్కొన్న అంశాలకు కట్టుబడి ఉంటున్నారా? అని న్యాయాధికారి హిమబిందు వారిని అడిగారు. దానికి ఇద్దరూ కట్టుబడి ఉంటున్నామని చెప్పారు. ఈ వ్యాఖ్యలకు గల కారణాలను తెలియజేయాలని కోరుతూ వారికి నోటీసులు జారీ చేశారు.

రిమాండ్ పొడిగింపు

సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో వంశీ రిమాండ్‌ను పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విధించిన రిమాండ్ గడువు ముగియడంతో వంశీని పోలీసులు విజయవాడలోని సీఐడీ కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు. వంశీతోపాటు మరో నిందితుడు నిమ్మ లక్ష్మీపతిని కూడా కోర్టుకు తీసుకొచ్చారు. ఈ ఇద్దరికీ వచ్చే నెల 9 వరకు రిమాండ్ పొడిగిస్తున్నట్టు న్యాయాధికారి తిరుమల రావు ఆదేశాలు ఇచ్చారు.

ఒకరోజు కస్టడీకి అనుమతి

వైసీపీ మాజీ ఎమ్మెల్యే వంశీని ఒక రోజు పోలీసు కస్టడీకి ఇస్తూ గన్నవరం కోర్టు న్యాయాధికారి ఉత్తర్వులు ఇచ్చారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన కాంట్రాక్టర్ శనగల శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్కూరు పోలీసులు వంశీపై గతంలోనే కేసు నమోదు చేశారు. ఫోర్జరీ సంతకాలు చేసి, బెదిరించి, కుట్రపూరితంగా నకిలీ పత్రాలు సృష్టించి ఒకరి భూమిని మరొకరి దక్కేలా చేశారని శ్రీధర్‌రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తనకు చెందాల్సిన ఆస్తి దక్కకుండా అన్యాయం చేశారని వివరించారు. ఈ కేసులో మరింత సమాచారం సేకరించేందుకు 5 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు గన్నవరం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి ఒక రోజు కస్టడీకి అనుమతించారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారించాలని, వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. విచారణ అనంతరం కోర్టులో హాజరు పరిచి అక్కడి నుంచి విజయవాడ జైలుకు అప్పగించాలని పేర్కొన్నారు. దీంతో విజయవాడ జైల్లో ఉన్న వంశీని ఆత్కూరు పోలీసులు శనివారం తమ కస్టడీకి తీసుకోనున్నారు. మరోవైపు ఇదే కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వంశీ వేసిన పిటిషన్‌పై విచారణను కోర్టు ఏప్రిల్ 1కి వాయిదా వేసింది.

పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో

'సిట్' దూకుడు

» ఇన్‌చార్జిగా కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

» కేసుపై సీఎం సమీక్ష... ఒకట్రెండు రోజుల్లో కొలిక్కి

రాజమహేంద్రవరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తీవ్ర సంచలనం సృష్టించిన పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ అనుమానాస్పద మృతిపై సిట్ దర్యాప్తు వేగవంతమైంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఇన్‌చార్జిగా సిట్ దర్యాప్తు జరుగుతోంది. సీఎం చంద్రబాబు, పోలీసు ఉన్నతాధికారులు కేసు పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. పాస్టర్ ప్రవీణ్ సొంత జిల్లా కడప అని ప్రచారం ఉంది. చాలా కాలంగా సికింద్రాబాద్‌లోని నేరేడ్‌మెట్‌లో ఉంటూ క్రైస్తవ ప్రచారకుడిగా పేరు గడించారు. ఈ నెల 26 నుంచి 3రోజుల పాటు తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం మార్కొండపాడులో రక్షణ సువార్త మహాసభల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఒక రోజు ముందుగానే ఆయన బుల్లెట్‌పై హైదరాబాద్ నుంచి బయలుదేరారు. 24వ తేదీ అర్ధరాత్రి సమయంలో కొంతమూరు హైవే వద్ద ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆయనకు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఇల్లు కూడా ఉన్నట్టు చెబుతున్నారు. అయితే, అంతపెద్ద వ్యక్తి బుల్లెట్‌పై రావడం ఏంటనే ప్రశ్నలు వచ్చాయి. సంఘటన జరిగిన తీరునుబట్టి ఇది ముమ్మాటికీ హత్యేనని క్రైస్తవ సంఘాలు ఆరోపించడంతో రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. కాగా, పాస్టర్ మరణానికి దారి తీసిన కారణాలను వెలికితీసే పనిలో సిట్ బృందం నిమగ్నమైంది. ప్రత్యేక పోలీసులు అన్ని కోణాల్లో విచారణ ముమ్మరం చేశారు. మంగళగిరిలోని పోలీసు కేంద్ర కార్యాలయం నుంచి ఇద్దరు ఫోరెన్సిక్ నిపుణులు శుక్రవారం ఘటనా స్థలిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కేసు పరిశీలనకు మొత్తం ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ప్రభుత్వం నియమించింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు రెండు పోలీసు బృందాలు, విజయవాడ నుంచి రాజమహేంద్రవరం వరకు మరో రెండు పోలీసు బృందాలు దారి పొడవునా సీసీ ఫుటేజీల ఆధారంగా విచారిస్తున్నారు. ఒక దర్యాప్తు బృందం ఇప్పటికే సికింద్రాబాద్‌లోని పాస్టర్ కుటుంబ సభ్యులను విచారించి వారి వాంగ్మూలం నమోదు చేసింది. ఒకటి రెండు రోజుల్లో కేసు కొలిక్కి రానున్నట్టు సమాచారం.

'డిజిటల్' అక్రమాలపై సీఐడీ

» విజిలెన్స్ నివేదిక ఆధారంగా ప్రభుత్వ ఆదేశం

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో డిజిటల్ కార్పొరేషన్ పేరుతో చేసిన అక్రమాలు, అవినీతిపై కూటమి ప్రభుత్వం సీఐడీ దర్యాప్తునకు ఆదేశించింది. జగన్ హయాంలో డిజిటల్ కార్పొరేషన్‌లో రూ.171.9 కోట్లు ఖర్చు చేయగా, అందులో 37.20 కోట్లు దుర్వినియోగం అయినట్లు విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. జగన్ పత్రిక సాక్షికి దోచిపెట్టడంతో పాటు ఆయన తండ్రి వైఎస్ పాదయాత్రపై వైసీపీ నాయకుడు నిర్మించిన యాత్ర-2 సినిమాలో నటించిన మలయాళీ నటుడు మమ్ముట్టికి రూ.50 లక్షలను ఈ కార్పొరేషన్ నుంచే చెల్లించినట్టు విజిలెన్స్ గుర్తించింది. హైకోర్టు న్యాయమూర్తులపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టి సీబీఐతో సంకెళ్లు వేయించుకున్న నిందితుడు అశోక్ రెడ్డి భార్య సుమ తియ్యగుర తదితరులకు కూడా చెల్లింపులు జరిపినట్లు తేల్చింది. ఇలాంటి పలు అక్రమాలకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ చేసిన సిఫారసుకు అనుగుణంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో నాలుగేళ్ల పాటు ఈ కార్పొరేషన్‌లో జరిగిన లావాదేవీల్లో 171.9 కోట్ల రూపాయలు ఖర్చయ్యాయని, అందులో 139 కోట్లు ఇప్పటికే చెల్లింపులు అయ్యాయని ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన 76 పేజీల నివేదికలో విజిలెన్స్ వివరించింది. నాడు ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఎండీగా వ్యవహరించిన చిన్న వాసుదేవరెడ్డి వీడియో కంటెంట్ పేరుతో భారీగా డబ్బులు దుర్వినియోగం చేశారని, మోసపూరితంగా వ్యవహరించి ప్రభుత్వానికి నష్టం వాటిల్లేలా చేశారని విజిలెన్స్ స్పష్టం చేసింది. కార్పొరేషన్‌లో అన్ని అక్రమాలకు వాసుదేవరెడ్డి బాధ్యుడని పేర్కొంది. ఐ డ్రీమ్స్ వ్యవస్థాపకుడైన వాసుదేవరెడ్డి ఐపాక్, ఐడ్రీమ్స్ ఉద్యోగులను డిజిటల్ కార్పొరేషన్‌లో సిబ్బందిగా చూపించి జీతభత్యాలు చెల్లించినట్లు విజిలెన్స్ గుర్తించింది. అనుభవం, అర్హతలు లేని వారిని ఉద్యోగాల్లో నియమించుకుని 37.20 కోట్లు చెల్లింపులు చేశారని వివరించింది. కాగితాల్లో తప్ప ఎక్కడా లేని సంస్థలైన డేటా మోటిఫ్, జీపీఆర్ పబ్లికేషన్స్, డెక్కన్ మీడియా, సాయినందినీ క్రియేషన్స్, త్రీ ఆటమ్ లీవ్స్, అవిసా మీడియా, సాయి అడ్వర్టైజింగ్, షాలోక్ ఎంటర్‌టైన్‌మెంట్, ఆర్ఆర్ మీడియా సంస్థలకు లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించింది.

వీరిపై చర్యలు తీసుకోండి

ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో ఉద్యోగాల నియామకాలకు సెలెక్షన్ కమిటీ ఉంటుంది. కానీ అర్హతలేని 60 మందికి పైగా ఉద్యోగాలు ఇస్తున్నా చోద్యం చూసిన ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి, ఏపీఎస్ఎఫ్ఎల్ సభ్యుడు మధుసూదన్ రెడ్డి ఐఆర్ఎస్, కె. హేమచంద్రారెడ్డి, సి.ప్రతాప్, ఐ అండ్ పీఆర్ సీఈవో మధుసూదన్, చీఫ్ డిజిటల్ డైరెక్టర్ బ్రహ్మానంద పాత్రా, ఏపీ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఉద్యోగి మోతీలాల్ నాయక్, బి. నాగేశ్వర రావు, రాధాకృష్ణ, రామసుబ్బయ్య, జీవీ రామకృష్ణారావు, ఏవీ సుబ్బారెడ్డి, భూమిరెడ్డి శ్రీవర్ధన్ రెడ్డి, పాలేశ్వర రావు, గంగవరపు సుధీర్ కుమార్, పొన్నగంటి దీపిక, పొన్నగంటి శశికృష్ణ, తాడుక అరవింద్, మౌనిక, నాగభూషణ్ రెడ్డితో పాటు త్రీ ఆటామ్ లీవ్స్ సంస్థలపై న్యాయపరమైన చర్యలకు విజిలెన్స్ సిఫారసు చేసింది. సీఐడీ అధికారులు వీరిని పిలిచి విచారించబోతున్నారు.

జీఎస్టీ ఎగవేతపైనా చర్య తీసుకోవాలి

డిజిటల్ కార్పొరేషన్‌లో అక్రమాలన్నింటికీ ఐ డ్రీమ్స్ వ్యవస్థాపకుడు వాసుదేవరెడ్డి బాధ్యుడని గుర్తించిన విజిలెన్స్.. ఈ అక్రమ లావాదేవీల్లో జీఎస్టీ సైతం ఎగ్గొట్టినట్లు తేల్చింది. ఏపీ డిజిటల్ కార్పొరేషన్ నుంచి భారీగా డబ్బులు తీసుకున్న డెక్కన్ మీడియా, త్రీ ఆటమ్ లీవ్స్ స్టోరీ టెల్లింగ్ సంస్థలు జీఎస్టీ ఎగ్గొట్టినట్లు గుర్తించింది. ఈ వ్యవహారంపై ఏసీబీ లేదా సీఐడీతో దర్యాప్తు చేయించాలని ఈ ఏడాది జనవరి 22న ప్రభుత్వానికి నివేదించింది. పరిశీలించిన ప్రభుత్వం ఫిబ్రవరి 25న కేసును సీఐడీకి అప్పగించింది.



కావేరిబాయితో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

డాక్టర్ సుధాకర్ తల్లికి మంత్రి అనిత ఓదార్పు

» న్యాయం జరిగేలా చూస్తామని హామీ

విశాఖపట్నం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ వేధింపులకు ప్రాణాలు కోల్పోయిన నర్సీపట్నం ఆస్పత్రి మత్తు వైద్యుడు డాక్టర్ సుధాకర్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు. కరోనా సమయంలో మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌పై కేసులు పెట్టారు. నడిరోడ్డుపై లాఠీలతో కొట్టి, మానసిక వైద్యశాలలో చేర్చి తీవ్రంగా వేధించిన సంగతి తెలిసిందే. ఆ తరువాత ఆయన చనిపోయారు. ఆ కేసుల విచారణ ఇంకా పూర్తికాలేదు. ప్రస్తుతం డాక్టర్ సుధాకర్ కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆయన తల్లి కావేరీబాయి ఇటీవల మంత్రి అనితకు ఫోన్ చేసి 'ఓసారి కలుస్తాం. న్యాయం చేయాలి' అని కోరారు. తానే స్వయంగా ఇంటికి వచ్చి కలుస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆ మేరకు శుక్రవారం విశాఖపట్నం సీతమ్మధారలో ఉంటున్న కావేరీబాయి ఇంటికి వెళ్లి పరామర్శించారు. డాక్టర్ మరణం తరువాత జరిగిన విషయాలు అడిగి తెలుసుకున్నారు. తమ కేసును సీబీఐతో విచారణ చేయించాలని హైకోర్టు ఆదేశించిందని, అయితే అది ఇంకా పూర్తికాలేదని కావేరీబాయి తెలిపారు. అన్ని విషయాలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఏసీబీ కేసును కొట్టివేయండి

» హైకోర్టును ఆశ్రయించిన జాషువా

» ముందస్తు బెయిల్ పిటిషన్లు వేసిన మాజీ మంత్రి రజనీ మరిది, పీఏ

అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి రూ.కోట్లు వసూలు చేసిన ఆరోపణతో తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి పి. జాషువా(ఏ2) శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు ఆధారంగా తదుపరి చర్యలు నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. "ఫిర్యాదుదారుడి నుంచి డబ్బు డిమాండ్ చేసినట్టు నాపై ఎలాంటి ఆరోపణలు లేవు. అవినీతి నిరోధక చట్టం కింద నాపై నమోదు చేసిన సెక్షన్లు చెల్లుబాటు కావు. రాజకీయ వర్గాల మధ్య ఉన్న వివాదంలోకి నన్ను లాగారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని నాపై కేసును కొట్టివేయండి" అని పిటిషన్‌లో అభ్యర్థించారు. లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్స్ భాగస్వామి నల్లపనేని చలపతిరావు పెట్టిన ముడుపులు, బెదిరింపుల కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ మంత్రి విడదల రజని మరిది విడదల గోపీనాథ్(ఏ3), ఆమె వ్యక్తిగత సహాయకుడు దొండ రామకృష్ణ(ఏ4) హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

2న రావాల్సిందే

» లేదంటే అరెస్టు తప్పదు.. విజయ్‌కుమార్‌రెడ్డికి ఏసీబీ స్పష్టీకరణ



అమరావతి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సమాచార శాఖలో గతంలో జరిగిన అవకతవకల వ్యవహారంలో ఏప్రిల్ 2న విచారణకు రావాలంటూ ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డికి అవినీతి నిరోధక శాఖ మరోసారి నోటీసు జారీచేసింది. "మీరు కేసు విచారణకు అవసరమైన డాక్యుమెంట్లు ఇచ్చి దర్యాప్తునకు సహకరించాలి.. ఈసారి రాకపోతే బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(6) కింద అరెస్టు చేస్తాం."అని ఆ నోటీసులో స్పష్టం చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ సొంత మీడియాతోపాటు కూలీ మీడియాకూ; వలంటీర్లతో సాక్షి పత్రిక కొనిపించేందుకు రూ.వందల కోట్లను నిబంధనలకు విరుద్ధంగా విజయ్‌కుమార్‌రెడ్డి దోచిపెట్టారంటూ విజిలెన్స్ విచారణలో తేలింది. 2019 నుంచి 2024 వరకూ జరిగిన ఈ బాగోతంలో మొత్తం రూ.859కోట్ల మేర ప్రభుత్వ ధనం విజయ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఖర్చు చేశారు. ఇందులో సగానికి పైగా సాక్షి పత్రికకు అందించారన్న అభియోగాలపై గతేడాది నవంబరు 14న విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసింది. దీనిపై విచారణకు రావాలంటూ ఈ నెల 18న విజయ్ కుమార్ రెడ్డికి నోటీసు పంపారు. తక్షణమే తాను రాలేనని, వీలు చూసుకుని వస్తానని ఆయన బదులిచ్చారు. అదే సమయంలో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 2న గుంటూరులోని ఏసీబీ రీజినల్ కార్యాలయానికి వచ్చి విచారణకు సహకరించాలంటూ అడిషనల్ ఎస్పీ మహేశ్ తాజాగా మరోసారి నోటీసులు జారీ చేశారు. కేసు ప్రస్తుత దశలో అరెస్టు చేయబోమని, అలాగని ఈసారి రాకపోతే బీఎన్ఎస్ఎస్ కింద తదుపరి చర్యలు తప్పవని నోటీసులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్.. తాను విచారణకు హాజరవుతానని ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అదే విషయం శుక్రవారం హైకోర్టుకు కూడా ఆయన వెల్లడించారు.

అరెస్టు చేయరా?

» ఏసీబీ నోటీసు తీరుపై ప్రశ్నలు

ప్రస్తుత దశలో తాము విజయ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేయబోమంటూ ఏసీబీ ఇచ్చిన నోటీసుపై సోషల్ మీడియాలో ప్రశ్నలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై స్పందించిన ఏసీబీ డీజీ అతుల్ సింగ్...గత ఏడాది జూలై 1నుంచి అమల్లోకి వచ్చిన బీఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం నిందితులను విచారణకు పిలిచే ఫార్మాట్ ప్రకారమే నోటీసు ఇచ్చామని స్పష్టం చేశారు. కేంద్ర సర్వీసులో (ఐఐఎస్)లో ఉండగానే జగన్ పాదయాత్రకు తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి మద్దతుగా నిలిచారు. జగన్ ప్రభుత్వంలో ఏపీలో సమాచార శాఖ కమిషనర్‌గా విచ్చలవిడి వ్యవహారాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. 2024లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆయనకు చిక్కులు ఎదురయ్యాయి.

ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో వాదనలు..

ఏప్రిల్ 2న ఏసీబీ అధికారుల ముందు విచారణకు హాజరు కావాలని విజయ్‌కుమార్ రెడ్డిని హైకోర్టు ఆదేశించింది. అంతకుముందు.. విజయ్‌కుమార్‌రెడ్డి తరఫు న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. 'సాక్షి పత్రిక, చానల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చారంటూ విజయకుమార్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసు ఇచ్చింది. దానికి లోబడి ఏప్రిల్ 2న ఏసీబీ విచారణకు ఆయన హాజరు అవుతారు. నోటీసులో పేర్కొన్న షరతులకు కట్టుబడి ఉంటారు' అని తెలిపారు. పిటిషనర్‌పై మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అదనంగా సెక్షన్ చేర్చారని, ఈ విషయాన్ని నోటీసులో ప్రస్తావించలేదని తెలిపారు. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ... 'పిటిషనర్ గత ఏడాది డిసెంబరు 31న బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అప్పటినుండి పిటిషనర్‌కు రక్షణ కల్పిస్తూ కోర్టు ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేదు. ఇప్పటికే ఏసీబీ అధికారులు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు ఇచ్చారు. దానికి కట్టుబడి ఉండేలా పిటిషనర్‌ను ఆదేశించాలి' అని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు... విజయ్‌కుమార్‌రెడ్డికి తగిన ఆదేశాలు జారీచేశారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థన మేరకు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ఏప్రిల్ మూడో వారానికి వాయిదా వేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



వంటిల్లు

ఉగాదినాడు ఆరు రుచులు కలగలసిన 'ఉగాది పచ్చడి'తోపాటు బొబ్బట్లు, మామిడికాయ పులిహోర, పాయసం... ఇలా రకరకాల వంటలు చేసుకుంటూ ఉంటాం. వీటితో పాటు పండుగనాడు మరికొన్ని విభిన్నమైన రుచులు కూడా ప్రయత్నించాలనుకొంటే... ఈ వంటలు మీ కోసమే...

ఉగాదికి విభిన్న రుచులు

శ్రీఖండ్

కావాల్సిన పదార్థాలు

పెరుగు- అర లీటరు, పంచదార- ఒక కప్పు, బాదం- పది, పిస్తా- పది, జీడిపప్పు- పది, టూటీ ఫ్రూటీ- నాలుగు చెంచాలు, యాలకుల పొడి- చిటికెడు, కుంకుమ పువ్వు- అయిదు రేకులు

తయారీ విధానం

• జీడిపప్పు, బాదం, పిస్తా పప్పులను చిన్న పలుకుల్లా కోసి పెట్టుకోవాలి. నాలుగు చెంచాల పాలలో కుంకుమపువ్వు రేకులు వేసి నానబెట్టాలి. పంచదారను పొడి చేసుకోవాలి.

• ఒక గిన్నె మీద పలుచని వస్త్రాన్ని వేసి అందులో కమ్మని గడ్డ పెరుగు వేసి మూటలా కట్టాలి. ఈ మూటను రంధ్రాలు ఉన్న గిన్నెలో ఉంచి గిన్నె ను ఒక పళ్లెంలో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. ఆరు గంటల తరవాత గుడ్డలో మిగిలిన గట్టి పెరుగును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. దీన్ని చెంచాతో బాగా కలుపుతూ చిక్కని క్రీమ్‌లా చేయాలి. ఇందులో పంచదార పొడి వేసి బాగా కలపాలి. చిటికెడు యాలకుల పొడి, కుంకుమ పువ్వు నానబెట్టిన పాలు పోసి కలపాలి. జీడిపప్పు, బాదం, పిస్తా పలుకులు వేసి మరోసారి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీసుకుని పైన టూటీ ఫ్రూటీ చల్లి సర్వ్ చేయాలి.

జాగ్రత్తలు

• పెరుగు పుల్లగా కాకుండా తియ్యగా కమ్మగా ఉండాలి.
• వస్త్రంలో వడకట్టిన గట్టి పెరుగును బాగా బీట్ చేస్తే శ్రీఖండ్ రుచి బాగుంటుంది.

కొత్తిమీర వడలు

కావాల్సిన పదార్థాలు

శనగపిండి- ఒకటిన్నర కప్పులు, పసుపు- పావు చెంచా, జీలకర్ర- ఒక చెంచా, వాము- అర చెంచా, పచ్చి మిర్చి- అయిదు, ధనియాల పొడి- ఒక చెంచా, కారం- ఒక చెంచా, తెల్ల నువ్వులు- మూడు చెంచాలు, ఉప్పు- ఒక చెంచా, నూనె- వడలు వేయించడానికి కావాల్సినంత, కొత్తిమీర తరుగు- మూడు కప్పులు

తయారీ విధానం

• మిక్సీ గిన్నెలో జీలకర్ర, పచ్చి మిర్చి ముక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.

• వెడల్పాటి గిన్నెలో శనగపిండి, వాము, ఉప్పు, పసుపు వేసి బాగా కలపాలి. తరవాత కొద్ది కొద్దిగా నీళ్లు చిలకరిస్తూ పిండిని గంటె జారుగా కలపాలి.

• స్టవ్ మీద గిన్నె పెట్టి మూడు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో పచ్చి మిర్చి-జీలకర్ర పేస్టు, నువ్వులు, కారం, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండు నిమిషాలు వేగనివ్వాలి. వెంటనే కొత్తిమీర తరుగు వేసి కలిపి అయిదు నిమిషాలు వేగనివ్వాలి. తరవాత ఇందులో శనగపిండి మిశ్రమం పోసి గరిటెతో కలుపుతూ ఉండాలి. పిండి దగ్గరకు వచ్చి గట్టి ముద్దలా అయిన తరవాత స్టవ్ మీద నుంచి దించాలి. ఒక పళ్లేనికి నూనె రాసి అందులో ఈ పిండి ముద్దను సమంగా పరచాలి. పిండి చల్లారిన తరవాత చాకుతో చతురస్రాకారపు ముక్కలుగా కోయాలి.

• స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికి పైగా నూనె పోసి బాగా వేడి చేయాలి. తరవాత ఇందులో పిండి ముక్కలు వేసి దోరగా వేపాలి. ముక్కలు రెండు వైపులా బంగారు రంగులో వేగాక పళ్లెంలోకి తీయాలి. ఈ కొత్తిమీర వడలు వేడిగా ఉన్నప్పుడు తింటే కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.

జాగ్రత్తలు

• శనగపిండి పరిమాణాన్ని తగ్గించి దానికి బదులు బియ్యప్పిండి లేదా మొక్కజొన్న పిండి వాడుకోవచ్చు
• మంట పెద్దగా లేదా మధ్యస్థాయిలో ఉండేలా చూసుకోవాలి. నూనె బాగా వేడెక్కినాకే పిండి ముక్కలు వేసి వేయించాలి. లేదంటే వడలు బాగా నూనె పీల్చుకుంటాయి.
• పిండి ముక్కలను నిండు నూనెలో వేయించడం ఇష్టం లేనివారు షాలోఫ్రై చేసుకోవచ్చు. ఆవిరి మీద ఉడికించి తిన్నా బాగుంటాయి.



మావా బాటీ



కావాల్సిన పదార్థాలు

పంచదార- రెండు కప్పులు, నీళ్లు- రెండు కప్పులు, యాలకుల పొడి- ఒక చెంచా, కుంకుమ పువ్వు రేకులు- పదిహేను, కోవా- పావు కేజీ, మైదా- నాలుగు చెంచాలు, బేకింగ్ సోడా- పావు చెంచా, జీడిపప్పు- పది, బాదం- పది, పిస్తా- పది, పసుపు రంగు- చిటికెడు, నూనె- వేయించడానికి తగినంత

తయారీ విధానం

• ముందుగా కాజు, బాదం, పిస్తా పప్పులను చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. వీటన్నింటినీ ఒక గిన్నెలో వేసి అందులో అర చెంచా యాలకుల పొడి, కుంకుమ పువ్వు- తొమ్మిది రేకులు, పసుపు రంగు కూడా వేసి బాగా కలపాలి.

• స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో పంచదార, నీళ్లు, అర చెంచా యాలకుల పొడి, కుంకుమపువ్వు రేకులు ఆరింటిని వేసి బాగా కలపాలి. పది నిమిషాల తరవాత పంచదార మొత్తం కరిగి పాకం జిగురుగా మారుతుంది. ఇలా తేనె పాకం తయారయ్యాక స్టవ్ మీద నుంచి దించాలి.

• కోవాను ఒక పళ్లెంలోకి సన్నగా తురమాలి. ఇందులో మైదా పిండి, బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. ఎక్కడా పగుళ్లు లేకుండా మెత్తని ముద్దలా చేయాలి. ఈ ముద్దని చాకుతో ఎనిమిది భాగాలు చేయాలి. ఒక భాగాన్ని గిన్నెలోకి తీసుకుని అందులో కాజు-బాదం మిశ్రమం వేసి బాగా కలపాలి. దీన్ని ఏడు భాగాలు చేసి ఒక్కోదాన్ని చిన్న ముద్దలా చేయాలి.

• కోవా-మైదా భాగాలను చిన్న బిళ్లలుగా చేసి ఒక్కోదాని మధ్యలో కాజు-బాదం ముద్ద పెట్టి అంచులు మూసి మరోసారి బిళ్లలా చేయాలి.

• స్టవ్ మీద మూకుడు పెట్టి బిళ్లలు మునిగేంత నూనె పోసి చిన్న మంట మీద వేడి చేయాలి. నూనె కొద్దిగా వేడెక్కాక ఇందులో పైన తయారు చేసి పెట్టుకున్న బిళ్లలు వేసి రెండు వైపులా ముదురు గోధుమ రంగు వచ్చేవరకూ వేయించాలి. తరవాత వీటిని తీసి పంచదార పాకంలో వేయాలి. వీటిని పాకంలో నాలుగు గంటలు నాననివ్వాలి. తరవాత సర్వ్ చేసుకోవచ్చు. ఇవి గులాబ్ జామూన్‌లాగే కనిపిస్తాయి కానీ వీటి రుచి అమోఘంగా ఉంటుంది.

జాగ్రత్తలు

• కోవా-మైదాల మిశ్రమాన్ని మృదువుగా ఒత్తుతూ కలపాలి.
• బిళ్లలు వేయించడానికి నూనెను ఎక్కువగా వేడి చేయకూడదు. చిన్న మంట మీద నూనెలో బిళ్లలను మెల్లగా కదుపుతూ వేపాలి. బిళ్లలు ముదురు రంగులో వేగితేనే మావా బాటీ రుచిగా ఉంటుంది.

బుట్టే కా కీస్

కావాల్సిన పదార్థాలు

బేబీకార్న్- 8, శనగపిండి- రెండు చెంచాలు, నెయ్యి- మూడు చెంచాలు, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, పచ్చిమిర్చి- రెండు, అల్లం తరుగు- ఒక చెంచా, ఇంగువ- చిటికెడు, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి- పావు చెంచా, చిక్కని పాలు- ఒక కప్పు, కారం- అర చెంచా, పంచదార- ఒక చెంచా, ఉప్పు- ముప్పావు చెంచా, నిమ్మరసం- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు, చాట్ మసాలా- అర చెంచా, కొబ్బరి తురుం- రెండు చెంచాలు

తయారీ విధానం

• బేబీకార్న్‌ను మిక్సీలో వేసి కచాపచాగా గ్రైండింగ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకోవాలి. స్టవ్ మీద పాన్ పెట్టి శనగపిండి వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. పాన్‌లో రెండు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. ఇందులో ఆవాలు, జీలకర్ర, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం తరుగు, ఇంగువ, పసుపు, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. ఇవన్నీ వేగాక, మిక్సీ పట్టిన బేబీకార్న్ వేసి బాగా కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం పొడి పొడిగా మారిన తరవాత వేయించిన శనగపిండి వేసి కలపాలి. తరవాత పాలు పోసి కలపాలి. ఈ మిశ్రమం దగ్గరకు వచ్చిన తరవాత కారం, పంచదార, ఉప్పు, ఒక చెంచా నెయ్యి వేసి కలిపి మూత పెట్టి అయిదు నిమిషాలు ఉంచాలి. తరవాత నిమ్మకాయ రసం, కొత్తిమీర వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. దీని మీద చాట్ మసాలా, కొబ్బరి తురుం, కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేయాలి.



జాగ్రత్తలు

• వంటకం పూర్తయ్యే వరకూ స్టవ్‌ను చిన్న మంట మీదనే ఉంచాలి.
• శనగపిండికి బదులు గోధుమ పిండిని వాడుకోవచ్చు. పాలకు బదులు నీళ్లు పోసుకోవచ్చు.

అమృతాహారం చుక్కకూర

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

మనకు అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆకుకూరల్లో- చుక్కకూరకు ఒక ప్రత్యేకత ఉంది. ఇప్పుడైతే పులుపు కావాలనుకుంటే చింతపండును ఉపయోగిస్తాం. కానీ ఒకప్పుడు మన పూర్వీకులు పులుపు కోసం చుక్కకూరనే ఉపయోగించేవారు. మన ఆయుర్వేద గ్రంథాల్లో చుక్కకూరకు ఉన్న గుణగణాలను.. దాని వల్ల కలిగే లాభాలను వివరించారు. ఆ లాభాలేమిటో చూద్దాం..

• చుక్కకూరలో అనేక విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా లభిస్తాయి. దీనిని ప్రతి రోజు తీసుకుంటే రోగనిరోధక శక్తి బాగా పెరుగుతుంది. దీనిలో కొన్ని రకాలైన రసాయనాలు ఉంటాయి. ఇవి విష దోషాల నివారణకు ఉపకరిస్తాయి.

• చుక్క కూరను ఆయుర్వేద ఔషధాల తయారీకి కూడా వినియోగిస్తారు.

• చుక్క కూర పేగులను శుభ్రపరుస్తుంది. జీర్ణక్రియను ఉత్తేజపరుస్తుంది. పచ్చకామెర్లు లాంటి వ్యాధులు వచ్చినప్పుడు కూడా చుక్కకూరను తినవచ్చు. దీనిలో క్షార గుణాలున్న ఫ్లవనాయిడ్స్, పాలీఫినాల్స్ ఉండటం వల్ల కడుపులో మంట కలిగించదు.

> చుక్కకూరలో కాల్షియం ఆక్సిలైట్స్ ఎక్కువగా ఉంటాయి. అందువల్ల మూత్ర నాళాల్లో రాళ్లు ఉన్నవారు దీనిని ఎక్కువగా తినకూడదు. పరిమితంగానే వాడాలి.

• ఇది రక్తాన్ని శుద్ధి చేస్తుంది. రక్త సమృద్ధికి ఉపకరిస్తుంది.

• కూరల్లోను, పప్పుల్లోను చింతపండుకు బదులుగా చుక్కకూరను వాడుకోవచ్చు.

చుక్కకూరతో చారు...



చుక్కకూరతో తయారుచేసే చారు వల్ల అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయి. దీనిని క్రమం తప్పకుండా ప్రతి రోజూ తింటే జీర్ణశక్తి పెరుగుతుంది. ఏవైనా విషదోషాలు ఉంటే వాటి ప్రభావం తగ్గుతుంది. దీనిని ఎలా తయారుచేయాలో చూద్దాం..

• చుక్కకూరను బాగా కడగాలి. దానిని మిక్సీలోకి వేసి బాగా తిప్పాలి. ఈ మిశ్రమాన్ని ఒక గుడ్డలో వేసి ఒడగట్టాలి. అప్పుడు వచ్చే రసాన్ని తీసి ఒక గిన్నెలో వేయాలి.

• ఈ రసాన్ని కొద్దిగా వేడి చేసి చారుపొడి వేయాలి. ఆ తర్వాత తాళింపు పెట్టాలి.

• కొందరు దీనిలో అల్లం, మిరియాల పొడి కూడా వేస్తారు. దీని వల్ల చుక్కకూర చారు మరింత రుచికరంగా ఉంటుంది.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

వేసవిలో చెమటకు చెదరకుండా...

వేడి, ఉక్కపోతలకు మేకప్ చెదిరిపోవడం సహజం. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఎన్నిసార్లు టిష్యూతో అద్దుకున్నా ఎంతో కొంత మేకప్ అటూ ఇటూ చెదిరిపోతూనే ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...

ముఖం శుభ్రంగా ఉంచుకోవాలి



ముఖాన్ని సబ్బుతో శుభ్రపరుచుకున్న తర్వాత టవల్‌తో రుద్దకుండా, సున్నితంగా అద్దుకోవాలి. తర్వాత తేలికపాటి మాయిశ్చరైజింగ్ జెల్ లేదా లోషన్‌ను పూసుకోవాలి. ఆ తర్వాత అదనపు చర్మ నూనెలు, మాయిశ్చరైజర్‌ను బ్లాటింగ్ పేపర్ అద్దుకుని తొలగించాలి.

ప్రైమర్ వాడుకోవాలి



మేకప్‌కు ముఖాన్ని సిద్ధం చేసుకునేటప్పుడు మొదట ప్రైమర్ అప్లై చేయాలి. ఫేస్, ఐ ప్రైమర్‌లను వాడుకోవడం వల్ల చర్మం నునుపుగా మారి, ఫౌండేషన్ పూతకు తగ్గట్టు తయారవుతుంది.

ఫౌండేషన్ పలుచగా



వేసవి వేడి వాతావరణంలో ఫౌండేషన్ భారీగా వేసుకుంటే అది ముద్దలుగా మారే ప్రమాదం ఉంటుంది. కాబట్టి మాయిశ్చరైజర్, ప్రైమర్ పలుచగా పూసుకున్న తర్వాత ఫౌండేషన్ కూడా వీలైనంత పలుచగా అప్లై చేసుకోవాలి.

సెట్టింగ్ స్ప్రే



సెట్టింగ్ స్ప్రేతో వేసుకున్న మేకప్ ముఖం మీద నిలిచి ఉంటుంది. మేకప్ పూర్తయిన తర్వాత సెట్టింగ్ స్ప్రే వాడుకుని, అది ముఖం మీదే ఆరిపోయేలా చూసుకోవాలి.

ఫిక్సింగ్ పౌడర్



ఈ కాలంలో కాంపాక్ట్ పౌడర్ నుంచి ట్రాన్స్‌ల్యూసెంట్ పౌడర్‌కు మారాలి. చెమట పట్టినప్పుడు కాంపాక్ట్ పౌడర్ చెక్కిళ్ల పైనుంచి కారిపోయి చారికలు ఏర్పడతాయి కాబట్టి వేసవిలో ఈ పౌడర్ వాడకం మానేయాలి.

వాటర్‌ప్రూఫ్



వాటర్‌ప్రూఫ్ మస్కారా, కాజల్, ఐలైనర్‌లను ఎంచుకోవాలి. సాధారణ ఉత్పత్తులతో పోల్చుకున్నప్పుడు వీటిని తొలగించడం కాస్త ఇబ్బందికరమే అయినప్పటికీ మేకప్ అందవిహీనంగా మారిపోకుండా ఉండడం కోసం వేసవిలో వాటర్‌ప్రూఫ్ సౌందర్య సాధనాలనే వాడుకోవాలి.

ట్రెండింగ్

విడిపోయిన బంధం... బరువైన పాటయింది



ధనశ్రీ వర్మ... యజ్వేంద్ర చాహల్... ఒకర్ని ఒకరు ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ కలిసి డ్యాన్స్ వీడియోలు చేసి... ఒకటి తరువాత ఒకటి వదిలారు. కోట్ల మంది అభిమానులను సంపాదించుకున్నారు. అంతా బానేవుందనుకొంటే... ఇంతలోనే విడాకులతో వేరు పడ్డారు. అందుకు ఎవరి కారణాలు వాళ్లకున్నా... ఇటీవల ధనశ్రీ వీడియో సాంగ్ ఒకటి విడుదల చేసింది. అది కూడా గృహ హింసకు సంబంధించింది కావడంతో సామాజిక మాధ్యమాల్లో దీనిపై చర్చ తారస్థాయికి చేరింది.

ధనశ్రీ మొదటి నుంచీ స్వతంత్ర భావాలున్న అమ్మాయి. నలుగురిలో ఒకరిలా కాకుండా... తనకంటూ ఒక ప్రత్యేకత కావాలని కోరుకుంది. క్రికెటర్ చాహల్‌తో పరిచయానికి ముందే ఆమెకంటూ ఒక గుర్తింపు ఉంది. అద్భుతమైన డ్యాన్సర్‌గా ఇన్‌స్టాగ్రామ్‌లో నిత్యం లక్షలమంది అభినందనలు అందుకొంటోంది. క్రికెటర్ చాహల్‌తో పెళ్లి తరువాత, అతడితో కలిసి ఆమె చేసిన డ్యాన్స్ వీడియోలతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుంది. ఆమెది సంపన్న కుటుంబం. ధనశ్రీ తండ్రి కపిల్‌వర్మ పారిశ్రామికవేత్త. తల్లి వర్ష గృహిణి. దుబాయ్‌లో పుట్టిన ధనశ్రీ ముంబయిలో పెరిగింది. ఆమె... చిన్న నాటి నుంచి డాక్టర్ కావాలనుకుంది.

అనుకోని మలుపు...

తను కోరుకున్నట్టే ధనశ్రీ మెడిసిన్‌లో సీటు సాధించింది. బీడీఎల్ పూర్తి చేసింది. అయితే మొదటి నుంచి డ్యాన్స్‌తో పాటు నటనపైన ఉన్న మక్కువ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. చదువుకొనే రోజుల్లోనే ధనశ్రీ డ్యాన్స్, లిప్ సింకింగ్ వీడియోలు చేసి యూట్యూబ్‌లో పోస్ట్ చేసేది. ప్రముఖ డ్యాన్సర్లతో కలిసి చేసిన వీడియోలకు లక్షల్లో వ్యూస్ వచ్చాయి. తన పేరుతో పెట్టుకున్న 'ధనశ్రీవర్మ' చానల్‌ను తక్కువ సమయంలోనే లక్షలమంది సబ్‌స్క్రైబ్ చేశారు. 2020లో క్రికెటర్ చాహల్‌తో పెళ్లి తరువాత ఆమె జీవితం ఊహించని మలుపు తిరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది క్రికెట్ అభిమానులకు దగ్గరైంది.

హిట్ జంట...

పెళ్లి తరువాత చాహల్‌తో కలిసి అడుగులు కదిపింది ధనశ్రీ. ఇరువురూ కలిసి సూపర్ హిట్ పాటలకు డ్యాన్సులు చేసి, వాటిని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ జంట నాట్యానికి కోట్ల మంది ఫిదా అయ్యారు. ఇంటర్‌నెట్‌లో చాహల్, ధనశ్రీలది హిట్ పెయిర్. దేశం దాటి విదేశాల్లో కూడా అభిమానులను సంపాదించుకున్నారు. కొరియోగ్రఫీలో కూడా మంచి పట్టున్న ధనశ్రీ... తనలా మరింతమంది డ్యాన్సర్లను తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఒక నాట్యాలయాన్ని ప్రారంభించింది. 'ఝలక్ దిక్ లాజా' తదితర డ్యాన్స్ రియాలిటీ షోస్‌లో పాల్గొని మురిపించింది. ఇప్పుడామె వార్షిక ఆదాయం 25 కోట్ల రూపాయల పైనే.

మూన్నాళ్ల ముచ్చట...

ధనశ్రీ, చాహల్... ఇద్దరి వృత్తిగత, వ్యక్తిగత జీవితాలు అద్భుతంగా సాగుతున్నాయని అనుకొంటున్న తరుణంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఎప్పటి నుంచో వస్తున్న ఊహాగానాలకు బలం చేకూరుస్తూ... విడిపోతున్నట్టు ఇద్దరూ ప్రకటించారు. సామాజిక మాధ్యమాల్లో, క్రికెట్ మైదానంలో ఎంతో అన్యోన్యంగా కనిపించిన ఈ జంట... మూడు ముళ్ల బంధం మూన్నాళ్ల ముచ్చట అయింది. పెళ్లయిన రెండేళ్లకే ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయని, అవి తారస్థాయికి వెళ్లడంతో... ఇక కలిసి ఉండలేమనే నిర్ణయానికి వచ్చారనేది సన్నిహితుల మాట. 2022 జూన్ నుంచి ఇద్దరూ వేరు కాపురాలు పెట్టారు. పరస్పర అంగీకారంతో ఈ నెల 20న ముంబయి ఫ్యామిలీ కోర్టు ఈ జంటకు విడాకులు మంజూరు చేసింది. భరణం కింద ధనశ్రీకి రూ.4.75 కోట్లు చెల్లించేందుకు చాహల్ అంగీకరించినట్టు సమాచారం.



ఆమెను అగౌరవపరిచేలా...

విడాకులన్నది చాహల్, ధనశ్రీల వ్యక్తిగత నిర్ణయం. కానీ కోర్టు నుంచి విడాకులు పొందాక సామాజిక మాధ్యమాల్లో ధనశ్రీ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారు. కొందరైతే... 'మీ అకౌంట్‌లో ఎంత క్రెడిట్ అయింది' అంటూ ప్రశ్నించారు. 'అతడి డబ్బుతో మీరు ఎలా జీవిస్తారు? మీకు ఆత్మాభిమానం లేదా' అని మరొకరు... ఇలా లెక్కకు మించి ఆమె వ్యక్తిత్వంపై దాడి చేశారు. కానీ ధనశ్రీ వేటికీ స్పందించలేదు. ఎప్పటిలా కెరీర్‌పై దృష్టి పెట్టి, తన పని తాను చేసుకుపోతోంది.

'గృహహింస' పాట...

ఇదిలావుంటే... విడాకులు తీసుకున్న రోజే ధనశ్రీ ప్రత్యేక పాటను విడుదల చేశారు. 'దేఖా జీ దేఖా మైనే' అంటూ సాగే ఈ వీడియో సాంగ్‌లో ఆమె గృహహింస బాధితురాలిగా, భర్త చేతిలో మోసపోయిన భార్యగా నటించారు. 'టీ సిరీస్' దీన్ని విడుదల చేసింది. జ్యోతి నూరన్ ఈ గీతాన్ని ఆలపించారు. ఈ వీడియోలో బాలీవుడ్ నటుడు ఇష్వాక్ సింగ్, ధనశ్రీ భార్యాభర్తలుగా కనిపించారు. తనను ఎంతో ఇష్టపడే భార్యను భర్త మోసం చేస్తాడు. వేరే అమ్మాయితో కలిసి తిరుగుతుంటాడు. ప్రశ్నించిన భార్యను అతడు శారీరకంగా హింసిస్తాడు. చివరకు ఆమె వైవాహిక జీవితానికి స్వస్తి చెప్పడంతో పాట ముగుస్తుంది. బంధాలు, భావోద్వేగాలు, మనస్పర్థలు, ప్రేమలోని సంక్లిష్టతల మధ్య నలిగిపోతున్న ఓ మహిళగా ధనశ్రీ నటించింది. కోర్టు విడాకులు మంజూరు చేసిన రోజే ఈ పాట విడుదల కావడంతో దీనిపై విపరీతంగా చర్చ నడుస్తోంది. యూట్యూబ్‌లో ఇప్పటికి దాదాపు అరవై లక్షల మంది ఈ పాటను వీక్షించారు. విడాకులకు కారణాలు అటు చాహల్ కానీ, ఇటు ధనశ్రీ కానీ బహిరంగంగా చెప్పలేదు. ఇదే విషయాన్ని వీడియో సాంగ్ విడుదల సందర్భంగా ధనశ్రీని అడిగితే... 'ముందు మీరు పాట వినండి' అంటూ బదులిచ్చారు. కానీ విడాకులపై నోరు విప్పలేదు.